

visit us @ http://epaper.suryaa.com

# నేటి దినపత్రిక సూర్య

www.suryaa.com

గురువారం | 13 ఫిబ్రవరి 2025 | విజయవాడ

సంపుటి 18 | సంచిక 113

| పేజీలు 10+8 | వెల: రూ. 6.50

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi



విద్యార్థులకు దిశా నిర్దేశం..నిరుద్యోగులకు మార్గనిర్దేశకం...




- APPSC,TSPSC పోటీపరీక్షల గైడెన్స్
- నిపుణులైన అధ్యాపకులతో నాణ్యమైన మెటీరియల్
- కరెంట్ అఫైర్స్
- నమూనా ప్రశ్నాపత్రాలు
- విద్యా ఉద్యోగ సమాచారం

'సూర్య' ఆన్‌లైన్ఎడిషన్ www.suryaepaper.com చూడండి.


అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయణం - హేమంత ఋతువు, మాఘమాసం బ.పాడ్యమి రా.7.47, మఖ రా.8.52, వర్జ్యం ఉ.8.15 నుంచి 9.56 వరకు
రాహుకాలం మ.1.30 నుంచి 3.00 వరకు దుర్ముహూర్తం ఉ.10.20 నుంచి 11.06 వరకు తిరిగి మ.2.52 నుంచి 3.37 వరకు

## నష్టాల్లో స్టాక్ మార్కెట్‌లు



- ఉదయం 900 పాయింట్లకుపైగా నష్టపోయిన సెన్సెక్స్
- మధ్యాహ్నం కాస్త పుంజుకున్న మార్కెట్లు
- 122 పాయింట్ల నష్టంతో ముగిసిన సెన్సెక్స్

5లో

## అమెరికాలో నక్కిన గ్యాంగ్‌స్టర్లు




- జాబితా సిద్ధం చేసిన భారత్..!
- నివేదిక రూపొందించిన భద్రతా ఏజెన్సీలు
- అమెరికాకు ఇవ్వనున్నట్లు సమాచారం

వివరాలు-6లో

# ఉచితాలు అనుచితాలే...

- ఉచితాలు ఇస్తే.. ప్రజలు పని ఎందుకు చేస్తారు
- రాజకీయ పార్టీల పథకాలపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

ఉచిత పథకాలను ఉద్దేశిస్తూ సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఎన్నికల సమయంలో ఆయా రాజకీయ పార్టీలు వీటిని ప్రకటించే పద్ధతి మంచి కాదని వ్యాఖ్యానించింది. పట్టణ ప్రాంతాల్లో నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించాలని దాఖలైన పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం.. ఉచితాలపై ఈ వ్యాఖ్యలు చేసింది.



6లో

## నా స్నేహితుడిని కలవడం సంతోషంగా ఉంది

- ఏఐ యాక్షన్ సమ్మిట్‌కు ముందు అధ్యక్షుడు మాక్రాన్ ప్రధాని మోడీ భేటీ
- యూఎస్ ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌తో సహా అతిథులకు విందు
- కొత్త భారత నూతన కాన్సులేట్ పారంభం
- నేడు ట్రంప్‌తో భారత ప్రధాని భేటీ

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఫ్రాన్స్ పర్యటనకు వెళ్లిన విషయం అందరికీ తెలిసిందే. 3 రోజుల పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ వెళ్లగా.. సోమవారం రోజు ఉదయం అక్కడకు చేరుకున్నారు. ఏఐ శిఖరాగ్ర సమావేశానికి ముందుగా ఫ్రాన్స్ దేశాధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్‌తో సమావేశం అయ్యారు. అలాగే విందులో కూడా పాల్గొన్నారు. అక్కడే అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌ను సైతం కలుసుకున్నారు.



6లో

## మార్చిలో డీఎస్సీ నోటిఫికేషన్

- జూన్ నాటికి నియామక ప్రక్రియ పూర్తి చేస్తాం
- జీఓ 117కు ప్రత్యామ్నాయం తీసుకొస్తాం
- విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ వెల్లడి

నిరుద్యోగులకు ఏపీ ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. 16,247 టీచర్ పోస్టుల భర్తీకి మార్చిలో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు పాఠశాల విద్యాశాఖ బుధవారం వెల్లడించింది.

2లో

## ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలి




2లో

- ప్రజల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం
- ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ కోసం ప్రత్యేక కార్యక్రమాలు...ప్రజలకు డిజిటల్ హెల్త్ కార్డులు
- తక్కువ ఖర్చుతో పేదలకు నాణ్యమైన వైద్యం కోసం రూ.1618 కోట్లతో ఎయిమ్స్ నిర్మాణం
- మంగళగిరి ఎయిమ్స్‌కు గత ప్రభుత్వం నీళ్లివ్వకుండా వేధింపులుఅధికారంలోకి రాగానే సమస్యను చక్కదిద్దాం
- వైద్య రంగంలో కిమ్స్‌ది ప్రత్యేక స్థానం...అత్యాధునిక వైద్యసేవలు అందుబాటులోకి తెచ్చింది
- గుంటూరులో కిమ్స్ శిఖర ఆస్పత్రి ప్రారంభోత్సవంలో ఏపీ సీఎం


సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్


## కరువు ప్రాంతం సస్య శ్యామలంగా మారుస్తాం

- విజన్ లీడర్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మరియు హ్యాండ్లూమ్స్ టెక్స్టైల్ శాఖ మంత్రివర్యులు సవితమ్మ



2లో

రాయల సీమ రాళ్ల సీమగా మారినా కరువు ప్రాంతం సస్య శ్యామలం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం అని రాష్ట్ర చేనేత శాఖ మంత్రి శ్రీ మతి సవిత పేర్కొన్నారు. బుధవారం గొల్లపల్లి రిజర్వాయర్ కు ఆమె గంగ పూజ చేశారు. ఈ సందర్భంగా పత్రిక సమావేశంలో మంత్రివర్యులు మాట్లాడుతూఈ రిజర్వాయర్ ద్వారా సాగు నీరు, త్రాగు నీరు అందించడానికి వీలుగా కృషి చేయడం జరుగుతోందని రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో ఈ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడం జరుగుతోందని ఆమె అన్నారు.

## మంత్రి చొరవతో ఎస్సీ హాస్టల్ పునర్నిర్మాణం



2లో

- రూ.45 లక్షల నిధులతో పూర్తి స్థాయిలో హాస్టల్ ఆధునీకరణ
- ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల విద్యకు కూటమి ప్రభుత్వం అండదండలు
- గొట్టిపాటికి కృతజ్ఞతలు తెలిపిన విద్యార్థులు, గ్రామస్థులు
- మంత్రి గొట్టిపాటి రవికుమార్

## నోటాపై రాజకీయ పార్టీలతో ఈసీ సమావేశం

- పాల్గొన్న ప్రముఖ రాజకీయ పార్టీలు
- వారివారి అభిప్రాయాలను చెప్పిన ఆయా పార్టీల నేతలు

స్థానిక సంస్థల ఎన్నికల్లో నోటాను కల్పిత అభ్యర్థిగా పెట్టాలా వద్ద అనే అంశం రాజకీయ పార్టీల్లో మిశ్రమ స్పందన వ్యక్తం అయింది కాంగ్రెస్ పార్టీ ఈ పద్ధతిని వ్యతిరేకించగా బీఆర్ఎస్ పార్టీ స్వాగతించింది




3లో

## రైతులకు టీఎస్ సర్కార్ శుభవార్త




3లో

- 3 ఎకరాల వరకు సాగులో ఉన్న భూములకు, జమకానున్న రైతు భరోసా నిధులు
- తెలంగాణ వ్యవసాయ శాఖ

తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు శుభవార్త చెప్పింది. మూడు ఎకరాల వరకు సాగులో ఉన్న భూములకు రైతు భరోసా నిధులు జమ చేసినట్లు వ్యవసాయ శాఖ తెలిపింది. జనవరి 26న ప్రారంభమైన ఈ పథకం అమలులో భాగంగా.. ఫిబ్రవరి 5న ఒక ఎకరానికి లోపు భూమి కలిగిన రైతులకు నిధులు జమ చేసిన విషయం తెలిసిందే.

## అంతా ఇంతే!




ఆ హోదా రావాలంటే కొత్తగా ఎమ్మెల్యేలను కొంటారా?

## బీసీ రిజర్వేషన్లు 42% అమలు చేయాలి

- కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలుపై సీఎం రేవంత్‌కు లేఖ
- బీసీ గణనలో బీసీలను తక్కువగా చూపారు
- ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లపై సమీక్ష చేయాలి
- సోషల్ జస్టిస్ పార్టీ రాష్ట్ర ఇంచార్జ్ కేవీ గౌడ్ బహిరంగ లేఖ
- సోషల్ జస్టిస్ పార్టీ, బీసీ ఇంటలెక్చువల్ ఫోరం, బీసీ హిందూ మహాసభలు విజ్ఞప్తి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2024 సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ కుల సర్వే రిపోర్ట్ లో లోపాలు – తెలంగాణ రాష్ట్ర జనాభా తగ్గుదల గురించి – బీసీ జనాభా తగ్గుదల – సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ కుల సర్వే పూర్తి వివరాలు బహిర్గతం చేయుట, కామారెడ్డి డిక్లరేషన్ లో చెప్పిన విధంగా పంచాయతీ, స్థానిక సంస్థలలో బిసి రిజర్వేషన్లను 42%నికి పెంపు కొరకు రాష్ట్ర అసెంబ్లీలో చట్టం చేసి రాజ్యాంగబద్ధత కల్పించుట – ఈ డబ్ల్యూ ఎస్ రిజర్వేషన్లను సమీక్షించుట గురించి ఏం కు రాసిన లేఖలో వివరించారు.




3లో

## మరోసారి కుల గణన సర్వే



3లో

- రాష్ట్రంలో ఫిబ్రవరి 16 నుంచి 28 వరకు రీ సర్వే నిర్వహించనున్నట్లు వెల్లడి
- సర్వేలో పాల్గొనని వారి కోసం ఈ నిర్ణయం తీసుకున్నామన్న ఉపముఖ్యమంత్రి
- రాష్ట్రంలో 3.1 శాతం జనాభా సర్వేలో పాల్గొనలేదని వెల్లడి

## 14% మార్జిన్ పెంపుతో ఆదాయానికి గండి పడదు

- బాటిల్‌పై రూ.10 పెంపుతో ప్రభుత్వానికి ఏటా రూ.100 కోట్ల వరకు ఆదాయం
- 90 వేల దరఖాస్తులే, షాపుల కేటాయింపులో పారదర్శకతకు నిదర్శనం
- నవోదయం 2.0తో సారా రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దుతాం
- రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర

మద్యం దుఖాణాలకు 14 శాతం మార్జిన్ పెంపుతో ప్రభుత్వ ఆదాయానికి ఏ మాత్రం గండి పడే అవకాశం లేదని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. బాటిల్ పై రూ.10 పెంపుతో ప్రభుత్వానికి ఏటా రూ.100 కోట్ల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉందన్నారు.




2లో

# మహాకుంభమేళాకు ఈటల

● మాఘ పౌర్ణమి రోజున పవిత్ర స్నానం
● పాల్గొన్న ఎంపీలు డీకే అరుణ, బీబీపాటిల్ 45మంది ప్రతినిధులు సాదర స్వాగతం పలికిన పెరిక సురేశ్



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక మేళాగా ప్రయాగ్రాజ్లో జరుగుతున్న 'మహాకుంభ్' లో మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ మంగళవారం పాల్గొన్నారు. గంగా, యుమనా, సరస్వతీ నదులు సంగమించే త్రివేణి సంగమంలో మాఘ పౌర్ణమి రోజున పవిత్ర స్నానం ఆచరించారు. దీనికి ముందు 45మంది ప్రజాప్రతినిధులతో ప్రయాగ్రాజ్కు చేరుకున్న ఈటలకు నమో వందేగోమాతరం ఆల్ ఇండియా ప్రెసిడెంట్ పెరిక సురేశ్, కమలేశ్ ఆచార్య స్వామీజీ తదితరులు సాదర స్వాగతం పలికారు. మహాకుంభ కీలక రోజులు కావడంతో మహాకుంభ్ ఏరియాలో 'నో వెహికల్ జోన్' ప్రకటించారు. ఈనేపథ్యంలో ఈటల రాజేందర్ సాధారణ పౌరునిలా 18కిలోమీటర్లు నడిచి వెళ్లి ఈ పుణ్యస్నాన కార్యక్రమంలో పాల్గొన్నారు. పలువురు పీఠాధిపతుల ఆశీర్వాదం అందుకున్నారు. అనంతరం కాశీ ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఈటెల రాజేందర్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలతో పాటు సనాతన ధర్మం, ప్రజల విశ్వాసాన్ని గౌరవించాలని అన్నారు. జాతి మతం కులాలకు అతీతంగా ప్రపంచవ్యాప్తంగా భక్తజనం ఈమహాకుంభమేళాకు జనసంద్రంగా హాజరవడం భారత దేశ విశిష్టతకు తార్కాణమని ఆయన పేర్కొన్నారు. రాజకీయాలపై రాజేందర్ మాట్లాడుతూ 27 ఏళ్ల తరువాత ఢిల్లీలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటైంది. భవిష్యత్తులో తెలంగాణలోనూ బీజేపీ అధికారంలోకి వస్తుందని ఈటెల ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పెరిక సురేష్ మాట్లాడుతూ గత 27రోజులుగా ప్రయాగ్రాజ్లో సేవాకార్యక్రమాలు చేస్తున్నామనీ, రోజు 2వేల మందికి అన్నధానం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సాధువులకు పదివేల బ్లాంకెట్లు పంచినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు డీకే అరుణ, బీబీ పాటిల్, లతో పాటు నేతలు వేణుగోపాల్రెడ్డి, గిరివర్ధన్రెడ్డి, మధుసూధన్రావు, నందకిశోర్, బద్దం మహిపాల్రెడ్డి తదితరులు హాజరైయ్యారు.

# మరోసారి కుల గణన సర్వే



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: తెలంగాణలో మళ్లీ కుల గణన సర్వే నిర్వహించనున్నట్లు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. గత సర్వే సమయంలో పలువురు ఉద్దేశ పూర్వకంగా వివరాలు వెల్లడించలేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మరోసారి కుల గణన సర్వే నిర్వహిస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. ఫిబ్రవరి 16 నుంచి 28వ తేదీ వరకు ఈ సర్వే నిర్వహిస్తామని ఆయన స్పష్టం చేశారు. బుధవారం హైదరాబాద్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విలేకర్లతో మాట్లాడుతూ.. తెలంగాణలో 3.1 శాతం మంది సర్వేలో పాల్గొన లేదని చెప్పారు.
గతంలో నిర్వహించిన సర్వేలో పాల్గొనని వారి కోసమే ఈ సారి నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అలాగే కుల గణన సర్వే కోసం టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఇక కొందరు ఉద్దేశపూర్వకంగా ఈ సర్వేలో వివరాలు వెల్లడించ లేదని మల్లు భట్టి విక్రమార్క వివరించారు.

# జీతాలు చెల్లించాలి

● చేతిలో చిల్లిగవ్వలేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు
● ఇది ప్రజా పాలన కాదు, ప్రజా వ్యతిరేక పాలన
● మాజీ మంత్రి హరీశ్ రావు



తెలంగాణ బ్యూరో,ప్రతినిధిః రాష్ట్ర వ్యాప్తంగా 16 వేలకు పైగా ఉన్న హోంగార్డులకు 12 రోజులు గడస్తున్నా.. ప్రభుత్వం జీతాలు చెల్లించకపోవడం సిగ్గుచేటు అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు మండిపడ్డారు. చిన్న జీతాలపైనే ఆధారపడి జీవిస్తున్న హోంగార్డులు చేతిలో చిల్లిగవ్వలేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఫైర్ అయ్యారు. ఇంటి అద్దెలు, పిల్లల స్కూల్ ఫీజులు, రోజువారీ ఖర్చుల కోసం అప్పులు చెయ్యాల్సిన దుస్థితి నెలకొందన్నారు. పథకాల్లో కోతలు, జీతాలు చెల్లించకుండా ఉద్యోగులకు వాతలు అంటూ ఎక్స్లో హరీశ్ రావు విమర్శలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 16 వేలకు పైగా ఉన్న హోం గార్డులకు 12 రోజులు గడస్తున్నా జీతాలు చెల్లించకపోవడం సిగ్గుచేటు. చిన్న జీతాలపైనే ఆధారపడి జీవిస్తున్న హోంగార్డులు చేతిలో చిల్లిగవ్వలేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇంటి అద్దెలు, పిల్లల స్కూల్ ఫీజులు, రోజువారీ ఖర్చుల కోసం అప్పులు చెయ్యాల్సిన దుస్థితి నెలకొంది. ఈఎంఐలు చెల్లించకపోవడం వల్ల బ్యాంకు అధికారులు ఫోన్లు చేసి నిలదీస్తున్న పరిస్థితి వచ్చింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి ప్రతి నెలా ఇదే తీరు కొనసాగుతున్నా పట్టించుకునే వారే లేరు. మాటలు కోటలు దాటితే, చేతలు గడప దాటని ముఖ్యమంత్రి గారు వీరికి ఏం సమాధానం చెబుతారు?. పథకాల్లో కోతలు, జీతాలు చెల్లించకుండా ఉద్యోగులకు వాతలు.. ఇది ప్రజా పాలన కాదు, ప్రజా వ్యతిరేక పాలన. హోంగార్డులకు వేతనాలు తక్షణం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు పేర్కొన్నారు.

# బీసీ రిజర్వేషన్లు 42 శాతం అమలు చేయాలి


● కామారెడ్డి డిక్లరేషన్ ను అమలు చేయాలి ● సీఎం రేవంత్కు లేఖ ● బీసీ గణనలో బీసీలను తక్కువగా చెప్పారు ● ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు పొందడానికి చేసిన ప్రయత్నం ● చట్టబద్ధత చేయాలి-ఈ డబ్ల్యూ ఎస్ రిజర్వేషన్లపై సమీక్ష చేయాలి ● సోషల్ జస్టిస్ పార్టీ రాష్ట్ర ఇంచార్జ్ కెవి గౌడ్ బహిరంగ లేఖ ● సోషల్ జస్టిస్ పార్టీ, బీసీ ఇంటలెక్చువల్ షోరూం, బీసీ హిందూ మహాసభ లు విజ్ఞప్తి




తెలంగాణ బ్యూరో ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2024 సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ కుల సర్వే రిపోర్ట్ లో లోపాలు – తెలంగాణ రాష్ట్ర జనాభా తగ్గుదల గురించి – బీసీ జనాభా తగ్గుదల – సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ కుల సర్వే పూర్తి వివరాలు బహిర్గతం చేయుట, కామారెడ్డి డిక్లరేషన్ లో చెప్పిన విధంగా పంచాయతీ, స్థానిక సంస్థలలో బిసి రిజర్వేషన్లను 42%నికి పెంపు కొరకు రాష్ట్ర అసెంబ్లీలో చట్టం చేసి రాజ్యాంగబద్ధత కల్పించుట – ఈ డబ్ల్యూ ఎస్ రిజర్వేషన్లను సమీక్షించుట గురించి ఏం కు రాసిన లేఖలో వివరించారు.
కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి అనేక రకాల డిక్లరేషన్లు చేసి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తామని హామీలు ఇచ్చి తెలంగాణ రాష్ట్రంలో అధికారం చేపట్టింది. అధికారంలోకి వచ్చి 16 నెలల కాలం గడిచినప్పటికీ ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి తమరి కాంగ్రెస్ ప్రభుత్వం డిక్లరేషన్ లో చెప్పిన విధంగా సంక్షేమ పథకాలు అమలు చేయడం లేదు. అందులో ప్రధానమైనది కామారెడ్డి డిక్లరేషన్. ఈ డిక్లరేషన్ లో తెలంగాణ రాష్ట్రంలోని బీసీలకు అనేక హామీలు ఇచ్చినారు. అందులో ప్రధానమైనది బీసీలకు స్థానిక సంస్థలలో, పంచాయతీలలో 42 శాతం రిజర్వేషన్లు కల్పించడం. అధికారంలోకి వచ్చిన 6 నెలల కాలంలోనే కుల గణన నిర్వహించి స్థానిక సంస్థలలో బీసీల రిజర్వేషన్ 22 శాతం నుంచి 42 శాతానికి పెంచి ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పారు. కానీ అధికారం చేపట్టి తొమ్మిది నెలలు పూర్తయినప్పటికీ ఆ దిశగా తమరి ప్రభుత్వం విశ్వసనీయ కార్యాచరణ రూపొందించలేదు. కేవలం నామమాత్రంగా జీవోలు ఇచ్చి అమలు చేయలేదు. పైగా పంచాయతీ ఎన్నికల నిర్వహణగాను పావులు శరవేగంగా కదువుతున్న సందర్భంలో సోషల్ జస్టిస్ పార్టీ, బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం, హిందూ బీసీ మహాసభ తమరి ప్రభుత్వం యొక్క కుటిల నీతిని అర్థం చేసుకొని హోటల్ తాజ్ కృష్ణ లో ఏర్పాటుచేసిన బీసీల సదస్సులో కీలక కార్యాచరణ ప్రకటించి, ఆమరణ నిరాహార దీక్షలు, గల్లీ నుండి ఢిల్లీ దాకా చేసిన పోరాటాల ఫలితంగా తమరి ప్రభుత్వం తప్పనిసరి పరిస్థితులలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ కుల సర్వే చేసింది అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.
సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ కుల సర్వే చేసినప్పుడు తమరి ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించిన ఫలితంగా నేడు తెలంగాణ రాష్ట్రంలో జనాభా చాలా తక్కువగా నమోదైనది. సుమారుగా తెలంగాణ రాష్ట్రంలో జనాభా నాలుగు కోట్ల 20 లక్షల పైచిలుకు ఉండే అవకాశం ఉందని ప్రభుత్వ అధికారిక శాఖల వెబ్ సైట్ ల డాటా తెలియజేస్తుందన్నారు.
తెలంగాణ రాష్ట్రంలో 24/4/2024 నాటి లెక్కల ప్రకారం ఎలక్షన్ కమిషన్ వెబ్సైట్లో 3,32,32318 మంది ఓటర్లు అనేది వాస్తవం. అంటే 18 సంవత్సరాల వయసుకు పైబడిన వారు. ఇకపోతే ఇంటర్ విద్యార్థుల సంఖ్య 6,13,306, పదవ తరగతి వరకు విద్యార్థుల సంఖ్య 59,33,001 విద్యా శాఖ లెక్కల ప్రకారం. 0–6 సంవత్సరాల వయసు గల పిల్లలు 38,99,001 శిశు సంక్షేమ శాఖ వారి వద్ద ఉన్న లెక్కలు, ఈ మొత్తం కలిపితే తెలంగాణ రాష్ట్రంలో మొత్తం జనాభా 4,36,77,626 మంది ఉండే అవకాశం ఉంది. ఆధార్ డేటా పరిశీలించిన, జాతీయ జనాభా లెక్కల సగటు తీసుకున్న తెలంగాణ రాష్ట్ర జనాభా నాలుగు కోట్ల నలభై లక్షల వరకు ఉండే అవకాశం ఉందని అన్ని ప్రత్యామ్నాయ ప్రభుత్వ శాఖల ద్వారా తెలుస్తుంది. ఎటు చూసినా 42000000కు తగ్గకుండా తెలంగాణ రాష్ట్ర జనాభా ఉంటుందని లేఖలో పేర్కొన్నారు.
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జరిపిన సర్వేలో 3,54,00,000 పాల్గొన్నారు అని, ఇంకా 3.1% మంది సర్వేలో పాల్గొనలేదని సర్వే రిపోర్టు ద్వారా తమరి ప్రభుత్వం తెలియజేసింది. తెలంగాణ రాష్ట్రంలో మొత్తం జనాభా 3,65,00,000 అని ప్రభుత్వం సర్వే రిపోర్ట్ ద్వారా అధికారికంగా తెలియజేసినట్లు గా భావించవలసి ఉంటుంది. మరి మిగతా 55 లక్షల జనాభా ఏమైనట్లు? తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సర్వే పైన నిర్లక్ష్యంగా వ్యవహరించింది అనడానికి ఇదే ప్రత్యక్ష ఉదాహరణ అని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అప్పటి తెలంగాణ రాష్ట్ర మొదటి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో అన్ని కులాల వారి లెక్కలు సేకరించడం జరిగింది. ఆ లెక్కలలో 30 లక్షల మంది కులం నమోదు చేయని కారణంగా, మరికొన్ని ఇతర చిన్న చిన్న కారణాల చేత అప్పటి ప్రభుత్వం ఆ లెక్కలను అధికారికంగా ప్రకటించలేదు. కానీ 2014 నుండి 2025 వరకు 10 సంవత్సరాలు కాలంలో బీసీలు 21 లక్షల మంది కనపడకుండా పోయారు అంతేకాదు బీసీలలో ఈ పది సంవత్సరాల కాలంలో అసలు జనాభా వుట్టలేదన్నట్లుగా ప్రస్తుత ప్రభుత్వం చేసిన లెక్కలు చెబుతున్నాయి. బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీల జనాభాను తక్కువగా చూపించి, కేవలం ఓసీల జనాభాను 8% నుంచి 15%నికి పైగా ఉన్నట్లు రేవంత్ రెడ్డి గారి ప్రభుత్వం నిర్వహించిన సర్వే రిపోర్టులో ప్రకటించారు. 8 శాతం జనాభా ఉన్న ఓసీలలో మహిళలు నాలుగు శాతం అందులో పిల్లలు, వృాఎద్దులు 3% వరకు ఉంటారు. కానీ 1% జనాభా 10 సంవత్సరాల కాలంలో 7% శాతం జనాభాను కన్నట్లుగా తమరి ప్రభుత్వ లెక్కల ద్వారా అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. ఇది నమ్మశక్యంగా లేదు సాధ్యమయ్యేది కాదని పేర్కొన్నారు.
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ కుల సర్వే కేవలం ఓసీల జనాభా ఎక్కువగా చూపించడానికి శ్రద్ధ వహించింది. అన్ని కులాల జనాభాను తక్కువగా చూపిస్తూ కేవలం ఇతర కులాల జనాభా ఎక్కువగా చూపిస్తూ ఈ డబ్ల్యూ ఎస్ రిజర్వేషన్ 10% అమలు చేయడానికి లోపాయికారిగా ప్రయత్నిస్తున్నారు. 8% జనాభాకు మించి 10% ఈ డబ్ల్యూ ఎస్ రిజర్వేషన్స్ అమలు చేస్తు, పోటీ పరీక్షలలో బీసీ ఎస్సీ ఎస్టీ అభ్యర్థుల కన్నా తక్కువ కటాఫ్ మార్కులతో ఉద్యోగాలను కొల్లగొడుతున్న విషయాన్ని అర్థం చేసుకున్న తెలంగాణ రాష్ట్ర ఆధిపత్య వర్గాల రేవంత్ రెడ్డి గారి ప్రభుత్వం సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ కుల సర్వేను వాడుకుంది. ఎలాగైనా అక్రమంగా 10 శాతం ఈ డబ్ల్యూ ఎస్ రిజర్వేషన్లు ఎనిమిది శాతం జనాభా కు అమలు చేయడానికి కుటిలత్వంతో వ్యవహరించినట్లుగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. మేధావులు ఆలోచన చేయండి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నాలు చేస్తుంది. ఇకనైనా సమాజం మేల్కోవాల్సిన అవసరం ఉన్నది. తెలంగాణ రాష్ట్ర రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్వహించిన సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యా, ఉద్యోగ, కుల సర్వే రిపోర్టును బూత్ లెవెల్, వార్డులు, గ్రామాలు, టౌన్స్, పట్టణాలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, మండలాలు, అసెంబ్లీ నియోజకవర్గం, పార్లమెంటు నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో అందరికీ అందుబాటులో, అందరికీ అర్థమయ్యేలా ప్రత్యేక వెబ్సైట్ రూపొందించి బహిర్గతం చేయాలి అని సోషల్ జస్టిస్ పార్టీ డిమాండ్ చేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో రావడానికి కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకటించింది. దీని ప్రకారం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల లోవు సమగ్ర కులదనన చేసి బీసీలకు 23 శాతం ఉన్న స్థానిక సంస్థల రిజర్వేషన్ల్ ను 42%నికి పెంచుతామని చెప్పి బీసీల కోట్లతో గెలిచి అధికారం చేపట్టింది. కావున రిజర్వేషన్ స్థానిక సంస్థలు, పంచాయితీ ఎన్నికల్లో 42% కచ్చితంగా అధికారికంగా అమలు చేసి తీరవాల్సిందే. అంతేకాకుండా కామారెడ్డి డిక్లరేషన్ లో చెప్పినట్లుగా బీసీలకు ప్రభుత్వ కాంట్రాక్టులలో 42% రిజర్వేషన్ అమలుపై శ్వేత పత్రం విడుదల చేయాలని సీఎం రేవంత్ కు రాసిన లేఖలో పేర్కొన్నారు..

# రైతులకు సర్కార్ శుభవార్త


● 3 ఎకరాల వరకు సాగులో ఉన్న భూములకు, జమకానున్న రైతు భరోసా నిధులు ● తెలంగాణ వ్యవసాయ శాఖ



తెలంగాణ బ్యూరో,ప్రతినిధిః తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు శుభవార్త చెప్పింది. మూడు ఎకరాల వరకు సాగులో ఉన్న భూములకు రైతు భరోసా నిధులు జమ చేసినట్లు వ్యవసాయ శాఖ తెలిపింది. జనవరి 26న ప్రారంభమైన ఈ పథకం అమలులో భాగంగా.. ఫిబ్రవరి 5న ఒక ఎకరానికి లోవు భూమి కలిగిన రైతులకు నిధులు జమ చేసిన విషయం తెలిసిందే. తాజాగా, సోమవారం ప్రభుత్వం మరోసారి రెండు ఎకరాల లోవు భూమి ఉన్న రైతులకు నిధులను విడుదల చేసింది. ప్రభుత్వం ఇప్పటికే ఒక ఎకరం భూమి కలిగిన 17 లక్షల మంది రైతుల ఖాతాల్లో 1,126 కోట్లు జమ చేసిన సంగతి తెలిసిందే.గత నెల 27న 4,41,911 రైతులకు 9,48,332.35 ఎకరాలకు రూ.5,68,99,97,265 నిధులు జమ చేయగా.. ఈనెల 5వ తేదీన 17,03,419 రైతులకు చెందిన 9,29,234.20 ఎకరాలకు రూ. 5,57,54,07,019 నిధులు విడుదల చేశారు. మొత్తంగా రైతు భరోసా కింద రూ. 2218 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు ప్రభుత్వం వెల్లడించింది. రైతుభరోసా పథకం అమల్లో భాగంగా ఏడాదికి రూ. 12 వేల నగదును ప్రభుత్వం రైతుల ఖాతాలో జమ చేయనున్న సంగతి తెలిసిందే.

# ఎన్విరాన్మెంటల్ ప్రొటెక్షన్ ట్రైనింగ్ రిసెర్చ్ ఇన్స్టిట్యూట్ ప్రక్షాళన చేయాలి

## పర్యావరణ మంత్రికి జేయన్టీయుహెచ్ జేఏసీ వినతి



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: తెలంగాణ పర్యావరణ, ఫారెస్ట్ దేవాదాయ శాఖ మంత్రివర్యులు కొండా సురేఖకు ఎన్విరాన్మెంటల్ ప్రొటెక్షన్ ట్రైనింగ్ రిసెర్చ్ ఇన్స్టిట్యూట్ ప్రక్షాళన చేయాలని జేయన్టీయుహెచ్ జేఏసీ తరవున తెలంగాణ సచివాలయంలో వినతి పత్రం అందజేశారు. జేఏసీ చైర్మన్ డాక్టర్ బొట్ల బిక్షపతి ఎన్విరాన్మెంటల్ ప్రొటెక్షన్ ట్రైనింగ్ రిసెర్చ్ ఇన్స్టిట్యూట్ సంస్థలో ఉన్న కీలక సమస్యలను క్షుణ్ణంగా మంత్రివర్యులకు వివరించారు. ముఖ్యంగా తెలంగాణ ప్రభుత్వానికి సంబంధించిన సంస్థలో ఇప్పటికి ఆంధ్ర ఉద్యోగుల ఆధిపత్యం కొనసాగుతుందన్నారు. ఏడేళ్ళుగా ప్రాజెక్టులకు శాస్త్రీయ సలహా కమిటీ లేదని తెలిపారు. గత ప్రభుత్వ హయంలో కీలక స్థానాలలో ఉన్నోళ్ళు రిటైర్ అయ్యాక అవే పోస్టుల్లో ఉండి లక్షల్లో జీతాలు ప్రమోషన్లో పొందుతూ ఆసంస్థను రిటైర్మెంట్ ఉద్యోగులకు జల్సా ప్రదేశంగా మార్చారన్నారు. సంస్థ వెబ్సైటును ఎప్పటికప్పుడు అప్డేట్ చెయ్యడం లేదని తెలిపారు. సంస్థలో జరిగే అభివృాఎద్ధి కార్యకలాపాలకు సంబంధించిన పై అధికారుల నుంచి వచ్చిన సిఫార్సులను సైతం లెక్క చేయడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఉద్యోగులకు సంబంధించి నోటిఫికెషన్స్ వెయ్యడం, దరఖాస్తు దారులకు ఎలాంటి సమాచారం లేకుండా రద్దు చేసి దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగులను ప్రాంతీయ బేదంతో మానసిక క్షోభకు గురిచేస్తున్నారని మంత్రివర్యులకు విపులంగా వివరించి స్వయంగా పర్యటించి ప్రత్యేక దృాఎష్టి పెడితే పూర్తి స్థాయిలో సమస్యలన్నీ సమూలంగా పరిష్కారమవుతాయని విన్నవించారు. ఈ.పి.టి.ఆర్.ఐ సంస్థ సంబంధిత మంత్రివర్యులు కొండా సురేఖ సానుకూలంగా స్పందించి అతిత్వరలో తానే స్వయంగా పర్యటించి మా దృాఎష్టికి తీసుకొచ్చిన ప్రతి అంశాన్ని ప్రభుత్వం తరవున పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేయన్టీయుహెచ్ జేఏసీ చైర్మన్ డాక్టర్ బొట్ల బిక్షపతి, సలహాదారులు రాజన్న, డాక్టర్ శ్రీకాంత్ రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షులు పి. సుకుమార్ రెడ్డి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# చెరువుల ఆక్రమణలపై హైడ్రా ఉక్కుపాదం

## ఆక్రమలను తొలగించిన అధికారులు




తెలంగాణ బ్యూరో ప్రతినిధి: చెరువుల ఆక్రమణలపై హైడ్రా ఉక్కుపాదం మోవుతోంది. కొంపల్లి, గుండ్లపోచంపల్లి మున్సిపల్ సరిహద్దుల్లోని తుమ్మారు చెరువులో ఎఫ్టీఎల్, బఫర్ జోన్లో కొందరు తమ భూమి ఉందని మట్టితో చెరువును పూడ్చారు. చెరువుల ఆక్రమణలపై హైడ్రా ఉక్కుపాదం మోవుతోంది. కొంపల్లి, గుండ్లపోచంపల్లి మున్సిపల్ సరిహద్దుల్లోని తుమ్మారు చెరువులో ఎఫ్టీఎల్, బఫర్ జోన్లో కొందరు తమ భూమి ఉందని మట్టితో చెరువును పూడ్చారు. అలా పూడ్చిన స్థలంలో కొన్ని షెడ్లు నిర్మించి, వాటిని కిరాయికి కూడా ఇచ్చారు. దీనిపై మేడ్చల్, దుండిగల్, గండిమైసమ్మ, రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు సర్వే నిర్వహించిన నివేదికలను ఉన్నతాధికారులకు సమర్పించారు. దీనికితోడు స్థానికంగా ఉన్న కొంతమంది చెరువులో మట్టిని నింపుతున్నారని హైడ్రా అధికారులకు ఇటీవల ఫిర్యాదు చేశారు. వారం రోజుల క్రితం చెరువులో మట్టి నింపుతున్న టిప్పర్ను ఆర్డీఎఫ్, నీటిపారుదల, హైడ్రా అధికారులు పట్టుకొని పేట్బషీరాబద్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పేట్ బషీరాబాద్ పోలీసులు మట్టిని నింపుతున్న టిప్పర్ యజమానిపై కేసు నమోదు చేశారు. దీనిపై స్పందించిన హైడ్రా అధికారులు తుమ్మారు చెరువు ఎఫ్టీఎల్, బఫర్ జోన్లలో వెలిసిన రేకుల షెడ్లు, ప్రహరీని పోలీసుల సహాయంతో నేలమట్టం చేశారు. ఎఫ్టీఎల్, బఫర్ జోన్లలో వెలిసిన అక్రమ నిర్మాణాలను కూల్చివేసి, చెరువులకు పూర్వ వైభవం తీసుకు వచ్చేందుకు అధికారులు ప్రయత్నం చేస్తున్నారు. తుమ్మారు చెరువు 44 ఎకరాల విస్తీర్ణంలో ఉండగా, సగం మేర కబ్జాకు గురైంది. దుండిగల్, గండిమైసమ్మ మండల పరిధిలోని దూలపల్లి గ్రామ ప్రభుత్వ సర్వే నంబరు 1, 2లో ఉంది. మరికొంత మేడ్చల్ మండలం, గుండ్లపోచంపల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబరు 388, 523, 524, 534, 535, 536, 537ల్లో అదేవిధంగా కాజాగూడ గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నంబరు 29లో విస్తరించి ఉంది. ఈ చెరువులో వెలసిన అక్రమ షెడ్లను కూల్చివేసిన హైడ్రా, ఇరిగేషన్ అధికారులు ఇకముందు కూడా కబ్జాకు గురికాకుండా ఉండేందుకు చర్యలు చేపడతారా? లేక కూల్చివేతలతోనే సరిపెడతారా? అనే సందిగ్ధంలో ప్రజలు ఉన్నారు. ఇప్పటికైనా అధికారులు సమన్వయంతో కబ్జాకు గురవుతున్న తుమ్మారు చెరువును కాపాడి, రాబోయే తరానికి అందజేయాలని స్థానికులు కోరుతున్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి సిద్ధం

● బలంగా ఉన్న చోట పోటీ ● కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి మద్దతు
● ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి ● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని




తెలంగాణ బ్యూరోప్రతినిధిః స్థానిక సంస్థల ఎన్నికల్లో బలంగా ఉన్న చోట పోటీ చేస్తాం అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ కలిసి వస్తే ముందుకూ వెళ్తామని తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి మద్దతు ఇస్తున్నాం అని, ఉపాధ్యాయ ఎమ్మెల్సీల అభ్యర్థుల్లో ఎవరికి మద్దతు ఇవ్వాలనే దానిపై చర్చిస్తున్నామన్నారు. ఎస్సీ వర్గీకరణ, బీసీ కులగణన చేయడాన్ని తాను స్వాగతిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మొండి పోకడకు వెళ్లకుండా ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మావోయిస్టులను ఎన్ కౌంటర్ పేరుతో చంపేస్తున్నారని, దీనిపై న్యాయ విచారణ జరిపించాలని ఎమ్మెల్యే కూనంనేని కోరారు. కాంగ్రెస్ పార్టీ కమ్యూనిస్టులను కలుపుకోవడంలో వైఫల్యం చెందింది. సమన్వయం చేసుకోవడంలో విఫలమైంది. కమ్యూనిస్టు పార్టీల కలయికతోనే గెలిచిందని మర్చిపోతున్నారు. దేశవ్యాప్తంగా అనేక పరిణామాలు చూస్తున్నారు కానీ.. కలుపుకోవడం తెలియడం లేదు. మావోయిస్టులను అంతం చేసేందుకు మార్చి నెలలో ముహూర్తం పెట్టారు. ముహూర్తాలు ఎవరు పెడతారు.. ఎందుకు పెడుతారు?. రాజ్యాంగాన్ని కాలరాసే విధంగా మావోయిస్టులను మట్టుపెట్టడానికి ముహూర్తాలు పెట్టడం ఏమిటి?. మావోయిస్టులు సంఘవిద్రోహ కార్యక్రమాలు చేస్తున్నారు.. సంఘవిద్రోహులేమో అసెంబ్లీలో, పార్లమెంట్లో ఉంటారు. ప్రజలకోసం పనిచేసే మావోయిస్టులను చంపేస్తారా?. అమిత్ షా హత్యలు చేస్తున్నట్టే.. అతనిపై విచారణ చెయ్యాలి అని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు పేర్కొన్నారు.
కులగణన అధికారంగా ప్రకటించారు, అందుకు సంతోషం. దానిని మేము అంగీకరించాం. బీసీలు తగ్గారు అంటున్నారు.. గ్రామ సభల్లో పెట్టాలి ఈ అంశాన్ని. ఎస్సీ కులగణనలో చిన్న చిన్న లోపాలున్నాయి, వాటిని రీ వెరిఫై చెయ్యాలి. ఆర్టీసీ కార్మికులు సమ్మె దిశగా ఆలోచనలు చేస్తున్నారు. వాళ్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలి. స్థానిక సంస్థల ఎన్నికల్లో మాకు బలం ఉన్నచోట పోటీ చేస్తాం. కుదిరిన చోట కాంగ్రెస్ పార్టీతో కలుపుకుపోతం. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థికి మద్దతు ఇస్తున్నాం. టీచర్ ఎమ్మెల్సీలకు ఇంకా చర్చలు సాగుతున్నాయి. కాంగ్రెస్ పార్టీకి చేసినవి చెప్పుకోవడం చేత కావడం లేదు. 22 వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేసినా కూడా చెప్పుకోవడం లేదు. రైతు భరోసా వేస్తున్నారు. మోడల్ విలేజీస్లో ఇల్లు కట్టిస్తున్నారు. రుణమాఫీ 2 లక్షల విషయంలో కొంత వైఫల్యం చెందారు. కొన్ని అంశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం మంచి చేస్తుంది. కానీ చేసినవి చెప్పుకోవడంలో ఫెయిల్ అయింది. ప్రభుత్వంలో ఎవ్వరు ఫోన్ కాల్స్ అటెండ్ చెయ్యడం లేదు. ప్రభుత్వం దీన్ని గమనించాలి అని ఎమ్మెల్యే కూనంనేని సూచించారు.

# ధనస్వామ్య రాజకీయాలను ఓడించండి


● ఉపాధ్యాయ ఉద్యమ నాయకుడు అశోక్ కుమార్ను గెలిపించండి
● టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి పిలుపు




తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: జమ్మికుంటలో ఏర్పాటు చేసిన టీపీటీఎఫ్ కార్యకర్తల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి మాట్లాడుతూ విద్యారంగం మీద,ఉపాధ్యాయుల సమస్యల మీద అవగాహన ఉన్న వ్యక్తులను చట్టసభలకు పంపాలని ఉపాధ్యాయులకు పిలువునిచ్చారు . గత 30 ఏళ్లుగా నిజాయితీగా నీతిగా ఉపాధ్యాయ విద్యారంగా సమస్యలపై పోరాడిన వై అశోక్ కుమార్ ను గెలిపించాలని కోరారు. ధనస్వామ్య రాజకీయాలను ఓడించండి ఉపాధ్యాయ ఉద్యమ నాయకుడు అశోకుని గెలిపించాలని ఉపాధ్యాయులకు పిలువునిచ్చారు.
విద్యార్థులందరికీ సమానమైన నాణ్యమైన శాస్త్రీయమైన విద్య అందేలా ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు పోరాడుతామని అన్నారు. విద్యారంగానికి ప్రభుత్వం బడ్జెట్లో 20% నిధులు కేటాయించేలా ఉద్యమిస్తామన్నారు. అపరిష్కృాఎతంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం చట్టసభలలో ప్రశ్నించే గొంతుకగా ఉంటాడన్నారు. విద్యారంగంలో కాంట్రాక్టు వ్యవస్థ రద్దు కోసం కేజీబీవీ టీచర్ల రెగ్యులరైజేషన్ కోసం గురుకుల మోడల్ స్కూల్ టీచర్ల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తారని, ఏ రాజకీయ పార్టీ కండువా కప్పుకోకుండా విద్యారంగం ఉపాధ్యాయుల యజెండాగా పని చేస్తారని ఉపాధ్యాయులు మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలిపించాలని కోరారు. కరీంనగర్ టీచర్ ఎమ్మెల్సీలుగా గెలిచినవారు ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి తొత్తులుగా మారి ఉపాధ్యాయులకు మోసం చేస్తున్నారన్నారు ఈ నియోజకవర్గంలో ఉన్న కొన్ని ఉపాధ్యాయ సంఘాలు రియల్ ఎస్టేట్ వ్యాపారులకు విద్య వ్యాపారులకు టికెట్లు ఇచ్చి డబ్బుతో ఓట్లు కొందామని వస్తున్నారని ఉపాధ్యాయులు వారికి ఈసారి బుద్ధి చెప్పాలన్నారు.కరీంనగర్ నియోజకవర్గంలో వై అశోక్ కుమార్ గారి గెలువు విద్యార్థులకు ఉపాధ్యాయులకు విద్యారంగానికి అనివార్యత అని తెలిపారు. ఈ సమావేశంలో టీపీటీఎఫ్ నాయకులు మర్రి అవినాశ్, కొండపాక తిరుపతి,కోడిగూటి తిరుపతి, దొంత హరికిషన్, శీలం సారభద్రస్వామి, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

# నోటాపై రాజకీయ పార్టీలతో ఈసీ సమావేశం

● పాల్గొన్న ప్రముఖ రాజకీయ పార్టీలు ● అభిప్రాయాలను చెప్పిన పార్టీల నేతలు




తెలంగాణ బ్యూరోప్రతినిధి: స్థానిక సంస్థల ఎన్నికల్లో నోటా ను కల్పిత అభ్యర్థిగా పెట్టాలా వద్ద అనే అంశం రాజకీయ పార్టీల్లో మిశ్రమ స్పందన వ్యక్తం అయింది కాంగ్రెస్ పార్టీ ఈ పద్ధతిని వ్యతిరేకించగా బీఆర్ఎస్ పార్టీ స్వాగతించింది బీజేపీ మాత్రం రాష్ట్ర ఎన్నికల సంఘం కి ఆ అధికారం లేదని.. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉందని చెప్పిందిసిపిఎం నోటా ఉండాలని కానీ అభ్యర్థిగా గుర్తించొద్దని స్పష్టం చేసింది గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ లతో రాష్ట్ర ఎన్నికల సంఘం భేటీ అయింది ట్రయల్ ప్రాతిపదికన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో నోటా ను కూడా ఒక కల్పిత అభ్యర్థిగా పెట్టాల వద్దా అనే అంశం రాజకీయ పార్టీ ల అభిప్రాయం తీసుకుంది. రాజకీయ పార్టీ ల ముందు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రతిపాదనలు పెట్టింది. ఎన్నికల ఫలితాలను ప్రకటించేటప్పుడు నోటాను కల్పిత ఎన్నికల అభ్యర్థిగా పరిగణించడం పోటీ చేస్తున్న అభ్యర్థి , కల్పిత ఎన్నికల అభ్యర్థి అంటే నోటా అత్యధిక సంఖ్యలో సమాన ఓట్లను పొందినట్లయితే, పోటీ చేస్తున్న అభ్యర్థి (నోటా కాదు) ఎన్నికైనట్లు ప్రకటించడం. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులందరూ వ్యక్తిగతంగా కల్పిత ఎన్నికల అభ్యర్థి అంటే నోటా కంటే తక్కువ ఓట్లు పొందినట్లయితే, పోటీ చేస్తున్న అభ్యర్థులలో ఎవరూ ఎన్నికైనట్లు ప్రకటించబడరుఎవరు ఎన్నిక కానట్లు అయితే, ఆ స్థానానికి తిరిగి ఎన్నిక నిర్వహించబడుతుంది. నోటా కంటే తక్కువ ఓట్లు పొందిన పోటీ చేస్తున్న అభ్యర్థులందరూ తిరిగి ఎన్నికల్లో పోటీ చేయడానికి అర్హులు కారు తిరిగి ఎన్నికలో, నోటాకు మళ్లీ అత్యధిక ఓట్లు వస్తే, తదుపరి ఎన్నికలు నిర్వహించబడవు, అత్యధిక ఓట్లు (నోటా మినహా) ఉన్న పోటీ చేస్తున్న అభ్యర్థి ఎన్నికైనట్లు ప్రకటించబడుతుంది.
ఈ ప్రతిపాదనలు పై రాజకీయ పార్టీ లు భిన్న అభిప్రాయాలను వెలిబుచ్చాయి కాంగ్రెస్ పార్టీ కల్పిత అభ్యర్థిగా పరిగణించడాన్ని వ్యతిరేకించింది నోటా ఎక్కువ ఓట్లు వచ్చి ఎన్నికలు మళ్లీ నిర్వహించాలని అంటే అటు ప్రభుత్వానికి, ఇటు అభ్యర్థులకు ఖర్చు పెరుగుతుందని ఆ పార్టీ నేతలు అన్నారు. నోటాను కల్పిత అభ్యర్థిగా పరిగణించడం నీ బీఆర్ఎస్ స్వాగతించింది ఏకగ్రీవానికి బెదిరింపులు, బలప్రదర్శన చేసే అవకాశం ఉందనీ ఆ పార్టీ పేర్కొంది సుప్రీంకోర్టు లో కేసు ఉందని మా అభిప్రాయం ఇప్పుడే చెప్పలేమని బీజేపీ అంది స్టేట్ ఎలక్షన్ కమిషన్ కు ఈ విషయంపై నిర్ణయం తీసుకునే అవకాశం లేదనీ పంచాయతీ ఎన్నికలు ఎలా నిర్వహించాలనే నిర్ణయం తీసుకోవాల్సింది ప్రభుత్వం అని స్పష్టం చేసింది. నోటా తో ఎన్నిక ఉండాలని సుప్రీంకోర్టు ఇప్పటికే చెప్పింది. నోట ఉండాలని అయితే అభ్యర్థి కంటే నోటాకు ఎక్కువ ఓట్లు వస్తె రీ ఎలక్షన్ కరెక్ట్ కాదనీ సిపిఎం చెప్పింది.తమ అభిప్రాయాన్ని రెండు రోజుల్లో చెప్తామని టిటిడిపి చెప్పగా సింగల్ కాండిడేట్ ఉన్నా నోటా ఉండాలన్న జనసేన పార్టీ.. చెప్పింది.

సూర్య
విజయవాడ
గురువారం
13 ఫిబ్రవరి 2025




ఆధునిక మానవుడు అంతర్జాల వలయంలో మునిగి తేలుతున్నాడు. స్మార్ట్‌ఫోన్ రాకతో అతి సామాన్యుల ముంగిట్లో కూడా ఇంటర్నెట్ ప్రవేశించింది. మితిమీరిన వాడకంతో ఇంటర్నెట్ దురలవాటు బారిన కూడా యువత, పిల్లలు పడడం చూస్తున్నాం. అంతర్జాల రాకతో విశ్వ విజ్ఞానం మన అరచేతిలో ఇమిడి పోయింది. అంతర్జాలంతో అసంఖ్యాక ప్రయోజనాలు ఉన్నప్పటికీ దాని పట్ల జాగ్రత్తగా ఉండని యెడల పలు ప్రమాదకర నష్టాలు కూడా మన అనుభవంలోకి వస్తున్నాయి. అంతర్జాలాన్ని వినియోగిస్తున్న నెటిజెన్లు పలు సందర్భాల్లో ప్రతికూల అనుభవాలు, సైబర్ బుల్లీయింగ్, తిట్ల దండకాలు, అక్రమ వినియోగాలు, అసభ్యకర అవమానకర మాటలను వినవలసి వస్తున్న వేళ సురక్షిత ఇంటర్నెట్ పట్ల అవగాహన కల్పించాల్సిన అగత్యం ఏర్పడింది. అంతర్జాలం వాడడం తప్పనిసరి అవుతున్న దాని పట్ల కనీస పరిజ్ఞానం, తగు జాగ్రత్తలు తీసుకోవడం కనీస అవసరం అవుతున్న వేళ ఇంటర్నెట్‌ను సురక్షితంగా వినియోగించుకునే మార్గాలను అవగాహన పరచడానికి 2004 నుంచి ప్రతి ఏట 11 ఫిబ్రవరిన ప్రపంచ దేశాలు "సురక్షిత అంతర్జాల దినం" లేదా "సేఫర్ ఇంటర్నెట్ డే"పాటించడం ఆనవాయితీగా మారింది. నేటి సమాజంలో విద్యాలయాలు, కుటుంబాలు, బంధు మిత్రులు, సహచర వర్గాలు, పౌర సమాజాల్లో సురక్షితంగా

## అంతర్జాలంతో ఆటలాడితే ప్రమాదకరం

అంతర్జాలాన్ని ఎలా వినియోగించాలో ప్రజలకు, విద్యార్థులకు తెలుపవలసిన అవసరం వచ్చింది. ఆన్‌లైన్‌లో గౌరవంగా మాట్లాడడం, సత్ప్రవర్తనతో వినియోగించడం, సహానుభూతి ప్రదర్శించడం, హానికరమైన చర్యలకు దూరంగా ఉండడం లాంటివి మనం ఆచరణలో పెట్టాలి.


సురక్షిత అంతర్జాల దినం-2025 ఇతివృత్తంగా "అందరు కలిసి సురక్షిత అంతర్జాలాన్ని నిర్మించుకుందాం" అనబడే అంశాన్ని తీసుకున్నారు. అంతర్జాల ప్రధాన దుర్వినియోగాల్లో సైబర్ బుల్లీయింగ్, ఫిషింగ్ స్కామ్, డాటా బ్రీచింగ్, అనధికారిక చొరబాట్లు, మాల్‌వేర్, ఆన్‌లైన్ గ్రూమింగ్, వ్యక్తిగత సమాచార దుర్వినియోగం, ఆన్‌లైన్ ప్రిడేటర్స్, సెక్స్టింగ్, రాన్‌సమ్‌వేర్, సైబర్ క్రైమ్స్, ఆన్‌లైన్ బెట్టింగ్ మోసాలు, ఆన్‌లైన్ అప్పుల వేధింపులు, వ్యక్తిగత సమాచారాన్ని దోచేసి వేధించడం లాంటి పలు అంశాల పట్ల తగు జాగ్రత్తగా ఉండడం అనివార్యం అయ్యింది. వీటి పట్ల అవగాహనలేని యెడల పలు చిక్కులను ఎదుర్కోవలసి వస్తుందని తెలుసుకోవాలి.

అంతర్జాల కత్తికి రెండు వైపుల పదను ఉంటుంది. ఇంటర్నెట్ ఓ అద్భుత వరమే కాదు, అజాగ్రత్తగా ఉంటే అదో శాపంగా కూడా మారుతుందని తెలుసు కోవాలి. చేతులు కాలాక ఆకులు పట్టుకొని ప్రయోజనం ఉండదు. మోసపోయిన తర్వాత దుఃఖించి ప్రయోజనం లేదని, ముందు జాగ్రత్తలు తీసుకుంటూ ఇంటర్నెట్‌ను సురక్షితంగా వాడడం నేర్చుకొని భద్రంగా అంతర్జాల వలలో ఆనంద తాండవం ఆడుదాం, మోసాలు చేయజూస్తున్న ఆన్‌లైన్ మోసగాండ్లకు ముచ్చెమటలు పట్టిస్తూ వారి భరతం పడదాం.

పాఠకులు, విశ్లేషకులు, రచయితలు తమ రచనలు క్రింది చిరునామాకు గానీ సూర్య దినపత్రిక ఎడిటోరియల్ మెయిల్ ఐడికి గాని పంపవలసినదిగా మనవి మెయిల్ :
suryaeditpage@gmail.com

SPR publications, Surya Soudha, Plot.No: 185, M.C.H. NO.258/1/185, siddi vinayaka nagar, Ayyappa Society Opp: Hi-Tech City, Hyderabad - 500 072.

# కృత్రిమ మేధ సాఫ్ట్ వేర్ ఉద్యోగులను భర్తీ చేయగలదా?



**(తేజస్వి - హైదరాబాద్)**

- ఆర్థిక సంస్కరణల వల్ల భారీగా విదేశీ కంపెనీల రాక
- గణనీయంగా పెరిగిన ఇంజనీరింగ్ కాలేజీలు
- మధ్యతరగతి కుటుంబాల్లో సాఫ్ట్ వేర్ ఇంజనీరింగ్ పై ఆసక్తి
- తాజాగా ఆటోమేటెడ్ మోడ్ లోకి రొటీన్ టాస్క్
- ఏఐ సాయంతో డెవలపర్లు తక్కువ సమయంలో ఎక్కువ పనులు

ఓపెన్ ఏఐ సిఈఓ శామ్ ఆల్ట్ మన్ ఓపెన్ ఏఐ భవిష్య ప్రణాళికల గురించి బ్లాగ్ లో ప్రస్తావిస్తూ, 'త్వరలో తమ సంస్థ ఏఐ ఏజంట్లను అందుబాటులోకి తీసుకురానున్నాదని, కొన్ని సంవత్సారాల అనుభవం ఉన్న సాఫ్ట్ వేర్ ఇంజనీర్ల పనిని ఈ ఏజెంట్లు చేస్తాయనిబీ కోడింగ్, డెవలప్ మెంట్ పనుల్లో సాఫ్ట్వేర్ ఇంజనీర్లకు వర్చువల్ సహోద్యోగులుగా ఈ ఏఐ ఏజెంట్లు పని చేయనున్నట్టు' ప్రకటించారు. ఇప్పటికే ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ క్రమక్రమంగా అన్ని రంగాల్లో విస్తరిస్తున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా సాఫ్ట్ వేర్ ఉద్యోగాలంటే విపరీతమైన ఆకర్షణ ఉన్న భారతదేశంలో ఈ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ప్రగతి సాఫ్ట్ వేర్ ఉద్యోగాలపై ఎటువంటి ప్రభావం చూపబోతుంది? మధ్యతరగతి కుటుంబాల్లో దాదాపు డెబ్భై శాతం మంది తల్లిదండ్రులు తమ పిల్లలను సాఫ్ట్వేర్ ఇంజనీర్లు చేయడమే కలగా పెట్టుకుంటారు. ఈ సందర్భంలో ఈ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ సాఫ్ట్వేర్ రంగాన్ని ఎలామార్చుబోతుంది? దీని ప్రభావం సాఫ్ట్ వేర్ ఉద్యోగాలపై ఉందా? భారతదేశంలో 1990 వ దశకం నుండి సాఫ్ట్ వేర్ ఉద్యోగాలకు ఆకర్షణ పెరిగింది. 1980 ల నుండి ప్రభుత్వం టెక్నాలజీ రంగాన్ని ప్రోత్సహించడం, కంప్యూటర్ కోర్సులు నేర్చుకునే వెసులుబాటు పెరగడం, అప్పటికే టిసిఎస్ ,విప్రో,ఇన్ఫోసిస్ లాంటి కంపెనీలో వాటి వాటి స్థాయిల్లో పని చేస్తూ ఉండటం ఈ ఆకర్షణకు ఒక కోణం. ఇంకో కోణం నుండి గమనిస్తే 1991 లో వచ్చిన ఆర్థిక సంస్కరణలు, అప్పటి ప్రధాని పివి నరసింహారావు, ఆర్థిక మంత్రి మన్మోహన్ సింగ్ చేపట్టిన ఆర్థిక సంస్కరణల వల్ల విదేశీ కంపెనీలు భారతదేశంతో వ్యాపారం చేయడానికి కొంత సులువైన మార్గం ఏర్పడటం ఇంకో కోణం. ఈ నేపథ్యంలో సాఫ్ట్ వేర్ కంపెనీలు అయిన ఇన్ఫోసిస్ ,టిసి ఎస్, విప్రో అమెరికా లాంటి విదేశాల కోసం సాఫ్ట్వేర్ సేవలు అందించడం మొదలుపెట్టాయి. 1999 లో వై టు కె సమస్య వల్ల భారతీయ ఐటి ఇంజనీర్లకు డిమాండ్ పెరిగింది. ఇదంతా 1990 -2000 మధ్య జరిగిన కథ. తరువాతి దశాబ్దానికి వస్తే (2000-2010)డాట్ కాం బూమ్ వల్ల యుఎస్, యుకె కంపెనీలు కాస్ట్ కటింగ్ ప్రక్రియలో భాగంగా భారతదేశానికి ఎక్కువ ప్రాజెక్టులు అవుట్ సోర్స్ చేయడం ప్రారంభించాయి. ఇక భారత దేశంలో ప్రధాన నగరాలైన బెంగళూర్, హైదరాబాద్ ,చెన్నై ,పూణే లలో ఐటి కంపెనీలు విస్తరించాయి. 2005 -2010 మధ్య ఐటి ఉద్యోగాల సంఖ్య కూడా పెరిగింది. అందరూ ఈ సాఫ్ట్వేర్ వైపు ఆసక్తి చూపడంతో ఇంజనీరింగ్ కాలేజీల సంఖ్య కూడా ఈ కాలంలో గణనీయంగా పెరిగింది. 2010 నుండి స్టార్ట్ అప్ కంపెనీలు పెరిగిపోయాయి,క్లౌడ్ టెక్నాలజీ లాంటివి వచ్చాయి. ఇకపోతే కృత్రిమ మేధ సాఫ్ట్ వేర్ పరిశ్రమలో చేయగలిగిన పనులను గమనిస్తే కోడ్ రాయడం, డి బగ్గింగ్, టెస్టింగ్, సాఫ్ట్ వేర్ డిజైన్ వంటి పనులను ఈ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ సమర్థవంతంగా చేయగలదు. దీని వల్ల కొత్త డెవలపర్స్ కి ఇది ఎంతో సహాయకారిగా ఉంటుంది. అలాగే డి బగ్గింగ్ ప్రక్రియలో లోపాలను కూడా కృత్రిమ మేధ త్వరగా గుర్తించగలదు, అలాగే భద్రతా లోపాలను కూడా వెంటనే గుర్తించి సరి చేయగలదు. దీని వల్ల రొటీన్ టాస్క్ లు కూడా ఆటోమేటెడ్ మోడ్ లోకి వస్తాయి. ఏ ఐ టూల్స్ సాఫ్ట్ వేర్ లో కోడ్ జనరేషన్, బాగ్ ఫిక్సింగ్ , టెస్టింగ్ మొదలైన పనులను వేగంగా పూర్తి చేయగలవు. దీని వల్ల పూర్తి స్థాయిలో కాకపోయినా ఓ మేరకు సాఫ్ట్ వేర్ ఉద్యోగులకు ముప్పు ఉన్న మాట కూడా వాస్తవమే. కాకపోతే కొత్త ఉద్యోగాలు కూడా ఉత్పన్నమయ్యే అవకాశం ఉంది. ఈ ఏఐ సాయంతో డెవలపర్లు తక్కువ సమయంలో ఎక్కువ పనులు చేయగలుగుతున్నారు. ఏ ఐ లో ఉండే కోడ్ సజెషన్ టూల్స్ డెవలపర్ల వేగాన్ని పెంచుతున్నాయి. ఇప్పుడున్న నేపథ్యంలో సాంప్రదాయ పద్ధతులను వదిలి ఏఐ ఆధారిత సాంకేతికతతో పని చేయాల్సిన అవసరం ఉంది. క్లిష్టంగా ఉండే సమస్యలను వేగంగా అర్థం చేసుకోవడానికి ఏఐ ఉపయోగపడుతుంది. ఎంత చేసినా మనిషిలా ఇది పని చేయలేదనే వాదనలు ఒక వైపు వినిపిస్తూనే ఉన్నాయి. కాని దీనికి భిన్నంగా ఇప్పటికే పలు టెక్ కంపెనీలు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ వినియోగాన్ని పెంచాయి. ఇటీవల ఫేస్ బుక్ మెటా యజమాని మార్క్ జుకర్ బర్గ్ కూడా ఖర్చులు తగ్గించుకునే ప్రక్రియలో భాగంగా కోడ్ లు రాసే మధ్యస్థ ఇంజనీర్లను ఏఐతో భర్తీ చేసే ఆలోచనలో ఉన్నట్లు ప్రకటించారు. ఇప్పుడు గూగుల్ లో దాదాపు 25 శాతం కోడ్ ని ఏఐ రాస్తున్నట్టు ఇటివల గూగుల్ సిఈఓ కూడా ప్రకటించారు. పరిణామాలను గమనిస్తే ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ పూర్తీ స్థాయి సాఫ్ట్ వేర్ ఉద్యోగి పని చేసేంత సమర్థవంతంగా పని చేయకపోవచ్చు కానీ మధ్యస్థ సాఫ్ట్ వేర్ ఉద్యోగి చేసే పనులన్నీ చేయగలదు అన్నది ఒప్పుకోవాల్సిన విషయమే. ఏదేమైనా సాఫ్ట్ వేర్ ఉద్యోగులు ఏ ఐ తో కలిసి పని చేసే నైపుణ్యాలను పెంపొందించుకుంటే ఈ ఉద్యోగ ముప్పు నుండి బయటపడొచ్చు.

# ట్రంప్ మరో హిట్లర్ కానున్నాడా?

- గాజా ను హస్తగతం చేసుకునే లా అమెరికా అడుగులు
- "మిడిల్ ఈస్ట్ రివియెరా"గా గాజాను అభివృద్ధి చేయాలని నిర్దేశం
- చట్టపరంగా, నైతికంగా ఈ ప్రణాళిక సమంజసమేనా?
- నియంతృత్వ పాలన దిశగా ట్రంప్ అడుగులు?
- ట్రంప్ చర్యలు పాలస్తీనీయుల హక్కులను ఉల్లంఘించే ప్రమాదం




**డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్**
**9849328496**

2025 ఫిబ్రవరిలో, అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో కలిసి, గాజా పట్టణాన్ని అమెరికా స్వాధీనం చేసుకోవాలనే ప్రణాళికను ప్రకటించారు. ఈ ప్రణాళికలో, ఫలస్తీనీయులను పొరుగు దేశాలకు తరలించి, గాజాను "మిడిల్ ఈస్ట్ రివియెరా"గా అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు. ఈ ప్రకటన అంతర్జాతీయ స్థాయిలో తీవ్ర విమర్శలకు గురైంది. దీనికి చట్టపరంగా, నైతికంగా, రాజకీయంగా ఎలాంటి అర్థం ఉందన్న చర్చ మొదలైంది. ట్రంప్ ప్రకారం, అమెరికా గాజా నియంత్రణను తీసుకుని, అక్కడి రెండున్నర మిలియన్ల మంది ఫలస్తీనీయులను పొరుగు దేశాలకు తరలించాలి. ఈ ప్రణాళిక ప్రకారం, ఈజిప్టు, జోర్డాన్ వంటి దేశాలు తాత్కాలికంగా వారిని ఆశ్రయించాలి. అనంతరం, గాజాను పర్యాటక కేంద్రంగా, ఆర్థికంగా అభివృద్ధి చేయాలని ట్రంప్ ప్రకటించారు. ఈ ప్రణాళికపై ప్రపంచవ్యాప్తంగా తీవ్రమైన చట్టపరమైన, నైతికమైన అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. యునైటెడ్ నేషన్స్ ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రెస్, "ఫోర్స్డ్ డిస్ప్లేస్‌మెంట్" అంటే బలవంతంగా ప్రజలను వారి భూమి నుంచి తరలించడాన్ని తీవ్రంగా ఖండించారు. అంతర్జాతీయ చట్టాల ప్రకారం, ఒక దేశం స్వతంత్ర ప్రజలను బలవంతంగా ఇతర ప్రాంతాలకు తరలించలేరు. ఈ చర్య ఫాలస్తీనీయుల హక్కులను ఉల్లంఘించే ప్రమాదం ఉంది. ట్రంప్ ప్రణాళికను అనేక దేశాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ముఖ్యంగా అరబ్ దేశాలు, ఈజిప్టు, జోర్డాన్, సౌదీ అరేబియా ఈ ప్రతిపాదనను తిరస్కరించాయి. ఫలస్తీనీయుల భూమిని స్వాధీనం చేసుకోవడం దారుణమని, వారిని తమ దేశాల్లోకి అనుమతించలేమని స్పష్టం చేశాయి. ఈజిప్టు విదేశాంగ మంత్రి, ఫలస్తీనీయులను వారి భూమి నుంచీ తొలగించడం సమంజసం కాదని పేర్కొన్నారు.

జర్మనీ, ఫ్రాన్స్, యునైటెడ్ కింగ్‌డమ్ వంటి పాశ్చాత్య దేశాలు కూడా ట్రంప్ ప్రణాళికను తీవ్రంగా విమర్శించాయి. ఇది అంతర్జాతీయ చట్టాలను ఖండించే విధంగా ఉందని, మిడిల్ ఈస్ట్‌లో శాంతికి ముప్పుగా మారుతుందని వ్యాఖ్యానించాయి. అమెరికాలో కూడా ఈ ప్రతిపాదనపై భిన్నాభిప్రా యాలు వ్యక్తమయ్యాయి. కొంతమంది రిపబ్లికన్ నేతలు ట్రంప్ పద్ధతిని సమర్థించగా, మరికొందరు తమ అనుమానాలను వ్యక్తం చేశారు. అయితే, డెమోక్రాటిక్ పార్టీకి చెందిన నేతలు ఈ ప్రణాళికను తీవ్రంగా విమర్శించారు. సెనేటర్ క్రిస్ వాన్ హెల్లెన్ దీనిని "విచిత్రమైన ప్రణాళిక"గా, ప్రతినిధి రషీదా తలీబ్ అయితే "ఇది జాతి నిర్మూలన" అంటూ ఘాటుగా స్పందించారు. మెరికన్ మీడియా ఈ విషయాన్ని విస్తృతంగా ప్రసారం చేస్తోంది. అనేక వార్తాసంస్థలు ఈ ప్రతిపాదన వెనుకున్న చట్టపరమైన, నైతికమైన సమస్యలను హైలైట్ చేశాయి. ప్రజల్లోనూ విభజన ఏర్పడిందికొంత మంది దీనిని మిడిల్ ఈస్ట్‌లో శాంతిని తెచ్చే మార్గంగా చూస్తుంటే, మరికొందరు ప్రజలను బలవంతంగా తరలించడం పూర్తిగా తప్పని మండిపడుతున్నారు. ఒక దేశాన్ని బలవంతంగా స్వాధీనం చేసుకోవాలని ట్రంప్ చేసే ప్రయత్నం నియంతృత్వ పాలన వైపు అడుగులా? హిట్లర్, ఇతర నియంతలు చేసిన విధంగా ప్రజలను బలవంతంగా తరలించడం సమంజసమా? ప్రపంచవ్యాప్తంగా అనేక మంది విశ్లేషకులు ఈ విషయాన్ని విమర్శిస్తున్నారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన అమెరికా, ఇలాంటి చర్యలకు ఒడిగట్టడం అసహ్యకరమని అంటున్నారు. ట్రంప్ గాజా ప్రణాళిక ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఒకవైపు మిడిల్ ఈస్ట్‌లో శాంతి, అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకున్నట్లుగా చెబుతున్నా, దాన్ని అమలు చేసే పద్ధతులు చట్టబద్ధంగా, నైతికంగా ప్రశ్నార్థకంగా మారాయి. ఈ ప్రణాళికను వ్యతిరేకిస్తున్న దేశాలు, మానవ హక్కుల సంస్థలు, అంతర్జాతీయ చట్టాల పరంగా దీని అమలును నిలిపి వేయాలని కోరుతున్నాయి. మరి, ట్రంప్ ఈ ప్రతిపాదనను కొనసాగిస్తారా? లేక ప్రపంచస్థాయిలో పెరుగుతున్న ఒత్తిడికి తలొగ్గుతారా?

# ఉన్నత విద్య వ్యవస్థలో అవినీతి పందికొక్కులు

- ఉన్నత విద్యా సంస్థలకు స్వయంప్రతిపత్తి అవసరమే
- వినూత్న బోధనా పద్ధతులు అందించే ప్రక్రియ సమంజసం
- కానీ గుర్తింపు ప్రక్రియ కోసం అక్రమమార్గాలు వెతకటం దుర్లభం
- అనైతిక పద్ధతులతో ఉన్నత విద్యా వ్యవస్థ సమగ్రత కు దెబ్బ
- ఈ క్రమంలో కెఎల్ వర్శిటీకి న్యాక్ కార్యకలాపాలలో పాల్గొనకుండా శాశ్వత నిషేధం



**డాక్టర్ . యం. సురేష్ బాబు**
**9989988912**

ఏ దేశ అభివృద్ధిలోనైనా విద్య కీలక పాత్ర పోషిస్తుంది. అందువల్ల, ఉన్నత విద్య యొక్క పరిమాణం, నాణ్యత అందించే విద్యా కార్యక్రమాల ఔచిత్యము శ్రేష్ఠత పెంపొందించేందుకు నియంత్రణ మండలి, న్యాక్ ఎన్బిఏ లాంటి అక్రిడేషన్ సంస్థలు ప్రవేశపెట్టారు. సెల్ఫ్ ఫైనాన్స్ సంస్థలు, విద్యా సంస్థలు తమ పనితీరును నిర్దేశించిన పారామితులకు అనుగుణంగా ఆత్మపరిశీలన ద్వారా విద్య వనరులు, బోధనా పద్ధతులు నాణ్యమైన విద్య, సామాజిక సమగ్రత, శాస్త్ర సాంకేతిక రంగంలో పురోగాభివృద్ధి, వినూత్న బోధనా పద్ధతులు అందించే ప్రక్రియ ద్వారా అంచనా వేయడానికి న్యాక్ ఏర్పాటు చేయబడింది. విద్యాసంస్థలు ఇచ్చిన సమాచారంతో కూడిన సమీక్ష ప్రక్రియ ద్వారా సంస్థ తన బలాలు, బలహీనతలు అవకాశాలను తెలుసుకోవాలి. ఉన్నత విద్యా సంస్థలకు స్వయం ప్రతిపత్తి కలిగిన అక్రిడిటేషన్ ఏజెన్సీ, నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ గుంటూరులోని కోనేరు లక్ష్మయ్య ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఐదు సంవత్సరాల పాటు సర్టిఫికేషన్ కోసం దరఖాస్తును సమర్పించకుండా నిరోధించింది. న్యాక్ ఇన్స్పెక్షన్‌లో కేఎల్ కు ఏంం గ్రేడ్ పొందడానికి లంచాలు చెల్లించారనే ఆరోపణలకు సంబంధించి సీబీఐ కోనేరు లక్ష్మయ్య యూనివర్సిటీ వీసీ, డైరెక్టర్, వైస్ చైర్మన్ ను అదుపులోకి తీసుకున్న వారం తర్వాత ఇది జరిగింది. పీర్ బృందంలోని ఏడుగురు సభ్యులు అసెస్మెంట్లలో లేదా ఇతర న్యాక్ కార్యకలాపాలలో పాల్గొనకుండా శాశ్వతంగా నిషేధించాలని కూడా నిర్ణయించింది. అంతేకాకుండా, ఫలితాలు ఇంకా ప్రకటించబడని ఉన్నత విద్యా సంస్థలు కు ఏడుగురు సభ్యులు ఇటీవల చేసిన సందర్శనలలో దేనినైనా సమీక్షిస్తారు. అటువంటి ఉన్నత విద్యా సంస్థల పరిశోధన ఫలితాలు గోప్యంగా ఉంచబడతాయి ఫలితాలు బహిరంగంగా ప్రకటించే ముందు న్యాక్ స్టాండింగ్ కమిటీ ఒక క్లిష్టమైన మూల్యాంకనాన్ని నిర్వహించవచ్చు. గత సంవత్సరం సందర్శనలు క్షుణ్ణంగా పరిశీలించి, అవసరమైతే అదనపు చర్య కోసం ఎక్సిక్యూటివ్ కౌన్సిల్ కు సమర్పించాలని న్యాక్ ఒక ప్రకటనలో పేర్కొంది. రాధాకృష్ణన్ కమిటీ సిఫార్సులు అనుగుణంగా, న్యాక్ 2025 ఏప్రిల్-మే లో ప్రాథమిక అక్రిడిటేషన్‌ను ప్రారంభిస్తుంది.

దీని తర్వాత మెచ్యూరిటీ ఆధారిత గ్రేడెడ్ లెవల్స్ ఉంటాయి. దేశ ఉన్నత విద్యా వ్యవస్థలో జరిగిన భారీ అవినీతి బయటపడింది. ఉన్నత విద్యా సంస్థలకు ఇచ్చే నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ అనుకూల గ్రేడ్ ఇచ్చేందుకు లంచం డిమాండ్ చేయడం వెలుగులోకి వచ్చింది. ఇప్పటికే డబ్బులు తీసుకుని నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వంటి ఘటనలు మరవక ముందే మళ్లీ నాక్ గ్రేడ్ కోసం కోట్ల రూపాయాల డబ్బులను డిమాండ్ చేయడం బయటపడింది. జేఎన్యూ ప్రొఫెసర్ రాజీవ్ సిజారియా కేయల్ యూనివర్సిటీకి నాక్ తనిఖీ నివేదికను తారుమారు చేయడానికి క్యాంపస్లోని తన నివాసంలో లంచం కోసం చర్చలు జరిపారు. అనుకూలమైన అక్రిడిటేషన్ గ్రేడ్ ఇవ్వడానికి నాక్ బృందం సభ్యులు కేఎల్ఈఎఫ్ నుంచి రూ.1.8 కోట్లు డిమాండ్ చేశారు. చర్చల తర్వాత, రూ.28లక్షలకు ఒప్పందం ముగిసింది. ప్రొఫెసర్ రాజీవ్ సిజారియా ప్రధాన వాటాను సొంతం చేసుకున్నారు. సీబీఐ సోదాలు నిర్వహించి కేసు నమోదు చేసింది. ప్రొఫెసర్ సిజారియాతో సహా మొత్తం పది మందిని దర్యాప్తు సంస్థ అరెస్టు చేసింది. అనుకూల గ్రేడ్ల కోసం లంచం ఇవ్వడం, తీసుకోవడం దారుణం. బీజేపీ, ఆర్ఎస్ఎస్ పాలనలో పెంచి పోషించిన అవినీతి వ్యవస్థ ప్రత్యక్ష ఫలితమే ఈ ఉదంతం. అర్హత లేని పార్టీ విధేయులు ఉన్నత విద్యా సంస్థల్లో కీలకమైన స్థానాల్లో ఉన్నారు, సంస్థలను మోసం, పక్షపాత కేంద్రాలుగా మారుస్తున్నారు. ప్రొఫెసర్ రాజీవ్ సిజారియా చాలా కాలంగా ఆర్ఎస్ఎస్, ఏబీవీపీ వ్యక్తి. ప్రస్తుత యూజీసీ చైర్మెన్, జేఎన్యూ మాజీ వైస్ ఛాన్సలర్ మామిడాల జగదీశ్ కుమార్ వ్యక్తిగతంగా నియమించుకున్నారు. విద్యారంగంలో అకస్మాత్తుగా ఎదగడానికి ముందు, సిజారియా కిర్లోస్కర్ జనరేటర్లకు సేల్స్మ్యాన్గా ఉన్నాడు. తర్వాత ప్రయివేట్ బిజినెస్ స్కూల్స్‌లో చేరాడు. 2020లో మామిడాల జగదీష్ కుమార్ ఆయనను జెఎన్యులో ఫ్యాకల్టీ సభ్యుడిగా నియమించారు. 2023 నాటికి ప్రస్తుత విసి శాంతిశ్రీ ధూళిపూడి పండిట్ ఆధ్వర్యంలో డీన్ పదవికి ఎదిగాడు. ఆయన విద్యాపరమైన ప్రతిభ ఆధారంగా కాకుండా రాజకీయ ప్రోత్సాహం ఆధారంగా ఎదిగారు. ఆయన 2016లో యూపీలోని మీరట్లో ఏబీవీపీ అధ్యక్షుడిగా కూడా ఉన్నారు. మామిడాల జగదీశ్ కుమార్.. సిజారియాకు జేఎన్యూలో పదోన్నతి కల్పించడమే కాకుండా బీహెచ్యూ కోర్టు, ఏఐసీటీఈ సలహా కమిటీ, నిట్, ఐఐఈఎస్టీ శిబ్పూర్, ముఖ్యంగా నాక్లో కూడా పదవులు పొందారు. ఆయన ఇప్పుడు అవినీతి సామ్రాజ్యాన్ని నియమించుకున్నాడు. ఆర్ఎస్ఎస్, ఏబీవీపీ విద్యా సంస్థలలోకి చొరబడిందని అని చెప్పడానికి చక్కని తార్కాణం. ఇలాంటి నేర చరిత్ర గడ్డి తినే స్వభావం ఉన్నవారు ఇటీవల కాలంలో కేంద్ర సంస్థలలో అధినేతలు గా చలామణి అవుతున్నారు. ప్రైవేటు విశ్వవిద్యాలయాలకు గుర్తింపు ఇచ్చే సమయంలో యూజీసీ కొన్ని కఠిన నిర్ణయాలు తూచా తప్పకుండా పాటించాలి, లేనిచో ఇంకోసారి ఆ విశ్వవిద్యాలయాలకు గుర్తింపు రద్దు చేస్తారు. కానీ ఇలాంటి ప్రైవేటు విశ్వవిద్యాలయాల్లో ఇప్పుడు ప్రో వైస్ ఛాన్సలర్, ఛాన్సలర్, బోర్డు మెంబర్ లు అందరు గతంలో యూజీసీ లోను / ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో ఉన్నత పదవులు వెలగబెట్టిన వారే. ప్రైవేటు విశ్వవిద్యాలయాల వెబ్సైట్ పరిశీలిస్తే ప్రతి ప్రైవేటు విశ్వవిద్యాలయంలో యూజీసీ, ఏఐసీటీఈ, న్యాక్, ఎన్బీఏ లో డైరెక్టర్లు, సలహాదారులు, పేరెన్నిక కలిగిన విశ్వవిద్యాలయాలలో ఉపకులపతిగా పనిచేసినవారు ఉంటున్నారు. వీరందరూ రిటైర్ అయిన తరువాత తమ కుటుంబంతో గడుపుతుంటారు తప్ప అక్కడకు వెళ్ళేది కేవలం రెండు నెలలకు ఒకసారి. వీరంతా మా బలమని ఈ విశ్వవిద్యాలయాలు విర్రవీగు తుంటాయి. వారికైతే ప్రభుత్వ మరియు యూజీసీ వివిధ విభాగాలలో పనిచేసిన అనుభవం ఉంది కాబట్టి నందిని పంది గా సులభంగా మార్చవచ్చు. కంచె చేను మేస్తే కాపు ఏమి చేయగలరు. ఇటువంటి అనైతిక పద్ధతులతో మన ఉన్నత విద్యా వ్యవస్థ యొక్క సమగ్రతను దెబ్బతీస్తాయి. ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించడానికి విద్యా నైపుణ్యం ప్రమాణాలు నిలబెట్టడానికి త్వరిత నిర్ణయాత్మక చర్య అవసరం.

# ప్రపంచ విశేషాలను ఇంటికి చేర్చే రేడియో !

ప్రపంచ మానవాళికి ఆత్మీయ నేస్తంగా గత 130 ఏండ్ల నుంచి సమాచార వినోద విజ్ఞాన క్రీడా సమకాలీన వార్తలను ఇంటింటి చేర్చుతున్న ఎలక్ట్రానిక్ ఉపకరణంగా రేడియో అమూల్య సేవలను అందిస్తున్నది. టెలివిజన్, ఇంటర్నెట్, స్మార్ట్ఫోన్ రాకతో రేడియో వినియోగం కొంత తగ్గినా, నేటికీ మారుమూల మానవాళి మనసులను సహితం దోస్తున్న ఉపకరణం రేడియో మాత్రమే. నమ్మకానికి పెట్టింది పేరు మన రేడియో. సాపేక్షంగా చవకైన సాధనంగా రేడియో ప్రపంచ వార్తలను క్షణాల్లో అందిస్తూ, సహజ/మానవ తప్పిద విపత్తుల సమయంలో ప్రజలకు విలువైన సమాచారాన్ని అందిస్తున్న రేడియో ప్రాధాన్యం ఎన్నటికీ చెక్కుచెదరదు. వాహన ప్రయాణ సమయాల్లో మనందరికీ ఉపయోగకరమైన రేడియో మన నిత్య స్నేహితుడిగా వ్యవహరిస్తున్నది. 1895లో ఇటాలియన్ గుల్గిమో మార్కోనీ ఆవిష్కరించిన రేడియో కాలక్రమంలో 1919లో అమెరికాలో తొలి రేడియో స్టేషన్ ప్రారంభం కావడం, 1939లో ఎఫ్ఎం రేడియో ప్రసారాలు ప్రారంభం అయ్యాయి. 1994లో డిజిటల్ రంగులు అద్దుకోని 24 - గంటల సమాచార వితరణ ప్రసారాలు చేస్తున్న రేడియో నేటికీ ప్రతి ఇంట్లో మారుమోగుతానే ఉన్నది. ప్రపంచవ్యాప్త సమాచారం, విద్య, వైజ్ఞానిక, వ్యవసాయ, వినోద, వాతావరణ హెచ్చరికలు, స్థానిక వార్తలు, సంగీతం, లలిత గీతాలు, క్రీడా విశేషాలు, రన్నింగ్ కామెంటరీలు, చర్చలు, మార్కెటింగ్ అంశాలు, సమకాలీన సమస్యలు లాంటి అనేక అంశాలను నిత్యం మన వద్దకు చేర్చుతున్న రేడియో ప్రయోజనాలు అనంతం.

2011లో యునెస్కో చొరవ, ప్రతిపాదనలతో 2012 నుంచి ఐరాస సభ్య దేశాలు ప్రతి ఏట 13 ఫిబ్రవరి రోజున "ప్రపంచ రేడియో దినం (వరల్డ్ రేడియో డే)" నిర్వహించడం ఆనవాయితీగా మారింది. రేడియో విలువను అవగాహన పరచడం, నవ్య టెక్నాలజీలను అందిపుచ్చుకొని అవసర మార్పులు చేసుకుంటూ నేటికీ రేడియో తన ఉనికిని చాటుకుంటూనే ఉన్నది. ప్రపంచ రేడియో దినం వేదికగా స్థానిక, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ రేడియో ప్రసారాలు నిర్విరామంగా కొనసాగడాన్ని ప్రజలకు అవగాహన పరచడం కూడా జరుగుతుంది. అంతర్జాల డిజిటల్ టెక్నాలజీలను అందిపుచ్చుకొని వాతావరణ సమాచారాన్ని, వాతావరణ మార్పుల కట్టడికి నడుంబించిన మన నమ్మకమైనా మిత్రుడు రేడియో అంటూ ఏకరువు పెట్టడం కూడా జరుగుతుంది. ప్రపంచ మానవాళినా ఉక్కిరిబిక్కిరి చేస్తున్న వాతావరణ ప్రతుల మార్పులను ప్రజల చెత్తకు చేర్చుతూ పర్యావరణ పరిరక్షణ, సుస్థిర వాతావరణ స్థాపన, పౌర సమాజ పాత్రను సహితం వివరించడానికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంలో రేడియో



ప్రధాన భూమికను నిర్వహిస్తున్న వేళ ప్రపంచ రేడియో దినం-2025 ఇతివృత్తంగా "రేడియో-వాతావరణ మార్పులు : వాతావరణ కార్యాచరణకు శక్తివంతమైన సాధనం" అనే అంశాన్ని తీసుకొని ప్రచారాలు నిర్వహించడం జరుగుతుంది. ప్రపంచ రేడియో దినం వేదికగా కార్యశాలలు, వెబినార్లు, సదస్సులు, చర్చలు, విద్యాలయాల్లో అవగాహన కార్యక్రమాలు, విద్యా వైజ్ఞానిక సమావేశాలు లాంటి పలు కార్యక్రమాలు నిర్వహించాలి. నేటి ఆధునిక డిజిటల్-ఏఐ యుగంలో కూడా రేడియో అవసర మార్పులు చేసుకుంటూ మానవాళి ప్రియ విశ్వాస నేస్తంగా రేడియో సేవలు అందిస్తున్న వేళ అందరికీ ప్రపంచ రేడియో దినోత్సవ శుభాకాంక్షలను తెలుపుకుందాం, రేడియో ప్రసారాలతో ప్రయోజనం పొందుదాం.

**- డా: బుర్ర మధుసూదన్ రెడ్డి, 9949700037**

సూర్య
విజయవాడ
గురువారం
13 ఫిబ్రవరి 2025


## విజయ్ పార్టీకి 'పీకే' వ్యూహాలు..

చెన్నై: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు ఏడాదికిపైగా సమయం ఉన్నప్పటికీ ప్రధాన రాజకీయ పార్టీలు ఇప్పటి నుంచే కసరత్తు చేస్తున్నట్లు కనిపిస్తోంది. ఈ క్రమంలో నటుడు విజయ్ సారథ్యంలో కొత్తగా ఏర్పడిన తమిళగ వెట్రి కళగం నేతలు ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్తో మంతనాలు జరపడం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. దీంతో వచ్చే ఎన్నికల్లో టీవీకేకు పీకే ప్రత్యేక సలహాదారుగా ఉండనున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. తాజాగా ఈ పరిణామాలపై స్పందిస్తోన్న తమిళ పార్టీలు.. పీకే-విజయ్ భేటీని తేలికగా తీసుకుంటున్నట్లు పేర్కొన్నాయి. తమిళనాడులో కొత్తగా ఏర్పడిన విజయ్ పార్టీకి 15 నుంచి 20శాతం ఓటు షేర్ ఉండవచ్చని ప్రశాంత్ కిశోర్ అంచనా వేసినట్లు సమాచారం. అయితే, దీనిని మరింత పెంచేందుకు వ్యూహాలు రచిస్తున్నారనే వార్తలు వచ్చాయి. దీనిపై డీఎంకే నేత, మంత్రి శేఖర్బాబు స్పందిస్తూ.. ఎన్నికల్లో ఓట్లు అడిగే ప్రతి పార్టీ, తమకే 100శాతం ఓట్లు వస్తాయని ప్రకటించుకోవడం పరిపాటేనన్నారు. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ను మరోసారి ఎన్నుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. డీఎంకే నేత కనిమొళి స్పందిస్తూ.. ఎన్నికల వ్యూహకర్తగా ఉన్న పీకే ఓ రాజకీయ పార్టీకి సేవలందిస్తే తమకేమీ ఇబ్బంది, ఆందోళన ఉండదన్నారు. సినీ గ్లామర్ ఒక్కటే రాజకీయాల్లో విజయానికి దోహదం చేయదని సీపీఎం నేత బాలకృష్ణన్ అభిప్రాయపడ్డారు. బిహార్ ఉపఎన్నికల్లో జన్ సురాజ్ పార్టీ అభ్యర్థుల ఓటమిపై పీకే స్పందన తనకు ఆశ్చర్యాన్ని కలిగించిందన్నారు. ప్రశాంత్ కిశోర్ పర్యటనపై ఎన్టీకే చీఫ్ సీమాన్ మాట్లాడుతూ.. పీకే వ్యూహాలపై తనకు విశ్వాసం లేదన్నారు. విజయ్ పనితీరుపైనే టీవీకే పురోగతి ఆధారపడి ఉంటుందని డీఎండీకే నేత ప్రేమలతా విజయ్కాంత్ అభిప్రాయపడ్డారు. విజయ్ పార్టీతోపొత్తు అంశాన్ని ఆ పార్టీనే అడగాలని, అన్నాడీఎంకేతో తమ భాగస్వామ్యం కొనసాగుతుందన్నారు. ఇదిలాఉంటే, గత అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే కోసం పనిచేసిన ప్రశాంత్ కిశోర్.. ఇటీవల టీవీకేతో మంతనాలు జరిపారు. రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు, ఇతర పార్టీలతో పొత్తు అవకాశాలు వంటి విషయాలపై చర్చించినట్లు సమాచారం.



# నా స్నేహితుడిని కలవడం సంతోషంగా ఉంది.. ప్రధాని మోడీ

- ఏఐ యాక్షన్ సమ్మిట్కు ముందు అధ్యక్షుడు మాక్రాన్ ప్రధాని మోడీ భేటీ
- యూఎస్ ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్తో సహా అతిథులకు విందు..
- కొత్త భారత నూతన కాన్సులేట్ పారంభం
- నేడు ట్రంప్తో భారత ప్రధాని భేటీ

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఫ్రాన్స్ పర్యటనకు వెళ్లిన విషయం అందరికీ తెలిసిందే. 3 రోజుల పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ వెళ్లగా.. సోమవారం రోజు ఉదయం అక్కడకు చేరుకున్నారు. ఏఐ శిఖరాగ్ర సమావేశానికి ముందుగా ఫ్రాన్స్ దేశాధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్తో సమావేశం అయ్యారు. అలాగే విందులో కూడా పాల్గొన్నారు. అక్కడే అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ను సైతం కలుసుకున్నారు. అయితే తాజాగా దీనిపై స్పందిస్తూ ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా ఓ పోస్టు పెట్టారు. అందులో తన స్నేహితుడిని కలవడం చాలా సంతోషంగా ఉందంటూ ట్వీట్ చేశారు. మరి ఆ స్నేహితుడు ఎవరో తెలుసుకుందాం. ముందుగా ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ను కలిశారు. ఈక్రమంలోనే ఆయన మోదీని ఆత్మీయంగా కౌగిలించుకున్నారు. ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న ఏఐ యాక్షన్ సమ్మిట్కు ముందు అధ్యక్షుడు మాక్రాన్ ప్రధాని మోదీ, యూఎస్ ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ సహ అతిథులకు విందు ఇచ్చారు. ఈక్రమంలోనే ముగ్గురు నాయకులు ఒకరితో ఒకరు సంభాషించుకుంటూ కనిపించారు. ఇప్పటికే ఇందుకు సంబంధించిన ఫొటోలు నెట్టింట వైరల్ అయ్యాయి. ప్రధాని మోదీ ఫ్రాన్స్ పర్యటనలో ఒక ప్రత్యేక అంశం ఏమిటంటే అధ్యక్షుడు మాక్రాన్ ఆయనకు ఇచ్చిన సమయం, గౌరవం. మొదటి రోజు అధ్యక్షుడు మాక్రాన్ ప్రధాని మోదీ ఇచ్చిన విందులో ఆయనతో గడిపారు.
మరోవైపు ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. అందులో ఫ్రాన్స్ అధ్యక్షుడు, తన స్నేహితుడు అయిన ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ను కలవడం చాలా సంతోషంగా ఉందన్నారు. అలాగే ఆయనను ఆలింగనం చేసుకున్న ఫొటోతో పాటు ఆత్మయంగా మాట్లాడుతున్న ఫొటోను షేర్ చేశారు. దీంతో పాటే మరో పోస్ట్ పెట్టిన మోదీ.. అక్కడి ప్రజలు మర్చిపోలేని స్వాగతాన్ని పలికారని చెప్పారు. భారత ప్రవాసులకు కృతజ్ఞతలు చెబుతూనే.. వారి విజయాల పట్ల గర్వంగా ఉందని వెల్లడించారు. స్నేహానికి ఒక అసాధారణ చిహ్నంగా, వారు ఉమ్మడి మోటారుకేడ్లో, ఒకే విమానంలో మార్సెయిల్కు ప్రయాణించారు. అధ్యక్షుడు మాక్రాన్ ప్రధాని మోదీ దిగిన వెంటనే మార్సెయిల్లో వర్కింగ్ డిన్నర్కు ఆతిథ్యం ఇచ్చారు. ఈరోజు అధ్యక్షుడు మాక్రాన్ మార్సెయిల్లో భారత కాన్సులేట్ను ప్రారంభించడానికి ప్రధాని మోదీతో కలిసి వెళ్లడంతో ఈ ప్రత్యేక బంధం మరింతగా వెలుగులోకి వస్తుంది. మాక్రాన్ లాంటి నాయకుడు ఏ ప్రపంచ నాయకుడికైనా ఇంత సాన్నిహిత్యం, సమయం ఇవ్వడం చాలా అరుదు అని అన్నారు మోదీ.
ఫ్రాన్స్లోని మార్సెయిల్లో భారత నూతన కాన్సులేట్ ను ప్రధాని మోదీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ సంయుక్తంగా ప్రారంభించారు. అంతకు ముందు మేక్రాన్తో కలిసి భారత అమరవీరులకు మోదీ నివాళులు అర్పించారు. మొదటి ప్రపంచ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన భారత సైనికుల త్యాగాలకు గుర్తుగా గతంలో ఆ దేశ ప్రభుత్వం మార్సెయిల్ ప్రాంతంలో యుద్ధ స్మారకం నిర్మించింది. కామన్వెల్త్ వార్ గ్రేవ్స్ కమీషన్ (CWGC)చే దీని నిర్వహణ బాధ్యతలు తీసుకుంది. ఈ నేపథ్యంలో ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక చర్చలు జరిగినట్లు పీఎంఓ వెల్లడించింది. ద్వైపాక్షిక సంబంధాలు, అంతర్జాతీయ, ప్రాంతీయ సమస్యలపై చర్చలు జరిపినట్లు పేర్కొంది. సాంకేతికత, రక్షణ, పౌర అణుఇంధనం, అంతరిక్షం తదితర రంగాల్లో పరస్పరం సహకరించుకోవాలని అంగీకారానికి వచ్చినట్లు సమాచారం. ఫ్రాన్స్ పర్యటనలో ఉన్న ప్రధాని



మోదీ మంగళవారం పారిస్ వేదికగా జరిగిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యాక్షన్ కమిటీ సమావేశానికి సహ అధ్యక్షుడిగా వ్యవహరించారు. పలు దేశాల అధినేతలు, టెక్ రంగ నిపుణులను ఉద్దేశించి ప్రసంగించారు. నేటితో ఫ్రాన్స్ పర్యటనను ముగించుకొని.. సాయంత్రానికి అమెరికాకు చేరుకోనున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తో భేటీ అవుతారు. ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారి భేటీ కానున్న ప్రధాని మోదీ.. పలు అంశాలపై చర్చలు జరిపే అవకాశముంది. పలు దేశాలపై ట్రంప్ టారిఫ్లు విధిస్తున్న నేపథ్యంలో మోదీ అమెరికా పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది.







### రోహింగ్యాల పిల్లలనూ
## చదువుకోనివ్వండి
### సుప్రీం కోర్టు కీలక తీర్పు




న్యూఢిల్లీ పిల్లలకు విద్యావకాశాల్లో ఎలాంటి వివక్షకు తావివ్వొద్దని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఢిల్లీలో రొహింగ్యా శరణార్థుల పిల్లలకు విద్య, వైద్య సదుపాయం కల్పించాలని, ప్రభుత్వానికి అనుగుణంగా ఆదేశాలివ్వాలని రొహింగ్యా మానవ హక్కుల ఎన్జీవో ఓ పిటిషన్ వేసింది. ఈ పిటిషన్ విచారిస్తూ ఢిల్లీలో ఉంటున్న రొహింగ్యా శరణార్థుల పిల్లలకూ విద్యావకాశాలను కల్పించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ రొహింగ్యా కుటుంబాలు ఎక్కడ నివసిస్తున్నాయి? ఎవరి ఇళ్లల్లో ఉంటున్నాయి? వంటి వివరాలు సమర్పించాలని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్ కోటీశ్వర్ సింగ్ల ధర్మాసనం అడిగింది. ఎన్జీవో తరపున వాదనలు వినిపిస్తున్న సీనియర్ అడ్వకేట్ కొలిన్ గొంజాల్వేజ్ ఆ వివరాలు పిటిషన్లో పొందుపరిచామని, మరిన్ని వివరాలు అందించడానికి కొంత సమయం ఇవ్వాలని కోర్టును కోరారు. పది రోజుల తర్వాత విచారిస్తామని కోర్టు వాయిదా వేసింది. రొహింగ్యా శరణార్థుల పిల్లల వద్ద ఆధార్ కార్డులు లేనందున స్కూలు, హాస్పిటల్లలో సేవలు పొందలేకపోతున్నారు. ఢిల్లీ విద్యా సంస్థల్లో పది, 12వ తరగతులు, డిగ్రీ చదువులకూ, ప్రభుత్వ హాస్పిటళ్లలో వైద్య సేవలకు ఆధార్ లేదని సేవలు తిరస్కరించరాదని, సబ్సిడీ బియ్యం, ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలూ వీరికి అందించాలని విజ్ఞప్తి చేసింది. ఈ శరణార్థుల దగ్గర యూఎన్హెచ్సీఆర్ కార్డులు ఉన్నాయని, ఆధార్ కార్డులు లేవని వివరించింది.

# అమెరికాలో నక్కిన గ్యాంగ్స్టర్లు..

- జాబితా సిద్ధం చేసిన భారత్..!
- నివేదిక రూపొందించిన భద్రతా ఏజెన్సీలు
- అమెరికాకు ఇవ్వనున్నట్లు సమాచారం.

న్యూఢి : ప్రధాని మోదీ అమెరికా పర్యటన వేళ భారత్ కీలక నిర్ణయం తీసుకోనుందని తెలుస్తోంది. అమెరికాలో నక్కి.. భారత్లో చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడుతున్న గ్యాంగ్స్టర్లను తిరిగి వెనక్కి రప్పించే ప్రయత్నాలను వేగవంతం చేయనుంది. దీనిలో భాగంగా సిద్ధం చేసిన గ్యాంగ్స్టర్ల జాబితాను అగ్రదేశానికి ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఈమేరకు భద్రతా ఏజెన్సీలు ఓ నివేదిక రూపొందించాయని జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి.
గోల్డీ బ్రార్, అన్మోల్ బిష్ణోయ్ సహా జాతీయ దర్యాప్తు సంస్థ వాంటెడ్ జాబితాలో ఉన్న గ్యాంగ్స్టర్ల పేర్లు ఆ నివేదికలో ఉన్నాయి. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆదేశాలకు అనుగుణంగా ఇది రూపొందింది. విదేశాల్లో ఉంటున్న నేరగాళ్ల జాబితా కేంద్ర సంస్థల వద్ద ఇప్పటికే ఉంది. అయితే కొన్ని వారాల క్రితం ప్రత్యేకించి యూఎస్ కేంద్రంగా ఉన్న వారి జాబితాను సిద్ధం చేయాలని మంత్రిత్వ శాఖ తన ఆదేశాల్లో పేర్కొన్నట్లు సమాచారం. బాలీవుడ్ నటుడు సల్మానా?న్ ఇంటి బయట కాల్పుల ఘటన సహా పలు కేసుల్లో నిందితుడు అన్మోల్ బిష్ణోయ్ అమెరికాలో ఉన్నట్లు ముంబయి పోలీసులకు ఇప్పటికే సమాచారం ఉంది. అతడి కదలికలకు సంబంధించిన వివరాలను అమెరికా అధికారులు.. పోలీసులతో పంచుకున్నారు. దీంతో అతడిని భారత్కు రప్పించే ప్రయత్నాలు ఇప్పటికే కొనసాగుతున్నాయి. కొన్ని నెలల క్రితం ముంబయిలో సంచలనం సృష్టించిన బాబా సిద్దిఖీ హత్య కేసు నిందితులతోనూ అన్మోల్




టచ్లో ఉన్నాడు. 2022లో జరిగిన ప్రముఖ పంజాబీ గాయకుడు సిద్ధూ మూసేవాలా హత్య కేసులోనూ అభియోగాలు ఎదుర్కొంటున్నాడు. అన్మోల్పై దాదాపు 18 కేసులు వివిధ ప్రాంతాల్లో నమోదయ్యాయి. ఇతడి గురించి సమాచారం ఇచ్చిన వారికి రూ.10 లక్షల నగదు బహుమతి ఇస్తామని ఇటీవల జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) ప్రకటించిన సంగతి తెలిసిందే. గోల్డీ బ్రార్గా ప్రచారంలో ఉన్న సతీందర్ సింగ్ భారత్లో మోస్ట్వాంటెడ్ క్రిమినల్. అతడు లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్లో అత్యంత కీలకమైన సభ్యుడు. 2022లో జరిగిన సిద్ధూ మూసేవాలా హత్య కేసులో ఒక్కసారిగా ఇతడి పేరు మార్మోగింది. మరోవైపు బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్ ఇంటి పైకి కాల్పులు జరిపిన ఘటనలో కూడా గోల్డీబ్రార్ పేరు వినిపించింది. అతడు కూడా అమెరికాలోనే ఉన్నాడు.

## పాకిస్థాన్లో నాకు మరణశిక్ష పడేలా ఉంది
### మెటా సీఈఓ జుకర్ బర్గ్

వాషింగ్టన్ః ఎవరో ఫేస్బుక్లో పెట్టిన పోస్టు కారణంగా పాకిస్థాన్ లో తనకు మరణశిక్ష విధించాలని చూస్తున్నారని మెటా సీఈఓ జుకర్ బర్గ్ పేర్కొన్నారు. ఇటీవల జో రోగన్ పాడ్కాస్ట్లో పాల్గొన్న ఆయన ఈమేరకు వ్యాఖ్యానించారు. ఈసందర్భంగా పాకిస్థాన్లో ఫేస్బుక్ సంస్థపై నమోదైన దావా గురించి వెల్లడించారు.'వివిధ దేశాల్లో మనం అంగీకరించని చాలా చట్టాలున్నాయి. ఉదాహరణకు.. పాకిస్థాన్లో నాకు మరణశిక్ష విధించాలంటూ ఎవరో దావా వేశారు. ఎవరో ఫేస్బుక్లో



దేవుడిని అవమానిస్తూ ఉన్న చిత్రాలను పోస్టు చేయడమే అందుకు కారణం. ఇది ఎక్కడివరకు వెళ్తుందో తెలీదు. నాకు ఆ దేశానికి వెళ్లాలని లేదు. కాబట్టి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. భావ ప్రకటన స్వేచ్ఛతో పాటు వివిధ దేశాల్లో పాటించే సాంస్కృతిక విలువలపై నిబంధనలు ఉన్నాయి. దీంతో యాప్లోని చాలా కంటెంట్ను అణచివేయాల్సి వస్తోంది. ఆయా దేశాల ప్రభుత్వాలు సైతం మమ్మల్ని జైల్లో పడేసేంత శక్తివంతంగా ఆ నిబంధనలు ఉంటాయి. విదేశాలలో ఉన్న అమెరికన్ టెక్ కంపెనీలను రక్షించడంలో అమెరికా ప్రభుత్వం సాయం అందించాలని భావిస్తున్నా' అని జుకర్ బర్గ్ పేర్కొన్నా

# ఆరంభమైన వరల్డ్ గవర్నమెంట్స్ సమ్మిట్ 2025
## పాల్గొన్న 30 మందికి పైగా దేశాధినేతలు, గ్లోబల్ లీడర్లు

దుబాయ్ః పాలన, సాంకేతికత మరియు ఆర్థిక స్థితిస్థాపకత దేశాల భవిష్యత్తును నిర్వచించే యుగంలో, వరల్డ్ గవర్నమెంట్స్ సమ్మిట్ (డబ్ల్యుజిఎస్ 2025), దాని 12వ ఎడిషన్లో, రాబోయే దశాబ్దంలో ప్రపంచ పురోగతిని నడిపించే పరిష్కారాలను రూపొందించడానికి ప్రపంచంలోని అత్యంత ప్రభావవంతమైన నాయకులను - దేశాధినేతల నుండి సాంకేతిక దార్శనికుల వరకు సమావేశపరుస్తుంది.ఆర్థిక స్థిరత్వం, డిజిటల్ పరివర్తన, ప్రభుత్వ-ప్రైవేటు సహకారం అర్థవంతమైన మార్పును తీసుకురాగల విధానం గురించి పరిష్కారాలను గుర్తించడానికి మరియు విస్తరించడానికి ఫిబ్రవరి 11 నుండి 13 వరకు 30 మందికి పైగా దేశాధినేతలు, 400 మందికి పైగా మంత్రులు, 80 అంతర్జాతీయ సంస్థలు, 140 ప్రభుత్వ ప్రతినిధులు మరియు 6,000 మందికి పైగా సమావేశమవుతారు.
సాంకేతిక మార్పులు మరియు భౌగోళిక రాజకీయ మార్పుల నేపథ్యంలో, ప్రభుత్వాలు, పరిశ్రమలు మరియు ప్రపంచ సంస్థలు ప్రభావవంతమైన మార్పును ప్రేరేపించే ప్రధాన వేదికగా వరల్డ్ గవర్నమెంట్స్ సమ్మిట్ 2025 నిలుస్తుంది. 2013 లో ప్రారంభమైనప్పటి నుండి, ప్రపంచ ప్రభుత్వాల శిఖరాగ్ర సమావేశం భవిష్యత్తు-కేంద్రీకృత ఆలోచనలకు ఒక వేదికగా ఉంది, నాయకులు, నిపుణులు, ఆవిష్కర్తలు మరియు పారిశ్రామికవేత్తలను ఒకచోట చేర్చి భవిష్యత్తును అంచనా వేయడానికి మరియు రూపొందించడానికి " అని యుఎఇ క్యాబినెట్ వ్యవహారాల మంత్రి మరియు ప్రపంచ ప్రభుత్వాల శిఖరాగ్ర సమావేశం చైర్మన్ గౌరవనీయ మొహమ్మద్ అల్ గెర్గావి అన్నారు. ప్రభుత్వాలు, సమాజాలు ఎదుర్కొంటున్న వేగవంతమైన మార్పులు, ఉత్పన్నమవుతున్న సవాళ్లను పరిష్కరించడానికి ఈ ఏడాది శిఖరాగ్ర సదస్సు ప్రపంచ చర్చలను ప్రోత్సహిస్తుంది. మానవాళి పురోగతిని అంచనా వేయడం, మెరుగుదలకు అవకాశాలను గుర్తించడం, అత్యంత సమర్థవంతమైన పాలన, సుస్థిర భవిష్యత్తు ద్వారా భవిష్యత్ తరాలకు సాధికారత కల్పించడం దీని లక్ష్యం. సహకారం ద్వారా ప్రపంచ ప్రభావాన్ని పెంచడం ప్రపంచ ప్రభుత్వాల శిఖరాగ్ర సమావేశం స్పష్టమైన ఫలితాలను సాధించడానికి పాలనను సృజనాత్మకతతో అనుసంధానించడానికి అనుమతించే ప్రత్యామ్నాయ పరిష్కారాలను నడపడానికి రూపొందించబడింది. 300 మందికి పైగా ప్రపంచ నిపుణులు చర్చలో పాల్గొంటారు, 30 వ్యూహాత్మక నివేదికలు ముగుస్తాయి. పరిపాలనలో కృత్రిమ మేధ పాత్ర, చలనశీలత భవిష్యత్తు, ఆర్థిక స్థితిస్థాపకత, వాతావరణ అనుసరణ, ప్రపంచ ఆరోగ్య పరివర్తన, అభివృద్ధి చెందుతున్న సరిహద్దులు మరియు జనాభా క్షీణతతో సహా అత్యవసర అంశాలు 21 ఫోరమ్ లు మరియు 200 ఇంటరాక్టివ్ సెషన్లలో చర్చించబడతాయి. అంతేకాకుండా, 30కి పైగా ఉన్నత స్థాయి మంత్రుల సమావేశాలు వివిధ రంగాలకు చెందిన ప్రభుత్వ నాయకులను ఏకతాటిపైకి తెచ్చి నైపుణ్యం మరియు ఉత్తమ పద్ధతులను మార్పిడి చేసుకుంటాయి. 'ది బెస్ట్ మినిస్టర్ అవార్డు (పీడబ్ల్యూసీ భాగస్వామ్యంతో)', 'గ్లోబల్ గవర్నమెంట్ ఎక్సలెన్స్ అవార్డు'తో సహా ప్రతిష్ఠాత్మక గ్లోబల్ అవార్డుల ద్వారా ఉత్తమ విజయాలను గుర్తిస్తారు. కృత్రిమ మేధస్సు భవిష్యత్తును ఎలా మారుస్తుందో అన్వేషించడానికి ప్రపంచంలోని 100 మంది ప్రముఖ ఏఐ నిపుణులను




ఏకం చేస్తూ టైమ్ 100 ఏఐ సమావేశం 2025 ప్రపంచ ప్రభుత్వాల శిఖరాగ్ర సదస్సులో ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. టెక్నాలజీ, ఫైనాన్స్, ఎనర్జీ, మీడియా రంగాలకు చెందిన టాప్ ఇండస్ట్రీ లీడర్లు ఇన్నోవేషన్ అండ్ గవర్నెన్స్ పై చర్చలకు దోహదపడటంతో ప్రైవేట్ రంగం కీలక పాత్ర పోషిస్తుంది. దుబాయ్ లో జరిగిన వరల్డ్ గవర్నమెంట్స్ సమ్మిట్ 2025లో ప్రపంచ నాయకులు సమావేశమైనప్పుడు - గత సంవత్సరంతో పోలిస్తే 50 శాతం అధిక భాగస్వామ్యంతో, డబ్ల్యుజిఎస్ 2025 ఫార్వర్డ్-థింకింగ్ గవర్నెన్స్ కోసం ప్రపంచంలోని ప్రధాన సమావేశంగా తన స్థానాన్ని పునరుద్ఘాటించింది.

# ఉచితాలు అనుచితాలే...
### ఉచితాలు ఇస్తే.. ప్రజలు పని ఎందుకు చేస్తారు
### రాజకీ య పార్టీల పథకాలపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు




ఢిల్లీ: ఉచిత పథకాలను ఉద్దేశిస్తూ సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఎన్నికల సమయంలో ఆయా రాజకీయ పార్టీలు వీటిని ప్రకటించే పద్ధతి మంచి కాదని వ్యాఖ్యానించింది. పట్టణ ప్రాంతాల్లో నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించాలని దాఖలైన పిటిషన్పై విచారణ చేపట్టిన న్యాయస్థానం.. ఉచితాలపై ఈ వ్యాఖ్యలు చేసింది. "ఉచిత పథకాలు మంచివి కావు. దురదృష్టవశాత్తూ.. వీటి కారణంగా ప్రజలు కష్టపడి పని చేసేందుకు ఇష్టపడడం లేదు. ఉచితంగా రేషన్, డబ్బులు అందుతున్నాయి. ఎలాంటి పని చేయకుండానే డబ్బులు వస్తుండటంతోనే ఇలా జరుగుతోంది. ప్రజలకు సౌకర్యాలు అందించాలన్న ప్రభుత్వాల ఉద్దేశం మంచిదే. కానీ, వారిని దేశ అభివృద్ధిలో భాగం చేయాలి. ఉచితాల ద్వారా అలా జరుగుతోందా..?ఎన్నికల్లో ఉచిత పథకాలు ప్రకటించే పద్ధతి సరైనది కాదు" అని జస్టిస్ బీఆర్.గవై, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసిహ్తో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. కేంద్రప్రభుత్వం పట్టణ పేదరిక నిర్మూలన మిషన్ను పూర్తి చేసే పనిలో ఉందని.. నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించడంతో పాటు పలు సమస్యలను పరిష్కరించేందుకు యోచిస్తున్నట్లు అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి ఈసందర్భంగా ధర్మాసనానికి తెలిపారు. దీనిపై న్యాయస్థానం స్పందిస్తూ.. ఈ నిర్మూలన మిషన్ ఎంతకాలం పాటు పని చేస్తుందో తెలియజేయాలని కేంద్రాన్ని ఆదేశించింది. ఈ పిటిషన్ను మరో ఆరు వారాల తర్వాత విచారిస్తామని వాయిదా వేసింది.

## రష్యాతో భూభాగ మార్పిడికి మేము సిద్ధం
### కుర్స్క్ను అప్పగిస్తామన్న ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ



ఉక్రెయిన్: రష్యాతో భూభాగ మార్పిడికి తాము సిద్ధమని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ పేర్కొన్నారు. అయితే రష్యా ఉక్రెయిన్ భూభాగాలను విడిచిపెడితే తమ అధీనంలో ఉన్న కుర్స్క్ను వారికి అప్పగిస్తామని షరతు పెట్టారు. వాటిలో ఏ భూభాగాలను తిరిగి తీసుకుంటారని మీడియా అడగ్గా తమ భూభాగాలన్నీ ముఖ్యమైనవే అన్నారు. ఏవి తిరిగి తీసుకోవాలనే విషయంపై చర్చల అనంతరం నిర్ణయం తీసుకుంటామని.. అప్పటివరకు చూద్దామని బదులిచ్చారు. తాము అనుకున్నది జరగాలంటే రష్యా-ఉక్రెయిన్ల మధ్య చర్చలు జరిగేలా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కృషి చేయాలని కోరారు. ఇందుకుగాను అమెరికాకు చెందిన సంస్థలకు ఉపయోగపడే పునర్నిర్మాణ ఒప్పందాలు చేసుకుంటున్నామని జెలెన్స్కీ అన్నారు. తమవద్ద అరుదైన ఖనిజ నిల్వలు అధికంగా ఉన్నాయని.. వాటివల్ల అమెరికా కంపెనీలకు లాభాలు చేకూరుతాయని తెలిపారు. ఉక్రెయిన్లోనూ ఉద్యోగాలు సృష్టించవచ్చని తెలిపారు. 2014లో రష్యా క్రిమియాను స్వాధీనం చేసుకుంది. అనంతరం డోనెస్క్, ఖేర్సన్, లుహాన్స్క్, జాపోరిజ్జియా ప్రాంతాలను తన నియంత్రణలోకి తీసుకుంది. అయినప్పటికీ వాటిపై మాస్కోకు పూర్తి నియంత్రణ లేదు. రష్యా- ఉక్రెయిన్ల మధ్య యుద్ధాన్ని ఆపేస్తానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇప్పటికే పలుమార్లు పేర్కొన్న సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో ఇటీవల ట్రంప్ మాట్లాడుతూ ఉక్రెయిన్ ఏదోకరోజు రష్యా లో భాగం కావొచ్చు.. కాకపోవచ్చు అని పేర్కొన్నారు. రష్యా-ఉక్రెయిన్ల మధ్య పోరాటాన్ని ఆపేందుకు ప్రయత్నిస్తున్న తన రాయబారి కీత్ కెల్లాగ్ను త్వరలో కీవ్కు పంపనున్నట్లు ఆయన వెల్లడించారు. ఇక, అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ వచ్చేవారం మ్యూనిచ్లో జెలెన్స్కీతో భేటీ అవుతారని అక్కడి అధికారి తెలిపారు. ఇదిలాఉండగా.. ఇటీవల పుతిన్తో తాను ఫోన్లో మాట్లాడానని ట్రంప్ స్వయంగా తెలిపారు. యుద్ధం కారణంగా అమాయక ప్రజలు చనిపోవడం ఆపాలని పుతిన్ కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. మరోవైపు.. ఉక్రెయిన్కు అమెరికా చేస్తున్న సాయానికి.. 500 మిలియన్ డాలర్ల డీల్ను ప్రతిపాదించగా, దీనికి వారు సైతం అంగీకరించారన్నారు. తమకు ఖనిజాలు లభిస్తే.. ఆ దేశానికి అవసరమైన వాటిని అందిస్తామన్నారు.

## అవినీతిమయ దేశాల జాబితా విడుదల!
### అత్యంత అవినీతి మయ దేశంగా సౌత్ సుడాన్
### 96వ స్థానంలో భారత్
### ట్రాన్స్పరెన్సీ ఇంటర్నేషనల్ సంస్థ తాజా జాబితా లో వెల్లడి



డెన్మార్క్: ప్రపంచ దేశాల్లో అవినీతి ఏ స్థాయిలో ఉందో చెబుతూ ట్రాన్స్పరెన్సీ ఇంటర్నేషనల్ (టీఐ) సంస్థ కరప్షన్ పర్సెప్షన్స్ ఇండెక్స్ను విడుదల చేసింది. అవినీతి అత్యల్పంగా ఉన్న డెన్మార్క్ ఈ జాబితాలో తొలి స్థానం సొంతం చేసుకోగా భారత్ 96వ స్థానంలో నిలిచింది. వివిధ దేశాల్లోని నిపుణులు, వ్యాపారుల అభిప్రాయాల ఆధారంగా ప్రభు త్వంలో అవినీతి ఏ స్థాయిలో ఉన్నదో ట్రాన్స్పరెన్సీ ఇంటర్నేషనల్ ముదింపు వేసింది. మొత్తం 180 దేశాలతో ఈ లిస్టు సిద్ధం చేసింది. అత్యంత అవినీతిమయ దేశాలకు సున్నా స్కోరు, అవినీతి ఇసుమంతైనా లేని దేశాలకు 100 స్కోరు కేటాయించింది ఈ లిస్టు ప్రకారం, గత నివేదికలతో పోలిస్తే భారత్ స్కోరు స్వల్పంగా తగ్గింది. 2023 నివేదికలో భారత్ 38 పాయింట్లు, 2022 నాటి రిపోర్టులో 40 పాయింట్స్ సాధించింది. తాజాగా 2024 రిపోర్టులో భారత్ స్కోరు 38గా నిర్ధారించారు. ఇక భారత్ పొరుగు దేశాలై పాకిస్థాన్ 135వ స్థానం, శ్రీలంక 121 స్థానంలో ఉన్నాయి. బంగ్లాదేశ్ 149 స్థానంలో ఉండగా చైనా 76వ ర్యాంకు సొంతం చేసుకుంది. గతశతాబ్దంలో ఎన్నడూ లేని విధంగా అనేక దేశాల్లో అవినీతి పెరిగిందని ట్రాన్స్పరెన్సీ ఇంటర్నేషనల్ పేర్కొంది. అగ్రరాజ్యాలైన అమెరికా, ఫ్రాన్స్తో పాటు నిరంకుశత్వ పాలన సాగుతున్న రష్యా, వెనిజువెలాలో కూడా ప్రభుత్వాల అవినీతి పెరిగిందని టీఐ పేర్కొంది. అమెరికా స్కోరు 69 నుంచి 65 పాయింట్లకు తగ్గి 24 స్థానం నుంచి 28 స్థానానికి పడిపోయింది. ఫ్రాన్స్ కూడా నాలుగు పాయింట్లు కోల్పోయి 25 స్థానానికి పరిమితమైంది. ఇక జర్మనీ మూడు పాయింట్ల కోల్పోయి 75 స్కోరుతో 15వ ర్యాంకుతో సరిపెట్టుకుంది. ఇక ఈ జాబితాలో సౌత్ సుడాన్ కేవలం 8 పాయింట్ల స్కోరుతో అత్యంత అవినీతిమయ దేశంగా సోమాలియాను వెనక్కు నెట్టి తొలిస్థానంలోకి వచ్చింది. ఇక సోమాలియా 9 పాయింట్లు, వెనెజువెలా 10 పాయింట్లు, సిరియా 12 పాయింట్లతో ఆ తరువాత స్థానాల్లో నిలిచాయి. ప్రపంచంలో అవినీతి ఆందోళనకర స్థాయిలోనే ఉందని టీఐ అభిప్రాయపడింది. ఈ జాబితాలోని 32 దేశాలే అవినీతిని కొంతమేర అరికట్టగలిగాయని, మిగతా 148 దేశాల్లోని పరిస్థితి యథాతథంగా ఉండటం లేదా మరింత దిగజారడం చూశామని టీఐ పేర్కొంది.



# ములుగు మన్నెంలో జాతర సందడి

తెలంగాణ బ్యూరో(ప్రతినిధి: మేడారం చిన్నజాతర బుధవారం ఉదయం ప్రారంభమైంది. వచ్చేది నమ్మక్క-సారలమ్మ కొలువైన మేడారం, కన్నెపల్లికి ద్వారా బంధనం చేసి జాతర ప్రారంభించారు. పొలిమెర దేవతలకు పూజలు నిర్వహించారు. ఈరోజు పూజారులు ఉపవాస, జాగరణ చేస్తారు. ఆదివాసీలు మేడారం, కన్నెపల్లిలోని నమ్మక్క ఆలయాలను అలుకుపూత చేసి శుద్ధి కార్యక్రమం నిర్వహించారు. వన దేవతల మినీ జాతరకు భక్తులు తరలి వస్తున్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసింది. నమ్మక్క పుట్టిన బయ్యక్కపేట, సారలమ్మ జన్మించిన కన్నెపల్లి, జంపన్న, నాగులమ్మ కొలువైన కొండాయి, పగిడిద్దరాజు కొలువైన పూనుగొండ్లలోనూ జాతర సందడి నెలకొంది. ములుగు శివారు గట్టమ్మ ఆలయం దగ్గర భక్తుల రద్దీ నెలకొంది. భక్తులు మేడారం చిన్నజాతరకు వెళ్తూ గట్టమ్మను దర్శించుకుని వెళుతున్నారు.ములుగు జిల్లాలోనిజాతరల సందడి నెలకొంది.

**మేడారం చిన్న జాతరపై బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్ :** మేడారం జాతరలో కోడిని గద్దెల వైపు ఎగురవేసి ఎదురుకోళ్ల మొక్కు సమర్పిస్తారు. అక్కడే వదిలి చేసి వండుకొని బంధుమిత్రులతో విందు చేసుకుంటారు. అయితే.. పలు జిల్లాల్లో బ్రాయిలర్ కోళ్లకు బర్డ్‌ఫ్లూ సోకుతుండటంతో, ప్రభుత్వం అప్రమత్తమైంది కొద్దిరోజులు చికెన్ తినొద్దని సూచిస్తున్న నేపథ్యంలో చిన్న జాతరపై ప్రభావం పడనుంది. బ్రాయిలర్ కోళ్లను తినవద్దని ప్రభుత్వం చెప్పడంతో నాటుకోళ్లకు డిమాండ్ పెరిగింది. దీంతో మేడారంలో బ్రాయిలర్ కోళ్లకు డిమాండ్ తగ్గింది.

**ములుగు మన్నెంలో జాతరల సందడి :** ములుగు ఏజెన్సీలో జాతరల సందడి నెలకొంది. ఆదివాసీలు తమ ఇలవేల్పులను కొలుచుకొనే వేడుకలతో గూడేలు పండగ వాతావరణం సంతరించుకున్నాయి. తాడ్వాయి మండలం మేడారంలో నమ్మక్క, సారలమ్మ చిన్నజాతర బుధవారం ఉదయం ప్రారంభమైంది. ఈ నెల 15 వరకు నాలుగు రోజులపాటు ఈ వేడుకలు కొనసాగనున్నాయి. తొలిరోజు నమ్మక్క కొలువైన మేడారంలోనూ సారలమ్మ కొలువుదీరిన కన్నెపల్లిలోని పూజా మందిరాలను శుద్ధిచేసి అలుకుపూతలు చేశారు. గ్రామాలకు ద్వారబంధం చేసి పొలిమేర దేవతలకు పూజలు నిర్వహించారు. రాత్రివేళ వనదేవతల గద్దెల వద్ద పూజారులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి జాగరణ చేస్తారు. బయ్యక్కపేటలో కూడా బుధవారం నుంచే జాతర మొదలైంది.

## తిరుమల తొక్కిసలాటపై
# సీబీఐ విచారణ అవసరం లేదు




ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్వామి వారి టికెట్ల జారీకి ముందు జరిగిన తొక్కిసలాట ఘటనపై సీబీఐ విచారణకు ఆదేశించాలంటూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు బుధవారం కొట్టివేసింది. ఈ సంఘటనపై ఇప్పటికే ఏపీ ప్రభుత్వం జ్యుడీషియల్ విచారణకు ఆదేశించిందని కోర్టుకు ప్రభుత్వ న్యాయవాది తెలియజేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడంతో.. వేరే విచారణ అవసరం లేదని హైకోర్టు బుధవారం స్పష్టం చేసింది.

ఈ నేపథ్యంలో సీబీఐ విచారణ జరపాలంటూ దాఖలైన పిల్‌ను కొట్టివేసింది. ఇక ఇదే అంశంపై ఈ రోజు మరో పిల్ దాఖలు చేసింది. దీనిని సైతం హైకోర్టు కొట్టివేసింది. టికెట్ల కోసం జరిగిన తొక్కిసలాటపై సీబీఐ విచారణ జరపాలంటూ.. కర్నూల్కు చెందిన ప్రభాకర్ రెడ్డి ఏపీ హైకోర్టులో గతంలో ప్రజా ప్రయోజన వ్యాజ్యం వేశారు.

ఇంతకీ ఏం జరిగిందంటే.. 2025, జనవరి 10వ తేదీ ముక్కోటి ఏకాదశి. ఈ నేపథ్యంలో తిరుమలలో 10 రోజుల పాటు శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనం భక్తులకు కల్పించాలని టీటీడీ నిర్ణయించింది. ఆ క్రమంలో జనవరి 9వ తేదీ తెల్లవారుజాము నుంచి టోకెన్లు జారీ చేయనున్నట్లు టిటిడి ప్రకటించింది. అందుకోసం తిరుపతిలోని ఎనిమిది ప్రాంతాల్లో 94 టోకెన్ జారీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. అందుకోసం దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పిల్లాపాపలతో సహా భారీగా తిరుపతికి వచ్చి చేరుకున్నారు. అయితే బైరాగి పటెడ వద్ద ఏర్పాటు చేసిన కేంద్రంలో సిబ్బంది ఒకరు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో అతడిని ఆస్పత్రికి తరలించేందుకు క్యూ లైన్ గేట్‌ను తెరిచారు.

టోకెన్లు జారీ చేసేందుకు క్యూలైన్లు తెరిచారని భావించిన భక్తులు ఒక్కసారిగా తోసుకురావడంతో ఈ తొక్కిసలాట ఘటన జరిగింది. ఈ తొక్కిసలాట ఘటనలో ఆరుగురు మృతి చెందారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ ఘటనపై టీటీడీ చైర్మన్ సైతం క్షమాపణలు చెప్పారు. అలాగే మృతులకు ఎక్స్ గ్రేషియా ప్రకటించారు. అలాగే క్షతగాత్రులకు సైతం నష్ట పరిహారం అందించారు. అలాగే వారికి మెరుగైన సేవలు అందించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఈ తొక్కిసలాట ఘటనపై సీబీఐతో దర్యాప్తు చేయించాలంటూ ఇద్దరు వ్యక్తులు ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. ఇప్పటికే ఈ ఘటనపై న్యాయ విచారణకు ఏపీ ప్రభుత్వం ఆదేశించింది. దీంతో ఈ ఘటనపై సీబీఐ దర్యాప్తు అవసరం లేదని హైకోర్టు అభిప్రాయపడింది. దీంతో ఈ పిల్‌ను కోర్టు కొట్టి వేసింది.

# పాతబస్తీ ఘటనపై మంత్రి కొండా సురేఖ ఆగ్రహం

## విచారణ చేపట్టి బాధ్యులను కఠినంగా శిక్షించాలని అధికారులకు ఆదేశం



తెలంగాణ బ్యూరో(ప్రతినిధిః హైదరాబాద్ ఓల్డు సిటీ టప్పాచబుత్రా జిర్ర హనుమాన్ ఆలయంలో అపచారం ఘటనపై దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలయంలోని శివలింగంకు సమీపంలో గుర్తు తెలియని దుండగులు మాంసం పడేయడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన మంత్రి ఘటనా స్థలానికి వెళ్లాలని అధికారుకు ఆదేశాలు జారీ చేశారు. మంత్రి ఆదేశంతో ఘటనాస్థలికి బయలుదేరిన స్థానిక దేవాదాయ శాఖ అధికారులు. సమగ్ర వివరాలు తెలుసుకొని నివేదిక అందజేయాలని ఎండోమెంటు డిపార్టుమెంట్ ఉన్నతాధికారులకు మంత్రి ఆదేశించారు. సమగ్ర విచారణ తర్వాత బాధ్యులను కఠినంగా శిక్షించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. భక్తుల నమ్మకాల విషయంలో తమ ప్రజా ప్రభుత్వం ఎక్కడా రాజీ పడదని మంత్రి సురేఖ స్పష్టం చేశారు.

## హామీలను నెరవేర్చని బాబుపై కేసు పెట్టాలి : జగన్



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిపై వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మరోసారి మండిపడ్డారు. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను అధికారంలో వచ్చిన తర్వాత ఆయన అమలు చేయడం లేదని విమర్శించారు. చంద్రబాబు మోసం చేసి అధికారంలోకి వచ్చారు.. మరి ఈ వ్యక్తి చీటర్ కాదా? అని ఆయన ప్రశ్నించారు.

ప్రజలను మోసం చేసిన వ్యక్తిపై 420 కేసు ఎందుకు పెట్టకూడదంటూ అసహనం వ్యక్తం చేశారు. బుధవారం తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులతో మాజీ సీఎం వైఎస్ జగన్ సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా వైఎస్ జగన్ మాట్లాడుతూ.. మొన్నటి స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో ప్రజాస్వామ్యం ఖూనీ అయ్యిందన్నారు. టీడీపీకి సభ్యులు లేక పోయినా దాడులు చేసి భయపెట్టారని.. అలాగే ప్రలోభ పెట్టారని ఆరోపించారు. అన్యాయాలు చేసి గెలిచామంటూ గొప్పగా చెప్పుకుంటున్నారంటూ టీడీపీ నేతలపై ఆయన నిప్పులు చెరిగారు.

ఇంతకంటే నిస్సిగ్గుతనం ఉంటుందా? అంటూ సందేహం వ్యక్తం చేశారు. మన ప్రభుత్వంలో టీడీపీ రెండే రెండు మున్సిపాల్టీలు విజయం సాధించిందని.. అది కూడా మనం గట్టిగా తుమ్మి ఉంటే అవి కూడా వారికి వచ్చేవి కావన్నారు. కానీ మనం ప్రజాస్వామ్యానికి కట్టుబడి ఉన్నామని.. ఆ ఫలితాలను గౌరవించామని చెప్పుకొచ్చారు. టీడీపీ తప్పుడు సంప్రదాయాలకు పాల్పడుతోందంటూ విమర్శించారు. మార్చి నాటికి స్థానిక సంస్థలకు నాలుగేళ్ల పదవీ కాలం ముగియబోతోందని చెప్పారు. తమ వాళ్లని పదవుల్లో కూర్చోబెట్టడానికి ప్రభుత్వంలో ఉన్న వాళ్లు ప్రయత్నిస్తారన్నారు.

రాబోయే రోజుల్లో మరిన్నిదొంగ కేసులు..

మన వాళ్లను భయపెట్టడానికి, లొంగ తీసుకోవడానికి, ప్రలోభపెట్టడానికి ప్రయత్నిస్తారని తెలిపారు.

రాబోయే రోజుల్లో మనపై మరిన్ని దొంగ కేసులు పెడతారు.. అరెస్టులు సైతం చేస్తారని పేర్కొన్నారు. అయితే ఎల్లకాలం పరిస్థితులు ఇలాగే ఉండిపోవని.. రానున్న మన ప్రభుత్వంలో అందరికీ దగ్గరుండి మేలు చేస్తామని గుంటూరు జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులకు మాజీ సీఎం వైఎస్ జగన్ హామీ ఇచ్చారు.

# మాట తప్పడంలో కాంగ్రెస్ నెం.1

- అందుకే రాహుల్ గాంధీ వరంగల్‌కు రాలేదు
- మార్చి 8న మహిళా శంఖారావం జరగబోతోంది
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత



తెలంగాణ బ్యూరో(ప్రతినిధిః కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట తప్పడంలో ముందు వరుసలో ఉంటుందని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. నిన్న రాహుల్ గాంధీ వరంగల్కు రావాలి అనుకొని కూడా రాలేదని, ఇచ్చిన హామీలు నెరవేర్చాలని వరంగల్ ప్రజలు అడుగుతారని రాహుల్ రాలేదన్నారు. ఎన్నికల ముందు మహిళలకు ఎన్నో హామీలు ఇచ్చారని, ఆ హామీలు నెరవేర్చే వరకు వెంటబడతాం అని హెచ్చరించారు. మార్చి 8న మహిళా శంఖారావం జరగబోతోందని, ఇందిరా పార్కు దగ్గర జరిగే ఈ మీటింగ్లో మహిళల సత్తా చాటుతాం అని కవిత పేర్కొన్నారు. ఎమ్మెల్సీ కవిత తన నివాసంలో జాగృతి మహిళా నాయకులు, కార్యకర్తలతో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవిత మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణలో రోజూ ఒక లొల్లి జరుగుతుంది. ఈరోజు ఉదయం శివాలయంలో జరిగిన విషయంపై మళ్ళీ గొడవ మొదలైంది. శాంతి భద్రతల మీద ఈ ప్రభుత్వంకు ఇంట్రెస్ట్ లేనట్టుంది. ఇచ్చిన మాట తప్పడంలో కాంగ్రెస్ మొదటి వరుసలో ఉంటుంది. ఎన్నికల ముందు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలచే హామీలు ఇప్పించారు. నిన్న రాహుల్ గాంధీ వరంగల్కు రావాలనుకొని కూడా రాలేదు. ఇచ్చిన హామీలు నెరవేర్చాలని వరంగల్ ప్రజలు అడుగుతారని రాహుల్ రాలేదు. ఎన్నికల ముందు మహిళలకు ఎన్నో హామీలు ఇచ్చారు. ఆ హామీలు నెరవేర్చే వరకు వెంటబడతాం. మార్చి 8న మహిళా శంఖారావం జరగబోతోంది. ఇందిరా పార్కు దగ్గర జరిగే ఈ మీటింగ్లో మహిళల సత్తా చాటుదాం అని పిలునిచ్చారు.



# మాట తప్పితే.. సీటు దించుతాం

- స్థానిక సంస్థల్లో 42% రిజర్వేషన్లు అమలు చేయాలి
- పార్టీ పరంగా కాదు..చట్టబద్ధంగా కావాలి
- ప్రత్యేక అసెంబ్లీ సమావేశం నిర్వహించి చట్టబద్ధం చేయాలి
- పంచాయతీరాజ్ ఎన్నికలలో జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు పెంచాలి
- ప్రభుత్వం వెంటనే అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేయాలి
- 14 బి.సి సంఘాల సమావేశంలో రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్

తెలంగాణ బ్యూరో(ప్రతినిధిః బీసీలకు రాజ్యాంగపరమైన హక్కులు కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, ఎంపీ ఆర్.కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం బషీర్బాగ్ ప్రెస్ క్లబ్లో 14 బీసీ సంఘాల సమావేశం జరిగింది. బుధవారం 14 సంఘాల అత్యవసర సమావేశం నీల వెంకటేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో భవిష్యత్ ఉద్యమానికి ఏ జెండా కార్యాచరణ సుధీర్ఘంగా చర్చించారు.ఈ సమావేశంలో తెలంగాణ గొరిగె మల్లేష్ యాదవ్, నందగోపాల్, రామకృష్ణ, ఉదయ్ నేత, మోడీ రాందేవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ పంచాయతీరాజ్ ఎన్నికలలో బీసీలకు పార్టీ పరంగా 42 శాతం కోటా ఇస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. పార్టీ పరంగా 42 శాతం ఇస్తే బీసీలకు న్యాయం జరగదు. ఎందుకంటే ఇతర పార్టీల వారు కూడా అంగీకరిస్తే అప్పుడు న్యాయం జరుగుతుంది. లేకపోతే అగ్రకులాలకు ఇస్తే డబ్బుతో పోటీ పడలేరు. అందుకే ఎలాంటి వివాదాలకు తావు లేకుండా అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్లు 42 శాతంకు పెంచుతూ బిల్లు పెట్టి చట్టం చేయాలని జాతీయ బి.సి సంక్షేమ సంఘం అధ్యకులు, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. అప్పుడు అన్ని పార్టీలు కూడా బిసి.లకు ఇస్తాయి. తప్పని సరిగ్గా బీసీలు గెలుస్తారు. రాష్ట్రంలో డెడికేటెడ్ బీసీ కమిషన్ బిసి రిజర్వేషన్లపై మొన్న రిపోర్ట్ ఇచ్చింది. జనాభా లెక్కల సేకరణలో ఒక అవక తవకలు జరిగాయని వాటిని సరి చేయాలని బీసీ మంత్రి పొన్నం ప్రభాకర్ ఏర్పాటు చేసిన సమావేశం లో మేధావులు బీసీ సంఘాలతో మంత్రి సరి చేస్తామని హామీ ఇచ్చారు. సరి చేయకుండానే ఆదర బాధారాగ రిపోర్ట్ ఇచ్చారు. దీనిని అమలు చేయాలని సూచిస్తున్నారు. సుప్రీంకోర్టు తీర్పును దృష్టిలో ఉంచుకొని రిజర్వేషన్లు పెంచకుండా ప్రభుత్వం తప్పించుకోవడానికి కుట్రలు చేస్తుందని విమర్శించారు

సుప్రీంకోర్టు తీర్పు 20 సంవత్సరాలకు పూర్వం వచ్చింది. అగ్రకులాలలో పేదలకు 10 శాతం రిజర్వేషన్లు ఇచ్చినప్పుడు 50 శాతం సీలింగ్ సుప్రీంకోర్టు ఎత్తివేసింది ఇప్పుడు ఏ సీలింగ్ లేదు. ఇచ్చిన మాట ప్రకారం అసెంబ్లీలో రిజర్వేషన్లు పెంచుటకు చట్టం చేయాలి తర్వాత వచ్చే పరిణామాలను ఎలా ఎదుర్కోవాలో చూద్దామని సవాల్ చేశారు.

ముఖ్యమంత్రి రిజర్వేషన్లు పెంచకుండా కులాల లెక్కలు తప్పుగా చూపిస్తూ ప్రజల దృష్టి డైవర్షన్ పాల్పడుతున్నారని విమర్శించారు. 42 శాతం కు పెంచుతూ అసెంబ్లీలో చట్టం చేస్తే ఇబ్బంది ఏమిటి అని ప్రశ్నించారు. ఏమైనా భవిష్యత్తులో న్యాయపరమైన సమస్యలు ఏర్పడితే పోరాటం చేస్తాం అన్నారు. కానీ ఏమీ చేయకుండా తప్పించుకోవడం సరైన పద్ధతి కాదు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి బీసీ డిక్లరేషన్ లో 42 శాతం కు పెంచుతామని చెప్పి బీసీల ఆశ లేపారు. ఇప్పుడు ఏ ప్రతిపాదికన తప్పించుకుంటున్నారని అన్నారు. పైగా కులాల లెక్కలు గందరగోళం సృష్టించి ప్రజల దృష్టిని తప్పుదోవ పట్టిస్తున్నారు. కులాల లెక్కలు పక్కకు పెట్టి 42 శాతం కు పెంచుతూ అసెంబ్లీలో చట్టం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పిటిసి, వార్డు మెంబర్లలో బీసీ రిజర్వేషన్లను 20 శాతం నుంచి 42 శాతం కు పెంచాలని సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం 50శాతం సీలింగ్ అని చెప్పి పెంచకుండా తప్పించుకోవడానికి వీలులేదు. ఇప్పటికి అగ్రకులాలకు 10 శాతం రిజర్వేషన్లు పెట్టి 50 శాతం సీలింగ్ పై పార్లమెంటు రాజ్యాంగ సవరణ చేసింది. అగ్ర కులాలకు రిజర్వేషన్లు పెంచడానికి మూడు రోజులలో లోక్ సభ, రాజ్యసభలో రాజ్యాంగ సవరణ చేసి రాష్ట్రపతి సంతకం చేశారు. కాని 50 శాతం జనాభా గల బీద కులాలకు రాజ్యాంగ సవరణ చేయరా! మన దేశంలో ఇదేమి న్యాయమని ప్రశ్నించారు. అసెంబ్లీలో చట్టం చేసి 42 శాతం పెట్టవచ్చని ఆర్. కృష్ణయ్య అభిప్రాయపడ్డారు. అవసరమైతే అన్ని పార్టీలు సహకరించడానికి సిద్ధంగా ఉన్నాయున్నవి. పార్లమెంట్ రాజ్యాంగ సవరణ చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే గ్రామస్థాయి నుంచి ఉద్యమిస్తామని తెలిపారు. మిమ్మలను సూటిగా ప్రశ్నిస్తున్నాం. తమరు బిసి రిజర్వేషన్లు 42 శాతం కు పెంచుతూ అసెంబ్లీ బిల్లు ఎందుకు పెట్టలేదు. బీసీ రిజర్వేషన్లను పెంచుతామని ఒక 10సార్లు ఎన్నికల ముందు ప్రకటించారు. అంతేకాదు కామారెడ్డి లో బీసీ డెకరేషన్ లో చేశారు. పార్లమెంటులో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అనేక సభలలో జనాభా ప్రకారం పెంచుతామని ప్రకటించారు. పెంచడానికి ప్రభుత్వం అభ్యంతరం ఏముంది. న్యాయ చట్టపరమైన అవరోధాలు ఏమీ లేవు. పెంచడానికి జనాభా లెక్కలు ఉన్నాయి. జనాభా లెక్కలలో కొంత వివాదాస్పదము ఉన్న 46 శాతం యని, 50 శాతం యని, పక్కకు పెట్టి 42 శాతం పెంచడానికి అభ్యంతరం ఏముంది. జనాభా లెక్కలు పెంచే తర్వాత చూసుకుందాం. మొదటి రిజర్వేషన్లు పెంచాలి.

# పోటీ చేయాలా, వద్దా అనేది త్వరలో చెబుతాం

- తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ కార్పొరేటర్ల సమావేశం
- జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికలపై నిర్ణయం
- రీసర్వే చేస్తే కేసీఆర్, కేటీఆర్ కూడా పాల్గొంటారు
- మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



తెలంగాణ బ్యూరో(ప్రతినిధిః జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికలపై ఈ నెల 17 లోపు నిర్ణయం తీసుకుంటామని మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. త్వరలో మాజీ సీఎం కేసీఆర్తో బీఆర్ఎస్ కార్పొరేటర్ల సమావేశం అవుతారని చెప్పారు. బీసీ మూమెంట్ చాలా ఎక్కువగా ఉందని, ప్రభుత్వం చెప్పిన లెక్కల ప్రకారం బీసీ జనాభా చాలా తక్కువగా ఉందన్నారు. రీసర్వే చేస్తే కేసీఆర్, కేటీఆర్ కూడా పాల్గొంటారని తలసాని చెప్పుకొచ్చారు. ఈనెల 25న జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల నేపథ్యంలో మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో ఈరోజు ఉదయం తెలంగాణ భవన్లో బీఆర్ఎస్ కార్పొరేటర్ల సమావేశం జరిగింది. బీఆర్ఎస్ కార్పొరేటర్ల సమావేశం ముగిసిన అనంతరం తలసాని శ్రీనివాస్ యాదవ్ మీడియాతో మాట్లాడారు. స్టాండింగ్ కమిటీ ఎన్నికలపై ఈ నెల 17 లోపు నిర్ణయం తీసుకుంటాం. పోటీ చేయాలా, వద్దా అప్పుడు చెబుతాం. త్వరలో మాజీ సీఎం కేసీఆర్తో కార్పొరేటర్లు సమావేశం అవుతారు. రాష్ట్రంలో బీసీ మూమెంట్ చాలా ఎక్కువగా ఉంది. ప్రభుత్వం చెప్పిన లెక్కల ప్రకారం బీసీ జనాభా చాలా తక్కువగా ఉంది. ఒరిజినల్ బీసీలు 57 శాతం కంటే ఎక్కువగా ఉన్నారు. కానీ ప్రభుత్వం బీసీ జనాభాను తగ్గించి చూపించింది. జనాభా తక్కువ చూపించడం ద్వారా బడ్జెట్ కేటాయింపులు కూడా తక్కువగా వచ్చే అవకాశం ఉంది. బీసీలకు సీట్లు కూడా తక్కువగా వస్తాయి. రీసర్వే చేస్తే కేసీఆర్, కేటీఆర్ కూడా పాల్గొంటారు అని తలసాని తెలిపారు.

# కృష్ణా నదిని కబళిస్తున్న ధన దాహం..

- పద్మావతి ఘాట్ లో వ్యాపార కార్యకలాపాలు
- నదిలో వంద మీటర్ల లోపే కట్టడాలు
- నదిలోపలికి వ్యర్థ పదార్థాలు
- నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనలకు పూర్తి విరుద్ధం
- కార్పొరేషన్ లీజు ద్వారా రూ 70 కోట్ల దోపిడీ
- పోరాటానికి సిద్ధమైన జేబీపీ
- నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ముందుకు కేసు
- ఎవరా కాంట్రాక్టర్ ఏ మా కథ..!







గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో : కృష్ణా నదీ పరివాహక ప్రాంతాన్ని పాలకులే చెరబడుతున్నారు . కంచె చేను మేసినట్లు పరమ పవిత్రమైన పద్మావతి నది ఘాట్ ను కమర్షియల్ కార్యకలాపాలకు వేదిక గా మార్చారు. రాష్ట్ర ప్రభుత్వంలోని పెద్దలు, విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ ఉన్నతాధికారుల అండతో ప్రకాశం బ్యారేజ్ కి తూర్పు అభిముఖంగా ఉండే పద్మావతి ఘాట్ ను కొందరు యదేశ్చగా వ్యాపార కార్యకలాపాలకు వినియోగిస్తున్నారు. కోట్లాది రూపాయలు దండుకుంటున్నారు. పుష్కరాల సమయంలోనూ, ప్రతి ఏటా భవానీ మాలల సమయంలోనూ పవిత్ర స్నానాలను ఆచరించే పద్మావతి ఘాట్ ను హోటల్ వ్యాపార కార్యకలాపాలతోను, హోటల్ వ్యర్థాలను కృష్ణా నది లోకి వదులుతూ నదిని అపవిత్రం చేస్తున్నారు. ఏడు సంవత్సరాల నుంచి యదేశ్చగా సాగుతున్న ఈ కార్యకలాపాలను కూటమి ప్రభుత్వం మరో ఐదేళ్ల పాటు పొడిగించేందుకు ప్రయత్నం చేయడం ఇప్పుడు వివాదాస్పదంగా మారుతోంది.

నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్, సుప్రీం కోర్టు ఆదేశాలకు విరుద్ధంగా కృష్ణా నదీ పరివాహక ప్రాంతాన్ని వ్యాపార కార్యకలాపాలకు వినియోగించడం పై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తోంది. పబ్లిక్ ప్లేస్, పరమ పవిత్ర కృష్ణా నదీ పరివాహక ప్రాంతాన్ని ఆర్థిక కార్యకలాపాలకు వినియోగించడంపై కొన్ని సంఘాలు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ను ఆశ్రయించబోతున్నాయి.

కృష్ణానది పద్మావతి ఘాట్లో కట్టడాలు :..

విజయవాడ నడిబొడ్డున పండిట్ జవహర్ లాల్ బస్ స్టేషన్ కు ఎదురుగా కృష్ణా నదీ ఒడ్డున వివిధ రకాల హోటళ్లు , కన్వెన్షన్ సెంటర్, ఎంటర్టైన్మెంట్ కార్యకలాపాల పేరుతో పూర్తిగా కమర్షియల్ యాక్టీవిటీ నడుస్తోంది. ఇది పూర్తిగా పద్మావతి ఘాట్ లో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ హోటళ్లు అర్ధరాత్రి, అపరాత్రి అని లేకుండా కొనసాగుతూనే ఉన్నాయి. ఈ హోటళ్లలో వ్యర్థాలన్నింటిని కృష్ణా నదీ లో వదులుతున్న పరిస్థితి. దీంతో నదిలో నీళ్లు కూడా కలుషితం అవుతున్నాయి. ఒకటీ అరా హోటళ్లు కాదు... చిన్న పెద్దవి కలిపి వంద వరకూ ఉన్నాయి. ఇవన్నీ రాష్ట్రప్రభుత్వం, మునిసిపల్ కార్పొరేషన్ ద్వారా ఒక కాంట్రాక్టర్ లీజుకు తీసుకుని ఇతర వ్యాపారులకు అద్దెలకు ఇచ్చి ఉన్నారు. కృష్ణానది పరివాహక ప్రాంతమైన పద్మావతి గాడ్ లో పర్మినెంట్ కట్టడాలు చేపట్టారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనలకు ఈ కట్టడాల నిర్మాణం పూర్తి విరుద్ధంగా ఉంది

ఎవరీ కాంట్రాక్టర్..... ఏమా కథ:....

తెలంగాణాలో ఒక ప్రముఖ రాజకీయ నాయకుడి అల్లుడు ఏపీ లో ఉన్న రాజకీయ నాయకులతో ఉన్న పరిచయాలను అడ్డం పెట్టుకొని చక్రం తిప్పారు. 2018 అక్టోబర్ 25 వ తేదిన విజయవాడ కార్పొరేషన్ లో తెలంగాణ కాంట్రాక్టర్ ఒప్పందం చేసుకున్నారు. జాన్ ఎంటర్టైన్మెంట్ ప్రై లిమిటెడ్ పేరుతో ఈ ఒప్పందం చేసుకున్నారు. అందుకు గాను మునిసిపల్ కార్పొరేషన్ కు సంవత్సరానికి రూ 25 లక్షలు చెల్లించే విధంగా ఒప్పందం చేసుకున్నారు. పది షావుల్లో మాత్రమే అద్దెకు ఇవ్వాలి. కానీ, చిన్నవి పెద్దవి కలిపి వంద షాపులకు అద్దెకు ఇచ్చారు ఆ కాంట్రాక్టర్. ఒక్కో హోటల్, షాపు నిమిత్తం సగటున నెలకు రూ 50 వేలు వసూలు చేస్తున్నారు. అంటే వంద షాపులకు నెలకు రూ 50 లక్షలు... సంవత్సరానికి ఆరు కోట్ల రూపాయలు దండుకుంటున్నారు. లీజు పేరుతో విజయవాడ కార్పొరేషన్ కు ఆ కాంట్రాక్టర్ చెల్లిస్తోంది మాత్రం సంవత్సరానికి రూ .25 లక్షలు. దీన్నిబట్టి అర్థం చేసుకోవచ్చు దోపిడీ ఏ స్థాయిలో ఉంది అనది. కాంట్రాక్టర్ అక్రమంగా సంపాదించిన సొమ్మునుంచి ప్రభుత్వంలోని పెద్దలు, మునిసిపల్ అధికారులకు కొద్దొగొప్పో ముట్ట చెప్పడంతో ఎవరూ నోరు మెదపలేదు.

ఏడేళ్లలో రూ 70 కోట్లు:...

2018 అక్టోబర్ 5 వ తేదిన విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ లో ఈ కాంట్రాక్టర్ ఐదేళ్లపాటు ఒప్పందం చేసుకున్నాడు. ఆ తర్వాత మరో రెండేళ్లు పొడిగించుకున్నాడు. తెలుగుదేశం, బీజేపీ ప్రభుత్వం హయాంలో ప్రారంభమైన ఈ దోపిడీ వైసీపీ ప్రభుత్వ హయాంలో కూడా కొనసాగింది. వైసీపీ కి చెందిన ఒక మంత్రికి కాంట్రాక్టర్ ముడుపులు ముట్ట చెప్పడంతో అదే కాంట్రాక్టును కొనసాగించారు. అద్దెల ద్వారా ఏడాదికి ఆరు కోట్లు చొప్పున ఏడేళ్లలో రూ 42 కోట్లు దండుకున్నారు. ఈ లీజును అడ్డం పెట్టుకుని బస్ స్టేషన్ పక్కన ఉన్న రాజీవ్ గాంధీ పార్కు లోనూ ఇదే కాంట్రాక్టర్ తిష్ట వేసాడు. మునిసిపల్ అధికారుల సహకారంతో రాజీవ్ గాంధీ పార్కులోనూ ఎంటర్టైన్మెంట్, పిల్లల ఆటలకు సంబంధించిన కార్యకలాపాలను ఇదే కాంట్రాక్టర్ నిర్వహిస్తున్నాడు. ఈ పార్కులో నిర్వహిస్తున్న కార్యకలాపాల ద్వారా ఏడాదికి సుమారుగా మరో నాలుగు కోట్ల రూపాయలు దండుకుంటున్నారని అంచనాగా ఉంది. ఏడేళ్లనుంచి ఏడాదికి నాలుగు కోట్ల రూపాయల చొప్పున రూ 28 కోట్లు వెనకేసుకున్నారు. మొత్తంగా రెండుచోట్ల కలిపి ఏడేళ్లలో రూ 70 కోట్లు దండుకున్నారు.

అసలు కార్పొరేషన్ ఎలా లీజు కిచ్చింది..?

ఇ -3 పేరుతో జాన్ ఎంటర్టైన్మెంట్ నిర్వహిస్తున్న వ్యాపార, హోటల్ కార్యకలాపాలన్నీ పద్మావతి ఘాట్ లో నడుస్తున్నాయి. పద్మావతి ఘాట్ లో ఈ వ్యాపార కార్యకలాపాలు నిర్వహించుకునేందుకు అనుమతిస్తూ విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్, జె ఏ ఏ ఎన్ అనే సంస్థ మధ్య ఒప్పందం కుదిరింది. పద్మావతి ఘాట్ పూర్తిగా కృష్ణా నదీ పరివాహక ప్రాంతం. రాష్ట్ర నీటి పారుదల శాఖ పరిధిలోనికి వస్తుంది. దీన్ని లీజుకు ఇచ్చే అధికారం కార్పొరేషన్ కు ఎక్కడుంది అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనల ప్రకారం వంద మీటర్ల కన్నా తక్కువ లో నదీ ప్రవాహం ఉన్నచోట వ్యాపార కార్యకలాపాలకు ఎలా అనుమతిచ్చారు? ఈ హోటళ్లలో వ్యర్థాలన్నింటిని కృష్ణా నదీ లోకి వదలడం వల్ల స్వచ్ఛమైన నదీ కలుషితం అవుతుంది కదా? నదీ పరివాహక ప్రాంతాన్ని పబ్లిక్ ప్లేస్ కింద నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ స్పష్టంగా తన నిబంధనల్లో పేర్కొన్నది. అలాంటి పబ్లిక్ ప్లేస్ ను ఎలా వ్యాపార కార్యకలాపాలకు ఇచ్చారు? ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానాలు కార్పొరేషన్ ఇవ్వాలి. గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనలను తుంగలో తొక్కి మునిసిపల్ శాఖ డబ్బులు దండుకుంటున్న వ్యవహారం ఇప్పుడు వివాదాస్పదంగా మారుతోంది.

నదీ లోనూ కార్యకలాపాలు

హోటళ్ల పేరుతో పద్మావతి ఘాట్ లో వ్యాపార కార్యకలాపాలు నిర్వహించడమే కాకుండా నదిలోకి కూడా యదేశ్చగా దిగుతున్నారు. పద్మావతి ఘాట్ లో ఏర్పాటు చేసిన ఈ హోటళ్ల నుంచి మెట్ల మీదుగా నదీ లోకి దిగకుండా ఎలాంటి బారికేడ్లు ఏర్పాటు చేయలేదు. దీంతో రాత్ర సమయాలలో సైతం కొందరు హోటళ్లకు వచ్చిన వారు నదిలోకి దిగుతున్న పరిస్థితి ఉంది. నదిలోపలికి, ఇసుక తిన్నెల మీదికి దిగే వారికి ఇబ్బంది లేకుండా లైట్లు కూడా ఏర్పాటు చేశారు. కొందరు యువతీ, యువకులు రాత్ర సమయాలలో ఇసుక తిన్నెల వైపునకు వెళ్లడం ప్రమాదకరంగా కూడా మారుతోంది. మహిళలు, యువతుల భద్రతకు ముప్పు వాటిల్లితే ఎవరూ బాధ్యత వహిస్తారు?

నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ కు ఫిర్యాదు :...

కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యాపార కార్యకలాపాలు నిర్వహించడంపై జై బీమ్ రావు భారత పార్టీ న్యాయపోరాటానికి దిగుతోంది. సమాచార హక్కు చట్టం ద్వారా కొంత సమాచారం సేకరించామని, పద్మావతి ఘాట్ లో కమర్షియల్ యాక్టీవిటీ పూర్తిగా నిబంధనలకు విరుద్ధమని ఆ పార్టీ నాయకులు చెప్పుతున్నారు. పూర్తి ఆధారాలతో చెన్నైలోని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ బెంచ్ లో ఫిర్యాదు చేయబోతున్నామని జేబీపీ రాష్ట్ర నాయకులు పరసా సురేష్ మీడియా కు వెల్లడించారు. ఇ -3 హోటళ్ల కార్యకలాపాల నిమిత్తం (జె ఏ ఏ ఎన్ ) సంస్థకు లీజును కొనసాగించవద్దని, ప్రస్తుత లీజును కూడా రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు విజయవాడ మునిసిపల్ కమీషనర్ కు విజ్ఞాపన పత్రం అందించామని తెలిపారు పద్మావతి ఘాట్ లో కమర్షియల్ యాక్టీవిటీకి లీజును కొనసాగిస్తే ప్రజాందోళనలకు దిగుతామని హెచ్చరించారు. కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలో ఇతర చోట్ల కూడా అక్రమ కట్టడాలకు వ్యతిరేకంగా కూడా తమ పార్టీ ఉద్యమ కార్యాచరణకు సిద్ధమౌతుందని ప్రకటించారు.

# ఫామ్‌హౌస్‌లో క్యాసినో గుట్టు రట్టు

- 64 మంది, 55 లగ్జరీ కార్లు స్వాధీనం
- క్యాసినోలో పాల్గొన్న ప్రముఖులు ఎవరు?

తెలంగాణ బ్యూరో(ప్రతినిధిః హైదరాబాద్ నగర శివారు మొయినాబాద్లోని ఓ ఫామ్హౌస్లో కోడిపందేలు, క్యాసినో నిర్వహణ గుట్టు రట్టయింది. క్యాసినో, కోడి పందాలు ఆడుతున్న వారిని రాజేంద్రనగర్ పోలీసులు పట్టుకున్నారు. కోళ్ల పందాలతో పాటు క్యాసినో నిర్వహిస్తున్న ముఠాను అదుపులోకి తీసుకున్నారు. ఫామ్హౌస్పై దాడిలో మొత్తంగా 64 మందిని అదుపులోకి తీసుకోగా.. ఇందులో ఆర్గనైజర్లు భూపతి రాజు, శివకుమార్ కూడా ఉన్నారు. హైదరాబాద్ నగరానికి చెందిన పలువురు ప్రముఖులు క్యాసినో, కోడి పందాలు నిర్వహిస్తున్నట్లు పోలీసులు ప్రాథమికంగా తేల్చారు. మొయినాబాద్ తోల్కట్టలోని ఫామ్హౌస్పై దాడిలో 30 లక్షల రూపాయల నగదు, 55 లగ్జరీ కార్లు, 86 పందెం కోళ్లు, బెట్టింగ్ కాయిన్స్, పేకాట కార్డ్స్, పందెం కోళ్ల కోసం వాడే 46 కోడి కత్తులను ఎస్ఓటీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ వారందరికీ పోలీసులు నోటీసులు ఇచ్చి పంపించేశారు. యూపీఐ ట్రాన్సక్షన్ల కోసం ఆర్గనైజర్లు స్కానర్లు వినియోగించినట్లు పోలీసులు తేల్చారు. యూపీఐ ద్వారా భారీగా లావాదేవీలు జరిగినట్టు గుర్తించారు. క్యాసినో, కోడిపందేల కోసం ప్రత్యేకంగా టెంట్లు ఏర్పాటు చేశారు. కోడిపందేల్లో విడతల వారీగా 200 మంది దాకా పాల్గొన్నట్టు సమాచారం. కోడిపందేలు, క్యాసినోలో పాల్గొన్న ప్రముఖులు ఎవరు?, ఎంత కాలంగా క్యాసినోజరుగుతుంది అనే విషయాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# మీసేవ కేంద్రాల వద్ద భారీగా రద్దీ

- కొత్త రేషన్ కార్డుల కోసం బారులు తీరిన ప్రజలు



తెలంగాణ బ్యూరో(ప్రతినిధిః నగరంలోని మీసేవ కేంద్రాల్లో భారీగా రద్దీ నెలకొంది. కొత్త రేషన్ కార్డుల కోసం ప్రజలు బారులు తీరారు. బుధవారం ఉదయం నుంచే పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్నారు. రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులు, ఆధార్ అప్డేట్ కోసమూ తరలి వస్తున్నారు. జనం భారీగా వస్తుండటంతో మీసేవ కేంద్రాలు కిక్కిరిసిపోతున్నాయి. గంటల కొద్దీ పడిగాపులు కాస్తున్నామని.. ప్రభుత్వం చెప్పిన రుసుం కంటే ఎక్కువగా వసూలు చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. రద్దీ పెరగడంతో సర్వర్లు మొరాయిస్తున్నాయని మీసేవ నిర్వాహకులు చెబుతున్నారు. మరోవైపు రేషన్కార్డుల దరఖాస్తుల్లో గందరగోళం నెలకొంది. మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తుకు సంబంధించిన రసీదును పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో ఇవ్వాలని నిర్వాహకులు సూచిస్తున్నారు. దీంతో ప్రజలు అక్కడికి వెళ్తున్నారు. భారీగా తరలి రావడంతో ఇటు మీసేవ కేంద్రాలు, అటు పౌరసరఫరాల కార్యాలయం వద్ద రద్దీ నెలకొంది. రెండు చోట్లా గంటల కొద్దీ వేచి ఉండాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మీసేవలో దరఖాస్తు చేశాక మళ్లీ రసీదు ఎందుకు ఇవ్వాలని మండిపడుతున్నారు.

రేషన్కార్డులకు దరఖాస్తు నిరంతర ప్రక్రియ: పౌరసరఫరాల శాఖ

కొత్త రేషన్ కార్డుల కోసం మీసేవ కేంద్రాలకు భారీగా ప్రజలు తరలివస్తుండటంతో మరోసారి పౌరసరఫరాల శాఖ స్పందించింది. రేషన్ కార్డుల దరఖాస్తులపై క్లారిటీ ఇచ్చింది. రేషన్ కార్డుల దరఖాస్తుల స్వీకరణ నిరంతర ప్రక్రియ. దరఖాస్తుల సమర్పణకు ఎలాంటి గడువు లేదు. దరఖాస్తుదారులు తొందరపడాల్సిన అవసరం లేదు. ప్రజావాణిలో దరఖాస్తు చేసిన వారు మళ్లీ చేయొద్దు. కులగణన, ప్రజాపాలనలో దరఖాస్తు చేస్తే మళ్లీ అవసరం లేదు. మీ సేవలో ఇచ్చిన రసీదు దాచిపెట్టుకోవాలి. దాన్ని ఎక్కడా ఇవ్వాల్సిన అవసరం లేదు అని స్పష్టం చేసింది.




# ‘లక్ష’ణంగా ‘లక్ష’ దాటేస్తున్న

# బంగారం


## సామాన్యుల స్వర్ణ కలలు అందనంత ప్రియం

## పెరుగుతున్న పసిడి ధరలు దేశానికి ముప్పా?

**కొంగు బంగారం అంటుంటారు సాధారణంగా.. కాసో, అరకాసో.. కొంగుకు కట్టుకుని వెళ్లి తాకట్టు పెట్టుకుని ఇంటి అవసరాలు తీర్చుకునేది ఇల్లాలు. చేతిలో డబ్బులు మళ్లీ గలగలమన్నప్పుడు తిరిగి కొనుక్కునేది. బంగారం అంటే భారతీయ మహిళలకు పిచ్చి, మోజు అనుకుంటారు కొందరు విదేశీయులు. కాదు.. మరొకరి ముందు చేయి చాచి అడగాల్సిన పనిలేకుండా.. ఇంట్లో ఉండే బంగారాన్నే కొంగుకు ముడేసి.. దర్జాగా డబ్బు తెచ్చుకుని, పరిస్థితులు సర్దుకోగానే తిరిగి విడిపించుకునేది. ఇదో ఆర్థిక సూత్రం. అదే కొంగు బంగారం. బిజినెస్ మేనేజ్‌మెంట్ కోర్సులు చేయకుండానే అతివలు నేర్చుకున్న జ్ఞానం. అంతేగానీ.. పిచ్చీ కాదు మోజూ కాదు.**

బంగారం అనేది భారతీయ అతివలకు ఓ భావోద్వేగ బంధం. మనదేశ సంస్కృతిలో ఓ చిహ్నం. బంగారం.. ఓ స్టేటస్ సింబల్ కూడా. కానీ ఇదంతా.. బంగారం ధర ఓ స్థాయిలో ఉన్నప్పుడు మాత్రమే. సామాన్యుడికి సైతం ధర అందుబాటులో ఉన్నప్పుడు.. బంగారంతో ఓ ఆటాడుకున్నాడు. కానీ ఇప్పుడు..! బంగారమే ఆటాడుకుంటోంది. ఒకవిధంగా పద్ధతులను, ఆచార వ్యవహారాలను కూడా మార్చే స్థాయికి ఎదిగిందీ పసిడి.

ఆర్థిక శాస్త్రంలో ‘లా ఆఫ్ డిమాండ్’ సూత్రానికి విరుద్ధంగా ఉండే ఒకే ఒక్క వస్తువు బంగారం. ఒక కేజీ టమాటోనో లేక కేజీ ఉల్లిపాయ ధరలో పెరిగిపోతే బెంబేలెత్తిపోయి వాటి వాడకం తగ్గించే సామాన్యుడు సైతం వెనుకాడకుండా పెళ్ళిళ్ళకు, చేతిలో చిన్న మొత్తం ఉన్నా ఒక గ్రాము బంగారం అయినా కొనాలనుకుంటాడు. అనాది నుండే బంగారానికి సాంస్కృతిక,సామాజిక విలువ ఉంది. ఒక్కో వర్గం వారు ఒక్కోలా దీన్ని చూస్తారు. పేద,మధ్యతరగతి ఇళ్ళల్లో చూస్తే అప్పటికప్పుడు ప్రాణం మీదకు వచ్చే ఏ అవసరం వచ్చినా బంగారం ఆదుకుంటుందన్న నమ్మకం ఓ వైపుబీ ఇంకో వైపు ఏమైనా సరే బంగారం మీద పెట్టుబడి పెట్టడం ఒక భద్రత ఇస్తుందన్న ఆలోచన ఇంకోవైపుబీ మొత్తం మీద ఈ పేద మధ్యతరగతి ప్రజలకు బంగారంతో ఒక రకమైన అనుబంధమే ఉందని అనుకోవచ్చు. ఇకపోతే ధనిక వర్గాల్లో బంగారం హోదాకు చిహ్నం, పెళ్ళిళ్ళలో ,వేడుకల్లో ఎక్కువ మొత్తం బంగారం పెట్టుకోవడం ఒక విలువను ఇచ్చే సంస్కృతి ఉంది. ప్లాటినం,పెలాడియం లాంటి లోహాలు బంగారం కన్నా విలువైనవి అయినప్పటికీ కూడా బంగారానికి ఉన్న ధగధగలు,మెరుపు మాత్రం వాటికి రాలేదు.



## నేడు రూ 86000 పైమాటే

చరిత్ర చూస్తే బంగారం ధర పెరుగుతోందే తప్ప తగ్గిందైతే లేదు. ఏదో ఒకట్రెండు రోజులు తగ్గినట్టు కనిపించినా ఇయర్ ఆన్ ఇయర్ చూస్తే.. అంటే ఏటికేడాది చూస్తే మాత్రం బంగారం ధర పెరుగుతూనే ఉంది. 1925లో పది గ్రాముల బంగారం 18 రూపాయల 75 పైసలు ఉంది. దేశ స్వాతంత్రం నాటికి 88 రూపాయలకు చేరింది. 1959లో మొదటిసారి వంద రూపాయలు దాటింది. 1980లో ఫస్ట్‌టైమ్ పది గ్రాముల బంగారం వెయ్యి రూపాయలను టచ్ చేసింది. 2007 దాకా 10వేల రూపాయలే ఉండేది. కాని, 2011 నుంచి తడాఖా చూపించింది. చూస్తుండగానే 30వేలు టచ్ చేసింది. అందుకునే లోపు 40వేలు దాటింది. 2022లో 52వేలు పలికింది. ఈ రెండేళ్ల గ్యాప్‌లోనే ఏకంగా 30వేలు పెరిగి 80వేల మార్క్‌ను టచ్ చేసింది. 2000 సంవత్సరంలో బంగారం ధర 10 గ్రాములు 4,400 ఉంటే నేడు అది 86000 మించిపోయింది.అంటే వందల రెట్లు పెరిగిపోయింది.దీనికి ప్రధాన కారణం పరిస్థితులతో సంబంధం లేకుండా బంగారానికి డిమాండ్ పెరుగుతూ ఉండటమే. సో, ఏ రకంగా చూసినా.. బంగారం పరుగులు ఆగవుగాక ఆగవు..!



### ‘బంగారంపై వ్యామోహాన్ని భారతీయులు వదిలించుకోవాలి

ఈ నేపథ్యంలో ఒక దశాబ్దం కింద రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిప్యుటీ గవర్నర్ కె.సి.చక్రవర్తి మాట్లాడుతూ, ‘బంగారంపై వ్యామోహాన్ని భారతీయులు వదిలించుకోవాలి. సామాజిక,సాంస్కృతిక హోదా పేరుతో బంగారం కొనడం మానుకోవాలి. బంగారం కొనే విషయంలో ఇంకా ఒకనాటి మూఢ విశ్వాసాలనే అనుసరిస్తున్నారు. వారు మార్పు తేవాల్సిన అవసరం ఉంది. దేశంలో తొంభై శాతం బంగారం వినియోగం ఆభరణాలు, భక్తి పేరుతో జరుగుతున్నవే. వీటిని తక్షణమే ఆపాలి. భక్తులు దేవుడికి కానుకలుగా సమర్పించుకోవాలంటే 22 క్యారెట్ల బదులు రెండు క్యారెట్ల ఆభరణాలు వినియోగించుకోవచ్చు కదా?ఏదైనా ఆభరణం ...ఆభరణమే కదా? పెళ్ళిళ్ళ సమయంలో కట్నంగా ఇచ్చే బంగారాన్ని కూడా తగ్గించుకోవాలి. ఒకప్పుడు భారతదేశం ప్రపంచంలోనే సాంఘికంగా,ఆర్థికంగా ఉన్నతమైన స్థానంలో ఉండేది. కాబట్టి ఆ కాలంలో బంగారు ఆభరణాలు ధరించడం, కానుకలు సమర్పించడం చెల్లింది. అప్పట్లో ప్రపంచ జీడిపిలో మన వాటా 30 శాతం ఉండేది.కానీ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఇప్పుడు మన దేశం పేద దేశం కావడంతో మన అలవాట్లు,అభిరుచులు మార్చుకోవాల్సిన అవసరం ఉంది. వాస్తవానికి సహజసిద్ధంగా బంగారానికి ఎటువంటి విలువ లేదు. కేవలం స్పెక్యులేషన్ తోనే ధరలను పెంచుతున్నారు. అవి ఒక్కసారి ఆగిపోతే ,బంగారం ధరలు పతనమవుతాయి.కరెంట్ అకౌంట్ లోటు భారీగా పెరిగిపోవడానికి ముడి చమురు, బంగారం దిగుమతుల ధరలే కారణాలు.’ఈ వ్యాఖ్యలు వివాదాస్పదంగా కూడా మారాయి.

### ఫ్యాషన్లు మారుతున్నా తగ్గని బంగారం ధరలు

ఇంకో కోణంలో గమనిస్తే ఎక్కువమంది ధనిక వర్గాల వారు,ఎగువ మధ్యతరగతి వారు ఇప్పుడు బంగారంపైన ఎక్కువ ఆసక్తి చూపడం లేదు. దానికి బదులు ప్రత్యామ్నాయాలు వారికి ఉన్నాయి. ఇదివరకటిలా ఒంటి నిండా బంగారం లేదా చిన్న గొలుసు నుండి ఎదో ఒక బంగారు ఆభరణం ఒంటి మీద వేసుకునే సంస్కృతి ఇప్పటి ట్రెండ్ లో లేదు. వీలైనంత సింపుల్ గా ఉండే ధోరణి ఇప్పుడు ఫ్యాషన్ గా మారిపోయింది. అయినప్పటికీ కూడా బంగారం డిమాండ్ తగ్గలేదు. ఒక నివేదిక ఇచ్చిన వివరాల ప్రకారం బాటం ఆఫ్ ద పిరమిడ్ లో ఉండే 40 శాతం మందే ఈ బంగారాన్ని ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. అంటే పేద.మధ్యతరగతి వర్గాలలో ఇవి కొనే వారి శాతం గణనీయంగా పెరిగిందన్నది స్పష్టం. మరి.. ఇక ఎప్పటికీ బంగారం ధరలు తగ్గవా? పసిడి పరుగులు ఇలాగే కొనసాగుతాయా? కేంద్రం ఎలాంటి చర్యలూ తీసుకోదా? ఏం చేసినా సరే.. కొద్దికాలం మాత్రమే ధరలో తగ్గుదల ఉంటుంది తప్ప ఎప్పటికీ అవే స్థాయిలో బంగారం ధరలు ఉండిపోవు. ఇది ఫిక్స్..! గతేడాది జులైలో బంగారంపై దిగుమతి సుంకాన్ని తగ్గిస్తూ ఓ సంచలన నిర్ణయం తీసుకుంది కేంద్ర ప్రభుత్వం. ఆ చర్యతో పది గ్రాముల బంగారంపై ఏకంగా 6వేల రూపాయల వరకు ధర తగ్గింది. ఆ సమయంలో చాలామంది మురిసిపోయారు కూడా. కాని, ఆ మరుసటి నెల నుంచే బంగారం ధర మళ్లీ పెరగడం మొదలుపెట్టింది. గతేడాది ఆగస్ట్ నుంచి పెరుగుతూ పెరుగుతూ వెళ్లి అక్టోబర్‌లో ఏకంగా ఆల్‌టైం గరిష్టస్థాయిని తాకింది. ఎప్పుడో ఓసారి బంగారం ధరలు తగ్గడంలాంటి అద్భుతాలు జరిగినా.. మళ్లీ యథావిధిగానే రేట్లు పెరుగుతాయి. అందుకే, గోల్డ్ జర్నీని ఓసారి పరిశీలించి.. దాని చరిత్రను ఓసారి గమనించి.. ఇప్పుడున్న 88వేల రూపాయల ధరే చీప్ అని మనకు మనం సర్దుకుపోవాలి తప్ప చేయగలిగిందేమీ లేదు. తీరా ఏ లక్షో దాటిన తరువాత వెనుతిరిగి చూసుకుని.. 88వేలు ఉన్నప్పుడే కొనుక్కుంటే బాగుండేది అనుకోవడం వృథా ప్రయాసే అవుతుంది..!

### బంగారాన్ని ఒక విలువైన పెట్టుబడిగా భావించడం కూడదు

ఆర్థికవేత్తలు మాత్రం ఇలా బంగారాన్ని ఒక విలువైన పెట్టుబడిగా భావించే ఆలోచనా విధానం వ్యక్తులకు, దేశానికి కూడా మంచిది కాదనే అంటున్నారు.బంగారం మీద అలా డబ్బు పెట్టుబడిగా పెట్టడం ఒక డేడ్ ఇన్వెస్ట్మెంట్ అని,దాని వల్ల డబ్బు చలామణిలో లేకుండా పోతుందని అంటున్నారు. కొంతవరకు బంగారాన్ని ఎప్పటికప్పుడు ఏదో ఒక అవసరానికి వాడుకోవడం మంచిదే కాని, ఊరికే కొని దాన్ని పెట్టుబడిలా ఉంచడం వల్ల అది డెడ్ ఇన్వెస్ట్మెంట్ లా మిగిలిపోతుందనిబీ దాని బదులు ఇతర ఇన్వెస్ట్మెంట్ పద్ధతుల్లో పెడితే మంచిదని సూచిస్తున్నారు. ముఖ్యంగా హౌసింగ్ సెక్టార్ లాంటి వాటిల్లో పెడితే ఎన్నో రంగాల వారికి కూడా ఉపాధి పొందే అవకాశం ఉంటుందని, అలాగే పోస్ట్ ఆఫీసుల్లో వివిధ పథకాల్లో పెట్టడం కూడా మంచిదే అని, కొంత ఆలోచన చేసి మ్యూచువల్ ఫండ్స్ వంటి వాటి మీద కూడా పెట్టొచ్చునిబీ బంగారం ఎప్పుడు ఇలానే తారా స్థాయిలోనే ఉంటుందని చెప్పలేమని బీ బంగారం అధికంగా దిగుమతి చేసుకోవడం వల్ల బంగారం మారక నిల్వలు తరిగిపోతూ ఉంటాయని కూడా సూచించారు.

### దేశ ఆర్థిక వ్యవస్థ క్షీణించే అవకాశం

దీర్ఘ కాలంలో చూస్తే బంగారంతో పాటు వివిధ రకాల పెట్టుబడి మార్గాలు ప్రజలు అనుసరించకపోతే దేశ ఆర్థిక వ్యవస్థ క్షీణించే అవకాశం కూడా ఉందన్నదే ఆర్థికవేత్తల ఆందోళన. కానీ బంగారాన్ని కొంత స్త్రీ ధనం గానూ, మధ్యతరగతి మహిళల భద్రతా ఆయుధంగానూ ఎక్కువ చూసే దృక్పథం ఉన్న మన దేశంలో బంగారం పై మోజు తగ్గడం అంత త్వరగా జరగకపోవచ్చు.అందులోనూ ఏ సంస్థల నియంత్రణ లేని బంగారం ధరలు కేవలం మార్కెట్ లో డిమాండ్ ను అనుసరించే ఉంటాయి.అందుకే బంగారం దదేశ ఆర్థిక వ్యవస్థను నియంత్రించే స్థాయిలో ఉన్నా దీని విలువ జనాల ఆసక్తిని బట్టి పెరుగుతుందే తప్ప తగ్గడం లేదు. కాని ఇది ఇంకా ఎక్కువ కాలం కొనసాగితే మాత్రం కొంత ముప్పే. బంగారానికి సాటి అయిన భద్రత కల్పించే పెట్టుబడులు కూడా తక్కువగా ఉండటం, డబ్బు రూపంలో ఉంటే ఖర్చు అయ్యే అవకాశం ఎక్కువ ఉండటం వల్ల బీ మిగిలిన పెట్టుబడుల గురించి ఉన్న అనుమానాల వల్ల ఎక్కువ శాతం మంది జనాభాకు ఇంకా బంగారమే భద్రతను ఇచ్చే పెట్టుబడిగా ఉంది. మరి ఈ బంగారంపై ఈ మోజు తగ్గి ఎప్పటికైనా ధరలు తగ్గుతాయేమో చూడాలి!

**– తేజస్వి, హైదరాబాద**

## సేఫ్టీ గురించి ఆలోచనలు

భయం పెరిగినప్పుడే సేఫ్టీ గురించి ఆలోచిస్తారు. మనిషి నైజం అది. స్టాక్‌మార్కెట్లో భయం పెరిగినప్పుడల్లా.. ఇన్వెస్టర్లందరూ సేఫ్టీ ఉండే ఇన్వెస్ట్‌మెంట్స్ వైపు మొగ్గుచూపుతారు. ఇంతకీ సేఫ్టీ ఇన్వెస్ట్‌మెంట్ అంటే ఏంటి? ఇంకేంటి.. డెఫినెట్‌గా బంగారమే..! సో, షేర్ల హెచ్చుతగ్గులు, ఆ పతనం తట్టుకోలేని వాళ్లంతా బంగారంపై పెట్టుబడులు మళ్లిస్తారు. ప్రస్తుతం స్టాక్‌మార్కెట్లో మహిళలు కూడా గొప్పగా రాణిస్తున్నారు. ట్రేడింగ్‌పై పూర్తి పట్టు సాధిస్తున్నారు. అలా ఇన్వెస్ట్‌మెంట్స్ చేస్తున్న మహిళలు.. షేర్ల బదులు బంగారం కొంటున్నారు. ఫోన్‌పే, గూగుల్‌పే లాంటి వాటిల్లో గ్రాము బంగారం కొనే వెసులుబాటు కూడా ఉంది. లేదా.. వెయ్యి, 2వేలకు ఎంత బంగారం వస్తే అంతా కొనొచ్చు. ఆ ఫెసిలిటీ ఉంది. ఇదంతా డిజిటల్ గోల్డ్. సో, ఈరకంగా కూడా బంగారానికి డిమాండ్ పెరుగుతూ వస్తోంది. అంతేకాదు.. భయం కేవలం ఇన్వెస్టర్లకు మాత్రమే ఉండదు. దేశాలకు కూడా ఉంటుంది. ఎప్పుడు యుద్ధం పుట్టుకొస్తుందో తెలియని పరిస్థితులు ఉన్నాయిప్పుడు. సేఫ్టీగా ప్రపంచ దేశాల రిజర్వ్ బ్యాంకులు బంగారాన్ని కొనిపెట్టుకుంటుంటాయి. ఈమధ్య బంగారం ఆర్డర్లు కూడా పెరిగాయి. తెలిసిందేగా.. డిమాండ్ పెరిగితే ఆటోమేటిక్‌గా ధర కూడా పెరుగుతుంది. ఇప్పుడు బంగారం ధర పెరగడానికి కారణం కూడా ఇలా డిమాండ్ పెరగడమే. ఉన్నట్టుండి డిమాండ్ పెరగడానికి కారణం.. భయం. ట్రంప్ చూపిస్తున్న ఆ భయం కారణంగానే ఎల్లోమెటల్ రేట్ పెరిగిపోతోంది.



## ఆస్ట్రేలియాపై శ్రీలంక ఘన విజయం

ఆస్ట్రేలియా జట్టుతో జరిగిన రెండు టెస్టుల సిరీస్‌ను 0-2తో కోల్పోయిన శ్రీలంక జట్టు.. వన్డేల్లో శుభారాంభం చేసింది. రెండు వన్డేల సిరీస్‌లో భాగంగా బుధవారం కొలంబోలో జరిగిన తొలి వన్డేలో శ్రీలంక జట్టు ఆసీస్‌ను 49 పరుగుల తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన శ్రీలంక జట్టు 46 ఓవర్లలో కేవలం 214 పరుగులకే ఆలౌట్ అయ్యింది. శ్రీలంక టాప్ ఆర్డర్ పూర్తిగా చేతులెత్తేయడంతో ఒకానొక దశలో 100 పరుగులైనా దాటుతుందా అనే అనుమానం కలిగింది. అయితే మిడిల్ ఆర్డర్ బ్యాటర్ చరిత్ అసలంక అద్భుతమైన సెంచరీతో చెలరేగాడు. 126 బంతుల్లో 5 సిక్సులు, 14 ఫోర్లతో 127 పరుగులు చేశాడు. మరో బ్యాటర్ దునిత్ వెల్లలగే (30) రాణించాడు. టెయిలెండర్లు కూడా విఫలం చెందడంతో కేవలం 46 ఓవర్లే ఆడి 214 పరుగులు చేసింది. ఆసీస్ బౌలర్లలో సీన్ అబాట్ మూడు వికెట్లు తీయగా..స్పెన్సర్ జాన్సన్, ఆరోన్ హార్డీ, నాథన్ ఎల్లిస్ తలా రెండు వికెట్లు పడగొట్టారు. మాథ్యూ షార్ట్ ఒక వికెట్ తీసాడు. ఇక 215 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన ఆసీస్ జట్టు 33.5 ఓవర్లలో 165 పరుగులు మాత్రమే చేసి ఆలౌట్ అయ్యింది. మార్నల్ లబుషేన్ (41), ఆరోన్ హార్డీ (32) తప్ప ఎవరూ రాణించలేదు. శ్రీలంక బౌలర్ మహీష తీక్షణ 4 వికెట్లు తీసి శ్రీలంక విజయంలో కీలక ప్తార పోషించాడు. చరిత అసలంకకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది.




## ర్యాంకింగ్స్ లో దుమ్ములేపిన గిల్, రోహిత్..
# దిగజారిన కోహ్లీ..!








తాజాగా ఐసీసీ పురుషుల వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్ ని విడుదల చేసింది. ఐసీసీ విడుదల చేసిన వన్డే ర్యాంకింగ్స్ లో పాకిస్తాన్ బ్యాటర్ బాబర్ అజామ్ అగ్రస్థానం నిలబెట్టుకున్నాడు. 786 పాయింట్లతో మొదటి స్థానంలో ఉన్నాడు బాబర్ అజామ్. ఇక ప్రస్తుతం ఇంగ్లాండ్ తో జరుగుతున్న 3 వన్డేల సిరీస్ లో భాగంగా భారత ఆటగాళు ర్యాంకింగ్స్ లో తమ స్థానాలను నిలబెట్టుకున్నారు. ముఖ్యంగా నాలుగవ స్థానంలో ఉన్న శుబ్ మన్ గిల్ రెండు స్థానాలు ఎగబాకి రెండవ స్థానంలో నిలిచాడు. ఐర్లాండ్ ఆటగాడు హ్యారి టెక్టర్, టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ లను దాటి రెండవ స్థానంలో నిలిచాడు. 781 పాయింట్లతో రెండవ స్థానంలో కొనసాగుతున్నాడు గిల్. ఇక రెండవ స్థానంలో కొనసాగుతున్న టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ ఒక మెట్టు దిగి 773 పాయింట్లతో మూడవ స్థానంలో కొనసాగుతున్నాడు. ఇక నాలుగవ స్థానంలో ఐర్లాండ్ ఆటగాడు హ్యారీ టెక్టర్, ఐదవ స్థానంలో సౌత్ ఆఫ్రికా ఆటగాడు క్లాసెన్ నిలిచారు. అలాగే నాలుగవ స్థానంలో ఉన్న విరాట్ కోహ్లీ రెండు స్థానాలు దిగజారి 728 పాయింట్లతో ఆరవ స్తానానికి చేరుకున్నాడు.కాగా 669 పాయింట్లతో శ్రేయస్ అయ్యర్ పదవ స్థానంలో కొనసాగుతున్నాడు. ఇక ప్రస్తుతం ఇంగ్లాండ్ తో జరుగుతున్న వన్డే సిరీస్ లో భాగంగా తొలి రెండు మ్యాచ్ లలో హాఫ్ సెంచరీలతో రాణించిన గిల్.. మూడవ వన్డేలోనూ హాఫ్ సెంచరీ సాధించి మరిన్ని పరుగుల వైపు దూసుకు వెళ్తున్నాడు. అలాగే 50 మ్యాచ్లలోనే 2500 పరుగులు చేసిన తొలి క్రికెటర్ గా రికార్డు సృష్టించాడు. ఇలా అద్భుతంగా రానిస్తూ వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్ లో రెండవ స్థానంలో నిలిచాడు.ఇక రోహిత్ శర్మ ఇంగ్లాండ్ తో జరిగిన రెండవ వన్డేలో 90 బంతులలోనే 119 పరుగులు చేసి ఫామ్ లోకి తిరిగి వచ్చాడు. ఇక రోహిత్ కి వన్డేల్లో ఇది 32వ సెంచరీ. అలాగే అంతర్జాతీయ క్రికెట్ లో 49వ సెంచరీ. ఇక వన్డే టీం ర్యాంకింగ్స్ లో భారత జట్టు 5726 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతుంది. ఇక వన్డే బౌలింగ్ ర్యాంకింగ్స్ లో ఆఫ్ఘనిస్తాన్ బౌలర్ రషీద్ ఖాన్ 669 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ఇందులో మహమ్మద్ సిరాజ్ ఏకంగా నాలుగు స్థానాలు దిగజారి పదవ స్థానానికి చేరుకోగా.. రవీంద్ర జడేజా 11వ స్థానంలో కొనసాగుతున్నాడు. అలాగే ఆల్రౌండర్ల విషయానికి వస్తే మరో అఫ్ఘనిస్తాన్ ప్లేయర్ మొహమ్మద్ నబీ 300 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ఈ ఆల్ రౌండర్ల జాబితాలో రవీంద్ర జడేజా 10వ స్థానంలో ఉన్నాడు.

## పర్యటనలకు ఫ్యామిలీని తీసుకెళ్లడం తప్పు కాదు



### భారత క్రికెట్ దిగ్గజం కపిల్ దేవ్ సూచన

గత ఆస్ట్రేలియా పర్యటనలో భారత్కు ఘోరమైన పరాభవం ఎదురైన సంగతి తెలిసిందే. దీంతో బీసీసీఐ (%దీజజ×%) కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రతి ఆటగాడూ దేశవాళీలో ఆడాలని ఆదేశించింది. పర్యటనలకు వెళ్లినప్పుడు కుటుంబసభ్యులకు పరిమితులు విధిస్తూ నిర్ణయం తీసుకుంది. వాటిపై పలువురు వివిధ రకాలుగా స్పందించారు. తాజాగా భారత క్రికెట్ దిగ్గజం కపిల్దేవ్ తన అభిప్రాయాన్ని వెల్లడించాడు. డొమెస్టిక్ క్రికెట్ విషయంలో బీసీసీఐ కఠినంగా ఉండాలని సూచించాడు. భార్యలను పర్యటనలకు తీసుకెళ్లడం తప్పేమీ కాదని.. కాకపోతే అందుకు పరిమితమైన సమయం ఉండాలని పేర్కొన్నాడు.

"కుటుంబాలతో వెళ్తే ఆట పరంగా ప్రదర్శన సరిగ్గా ఉండటం లేదనే వాదన సరైంది కాదు. క్రికెటర్లు తమ భార్యలను పర్యటనలకు తీసుకెళ్లడం తప్పేమీ కాదు. కానీ, సదరు టూర్ నెల రోజులు ఉందంటే మొదటి 20 రోజుల వరకు కుటుంబసభ్యులకు అవకాశం ఇవ్వొద్దు. ఆ తర్వాత అనుమతిస్తే బాగుంటుంది. అలా చేయడం వల్ల సహచర క్రికెటర్లతో కలిసి విలువైన కాలాన్ని గడిపే అవకాశం వస్తుంది. జట్టుతో కలిసి ప్రయాణించడం వల్ల ఆటపై మంచి ప్రభావం చూపిస్తుంది. క్రికెట్ వ్యక్తిగతమైన క్రీడ కాదు" అని కపిల్ వెల్లడించాడు.

**12 ఏళ్ల తర్వాత రంజీల్లో?** "దేశవాళీ క్రికెట్పై బీసీసీఐ కఠినమైన నిబంధనలు తీసుకురావాలి. మీరు విరాట్ కోహ్లీ మరియు రోహిత్ శర్మ గురించి మాట్లాడుతుంటే.. 12 సంవత్సరాల తర్వాత రంజీ ట్రోఫీ ఆడుతున్నారు. అదెలా సరైనది? అది అస్సలు బాగా అనిపించడం లేదు. ఇటీవల ఫామ్ సరిగా లేకపోవడంతో ఆడారనుకోవడం కూడా సరికాదు. అంతర్జాతీయంగా బాగా రాణించినా.. రాణించకపోయినా దేశవాళీ క్రికెట్ ఆడాల్సిందే. అది కోహ్లీనా లేదా రోహిత్ అనేది అనవసరం. ప్రతిఒక్కరూ ఆడేలా బీసీసీఐ చూడాలి. ఇక్కడ వారి ప్రదర్శన గురించి మాట్లాడటం లేదు. వ్యవస్థను పటిష్ఠంగా అమలుచేయాలని మాత్రమే చెబుతున్నా" అని కపిల్ స్పష్టం చేశాడు.

# మూడో వన్డేలో భారత్ ఘన విజయం

## టీమ్ఇండియా ఆల్రౌండ్ షో- 3-0 తో సిరీస్ క్లీన్ స్వీప్

స్వదేశంలో ఇంగ్లాండ్తో వన్డే సిరీస్ను టీమ్ఇండియా క్లీన్స్వీప్ చేసింది. మూడు వన్డేల్లో భాగంగా బుధవారం జరిగిన ఆఖరి మ్యాచ్లో భారత్ 142 పరుగుల తేడాతో నెగ్గింది. తొలుత బ్యాటింగ్ చేసిన టీమ్ఇండియా 357 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది.

అహ్మదాబాద్: ఇంగ్లాండ్‌తో జరిగిన మూడో వన్డేలో టీమ్ఇండియా 142 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. దీంతో మూడు వన్డేల సిరీస్‌ను భారత్ 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. కీలక బ్యాటర్లంతా రాణించడంతో తొలుత భారత్ సరిగ్గా 50 ఓవర్లలో 356 పరుగులకు ఆలౌటైంది. శుభ్‌మన్ గిల్ (112బీ 102 బంతులలో 14 ఫోర్లు, 3 సిక్స్‌లు) 'శత'క్కొట్టాడు. ఈ భారీ లక్ష్యఛేదనలో ఇంగ్లాండ్‌కు శుభారంభం దక్కినా తర్వాత చతికిలపడింది. ఆ జట్టు 34.2 ఓవర్లలో 214 పరుగులకు ఆలౌటైంది. టామ్ బాంటన్ (38), అట్కిన్సన్ (38బీ 19 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్లు. ఓపెనర్లు ఫిల్ సాల్ట్ (23), బెన్ డకెట్ (34) పరుగులు చేశారు. జో రూట్ (24), హ్యారీ బ్రూక్ (19), బట్లర్ (6), లివింగ్‌స్టన్ (9) కూడా తక్కువ స్కోరుకే వెనుదిరిగారు. చివర్లో అట్కిన్సన్ పోరాటంతో ఇంగ్లాండ్ స్కోరు 200 దాటింది. భారత బౌలర్లలో అర్ష్‌దీప్, హర్షిత్ రాణా, హార్దిక్ పాండ్య, అక్షర్ పటేల్ రెండేసి వికెట్లు పడగొట్టగా.. వాషింగ్టన్ సుందర్, కుల్‌దీప్ యాదవ్‌కు తలో వికెట్ దక్కింది. . తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 356 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ శుభ్మన్ గిల్ (112 పరుగులు) సెంచరీతో అలరించాడు. విరాట్ కోహ్లీ (52 పరుగులు), శ్రేయస్ అయ్యర్ (78 పరుగులు) హాఫ్ సెంచరీలతో రాణించారు. కే ఎల్ రాహుల్ (40 పరుగులు) ఆకట్టుకున్నాడు. ఇంగ్లాండ్ బౌలర్లలో ఆదిల్ రషీద్ 4, మార్క్ వుడ్ 2, జో రూట్, మహ్మూద్, గస్ అట్కిసన్ తలో వికెట్ దక్కించుకున్నారు.

టాస్ ఓడి బ్యాటింగ్కు దిగిన భారత్కు ఆదిలోనే షాక్ తగిలింది. గతమ్యాచ్ సెంచరీ హీరో కెప్టెన్ రోహిత్ శర్మ (1) రెండో ఓవర్లోనే పెవిలియన్ చేరాడు. వుడ్ వేసిన బంతిని డిఫెన్స్ ఆడబోయి, కీపర్కు చిక్కాడు. ఆ తర్వాత విరాట్తో కలిసి గిల్ భాగస్వామ్యం నిర్మించాడు. రన్రేట్ 6కు తగ్గకుండా క్రమంగా పరుగులు సాధించారు. ఈ క్రమంలోనే ఇద్దరూ హాఫ్ సెంచరీలు పూర్తి చేశారు.




**రాణించిన రాహుల్..**

గిల్ వెనుదిరిగాక, ఓ ఎండ్ లో శ్రేయస్ వేగంగా ఆడాడు. అయితే సెంచరీకి చేరువైన అయ్యర్ ను రషీద్ బోల్తా కొట్టించాడు. ఈ దశలో కేఎల్ రాహుల్ (40) తన వాడిని చూపించాడు. కాస్త టీ20 తరహాలో ఆడుతూ వేగంగా పరుగులు చేశాడు. మిడిలార్డర్లోని వాళ్లు తలో ఓ చేయి వేయడంతో భారత్ 350ం పరుగుల మార్కును దాటింది. బౌలర్లలో మార్క్ వుడ్ కు రెండు, గస్ అట్కిన్సన్, జో రూట్, సాకిబ్ మహ్మూద్ లకు తలో వికెట్ దక్కింది.

హాఫ్ సెంచరీ తర్వాత విరాట్ (52) 18.6 ఓవర్ వద్ద ఔటయ్యాడు. రషీద్ క్లీన్ బౌల్డ్ చేశాడు. దీంతో 116 పరుగుల భాగస్వామ్యానికి తెర పడింది. ఆ తర్వాత గిల్తో శ్రేయస్ అయ్యర్ జతకట్టాడు. అయ్యర్ కూడా అర్ధ శతకంతో రాణించాడు. హార్దిక్ పాండ్య (17 పరుగులు, 2 సిక్స్‌లు) దూకుడుగా ఆడినా ఎక్కువసేపు క్రీజులో నిలవలేదు. వాషింగ్టన్ సుందర్ (14), అక్షర్ పటేల్ (13), హర్షిత్ రాణా (13) పరుగులు చేశారు. ఆఖరి బంతికి అర్ష్‌దీప్ సింగ్ (2) రనౌట్తో భారత్ ఆలౌటైంది.

ఈ సిరీస్లో ఇప్పటికే వరుసగా రెండు మ్యాచ్లో నెగ్గిన టీమ్ఇండియా, తాజా విజయంతో 3-0తో దక్కించుకుంది.




# గిల్ ఆల్ టైమ్ రికార్డ్

## ప్రపంచంలోనే తొలి బ్యాటర్ గా! - ఇంగ్లాండ్‌తో మూడో వన్డే- సెంచరీతో చెలరేగిన గిల్- ఖాతాలో పలు రికార్డులు

టీమ్ఇండియా యంగ్ బ్యాటర్ శుభ్మన్ గిల్ ఇంగ్లాండ్తో మూడో వన్డేలో శతకంతో కదం తొక్కాడు. తొలి ఓవర్ నుంచే అద్భుతమైన ఆటతో అలరించిన గిల్ 102 బంతుల్లో 112 పరుగులు చేశాడు. ఇందులో 14 ఫోర్లు, 3 సిక్సు ఉన్నాయి. కాగా, గిల్కు వన్డేల్లో ఇది 7వ సెంచరీ. ఈ క్రమంలో గిల్ పలు అరుదైన ఘనతలు తన ఖాతాలో వేసుకున్నాడు. అవేంటంటే?

భారత్లో తొలి బ్యాటర్గా : గిల్ కెరీర్లో ఇది తనకు 50వ వన్డే మ్యాచ్. భారత్ తరఫున 50వ వన్డేలో సెంచరీ సాధించిన తొలి బ్యాటర్గా రికార్డు సృష్టించాడు.గిల్ కన్నా ముందు ఏ భారత ఆటగాడు కూడా 50వ మ్యాచ్లో శతకం బాదలేదు.వరల్డ్ రికార్డ్ : 50 మ్యాచ్లోనే గిల్ 2500 పరుగుల మార్క్ దాటాడు. ఈ క్రమంలో వన్డేల్లో అత్యధిక వేగంగా ఈ మైలురాయి అందుకున్న ఆటగాడిగా నిలిచాడు. ఇదివరకు ఈ రికార్డ్ సౌతాఫ్రికా బ్యాటర్ హషీమ్ ఆమ్లా (51 మ్యాచ్లో) పేరిట ఉంది. తాజా మ్యాచ్తో గిల్ ఆ రికార్డ్ బద్దలు కొట్టాడు. గిల్ వన్డేల్లో ఇప్పటివరకు 2587 పరుగులు చేశాడు ఒకే వేదికగా : అహ్మదాబాద్ నరేంద్ర మోదీ స్టేడియంలో ఈ మ్యాచ్ జరుగుతుంది. అయితే ఈ స్టేడియంలో గిల్ అన్ని ఫార్మాట్ (టీ20, వన్డే, టెస్టు, ఐపీఎల్)ల్లో సెంచరీ నమోదు చేశాడు. ఈ క్రమంలో ఒకే వేదికపై అన్ని ఫార్మాట్లలో సెంచరీ బాదిన భారత తొలి బ్యాటర్గా రికార్డ్ సృష్టించాడు. అంతర్జాతీయ, ఐపీఎల్ (3) కలిపి గిల్ నరేంద్ర మోదీ స్టేడియంలో 6 శతకాలు నమోదు చేశాడు. ఇక ప్రపంచవ్యాప్తంగా ఒకే స్టేడియంలో అన్ని ఫార్మాట్లలో సెంచరీ సాధించిన ఐదో ఆటగాడిగా నిలిచాడు.






# 'ట్రోఫీ విన్నర్ ను పక్కనపెట్టడం అన్యాయం'

### 'ట్రోఫీ విన్నర్ ను పక్కనపెట్టడం అన్యాయం' - నెట్టింట సిరాజ్ కు ఫ్యాన్స్ ఫుల్ సపోర్ట్! -
### 'హెడ్ కోచ్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నాడు - అందుకే ఆ ఇద్దరిని తీసుకున్నాడు - గంభీర్ పై సిరాజ్ ఫ్యాన్స్ ఫైర్!

టీమ్ ఇండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా తాజాగా ఛాంపియన్స్ ట్రోఫీకి దూరమయ్యాడు. వెన్ను నొప్పి కారణంగా అతడ్ని మేనేజ్మెంట్ తుది జట్టులోకి తీసుకులేదు. అయితే తన స్థానంలో యంగ్ పేసర్ హర్షిత్ రాణా స్క్వాడ్లోకి చేరాడు. ఇక ఓపెనర్ యశస్వి జైస్వాల్‌కు బదులు మరో స్టార్ క్రికెటర్ వరుణ్ చక్రవర్తిని మేనేజ్‌మెంట్ తీసుకుంది. ఈ విషయం సిరాజ్ అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేసింది.

సిరాజ్‌ను మెయిన్ స్క్వాడ్లోకి తీసుకోకుండా నాన్ ట్రావెల్ రిజర్వ్‌గా ఎంపిక చేసింది మేనేజ్మెంట్. ఇలా ఒక సీనియర్ పేసర్‌ను పక్కనపెట్టడం సరైన పద్ధతి కాదంటూ అభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుమ్రా తర్వాత 2022 నుంచి అత్యధిక వికెట్లను తన ఖాతాలో వేసుకున్న సిరాజ్‌ను ఎందుకు తీసుకోలేదని, 2023 జనవరిలో వన్డే టాప్ బౌలర్‌గా నిలిచాడంటూ గుర్తు చేశారు.

"బుమ్రా తుది స్క్వాడ్లో లేడు. షమీ ఇంకా ఫామ్ అందుకోలేదు. యంగ్గా ఉన్న హర్షిత్ రాణాను ఇప్పుడు పరీక్షించడం అంత అవసరమా? సిరాజ్‌కు ఎందుకు ఛాన్స్ ఇవ్వట్లేదు? మ్యాచ్ విన్నరైన సిరాజ్‌కు జట్టులో స్థానం కూడా లేకుండా చేయడమనే విషయం చాలా దారుణం"

"టీమ్ఇండియా హెడ్ కోచ్ ఏకపక్షంగా, స్వార్థంతో నిర్ణయాలు తీసుకుంటున్నట్లుగా ఉంది. తను కేవలం కోల్కతా నైట్రైడర్స్ ప్లేయర్లను మాత్రమే జట్టులోకి ఎంపిక చేస్తాడేమో. అందుకే సిరాజ్‌ను కాదని హర్షిత్‌ను తీసుకోవడం, యశస్వి ప్లేస్లో వరుణ్‌ను ఎంపిక చేయడం చూస్తుంటే అదే నిజమని అనిపిస్తోంది. టీమ్ఇండియా క్రికెట్లో ఇటువంటివి జరగడం ఎంతో బాధాకరం"

"జట్టులో ఐదుగురు స్పిన్నర్లా? మీరు ఈ విషయం గురించి కొంచెమైనా ఆలోచించలేదా? ఒక స్పిన్నర్‌కు బదులుగా సిరాజ్‌ను తీసుకోవాల్సింది. జైస్వాల్‌ను కూడా ఈ సారి పక్కనపెట్టారు. సుందర్ ప్లేస్లో యశస్విని తీసుకుంటే బాగుండేది" అని కామెంట్ చేస్తున్నారు.

సూర్య
విజయవాడ
గురువారం
13 ఫిబ్రవరి 2025



suryachitramagazine@gmail.com

సూర్య సినిమా

# 'తండేల్' సక్సెస్ ఎంతో ఆనందంగా వుంది

యువ సామ్రాట్ అక్కినేని నాగచైతన్య, సాయిపల్లవి మ్యూజికల్ బ్లాక్ బస్టర్ 'తండేల్'. చందూ మొండేటి దర్శకత్వంలో మెగా ప్రొడ్యూసర్ అల్లు అరవింద్ సమర్పణలో గీతాఆర్ట్స్ బ్యానర్‌పై ఫ్యాషనేట్ ప్రొడ్యూసర్ బన్నీవాసు ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. భారీ అంచనాలతో ఫిబ్రవరి 7న ప్రపంచ వ్యాప్తంగా విడుదలై ఈ చిత్రం అన్ని చోట్ల దుల్లగొట్టే రెస్పాన్స్‌తో బ్లాక్ బస్టర్ సక్సెస్‌ని సొంతం చేసుకుంది. ప్రేక్షకులు, అభిమానులు, విమర్శకులు సినిమాపై ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. అన్ని వర్గాల ప్రేక్షకులని అలరించిన



'తండేల్' హౌస్ ఫుల్‌గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా టీం 'తండేల్' లవ్ సునామీ సెలబ్రేషన్స్‌ని గ్రాండ్‌గా నిర్వహించారు. కింగ్ అక్కినేని నాగార్జున ఈ వేడుక ముఖ్య అతిధిగా హాజరయ్యారు. నిర్మాత అశ్వినీదత్ స్పెషల్ గెస్ట్‌గా పాల్గొన్నారు. ఈ వేడుకలో నాగచైతన్య, శోభితా దంపతులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. 'తండేల్' లవ్ సునామీ సెలబ్రేషన్స్‌లో కింగ్ అక్కినేని నాగార్జున మాట్లాడుతూ.. సక్సెస్ మీట్ కి వచ్చి చాలా రోజులౌతుంది. చాలా సంతోషంగా వుంది. అరవింద్ కథ విని చందూ మొండేటితో తీద్దామన్నా వేళావిశేషం, దేవిశ్రీ మ్యూజిక్, బన్నీవాసు టీంని సెట్ చేసిన వేళా విశేషం, నాగచైతన్య శోభితని పెళ్లి చేసుకున్న వేళా విశేషం.. ఇవన్నీ బావున్నాయి. 'తండేల్' సక్సెస్ చూస్తుంటే ఎంతో ఆనందంగా వుంది. ఫెబ్రవరి 7న సినిమా రిలీజ్ అయినప్పుడు ఢిల్లీలో వెళ్లాం. ప్రధానిమోడీని కలిశాం. అప్పుడు నా దగ్గర ఫోన్ లేదు. చైతు ఫోన్ చుద్దామంటే తను త్వరగా బయటికివెళ్ళాడు. బయటకి రాగానే కంగ్రాట్స్ డాడీ అని ఒక ఫోన్ కాల్ వచ్చింది. ఫ్యాన్స్ నుంచి వరుసగా కంగ్రాట్స్ మెసేజ్‌లు వచ్చాయి. అప్పుడు అర్ధమైయింది మా కన్నా మా శ్రేయోభిలాషులు ఎంత ఆనందం పడుతున్నారో అని. అందుకే అన్నాను చాలా రోజులైయింది సక్సెస్ మీట్ కి వచ్చి అని. అరవింద్ కథ విని దాన్ని లవ్ స్టొరీగా చేసి అద్భుతమైన టీంని సెట్ చేసి సినిమాని చేయడం అంత ఈజీ కాదు. కానీ అరవింద్ చేశారు. థాంక్ యూ సో మచ్. ఇండియాలో ఫస్ట్ 100 కోట్ల క్లబ్ ప్రొడ్యూసర్ అరవింద్. గజనీ సినిమాతో ఆ రికార్డ్ అందుకున్నారు. 100 పెర్సెంట్ లవ్, మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్, ఇప్పుడు తండేల్.. మూడు సూపర్ హిట్లు.. ఒకటికి మించి ఒకటి ఇచ్చిన అరవింద్‌కి థాంక్ యూ. బన్నీ వాసు అందరినీ కన్విన్స్ చేసి సినిమాని అద్భుతంగా మలిచి రిలీజ్ చేయడంలో ఆయన సపోర్ట్ చాలా గొప్పది. చందు అంటే నాకు చాలా ఇష్టం. చైతులో నటుడ్ని బయటికి తీసుకొచ్చాడు. ఇందులో లాస్ట్ బిట్ సోల్ అఫ్ ది ఫిల్మ్. అదే కాదు ప్రతిసన్నీవేశం అద్భుతంగా మలిచాడు. వి లవ్ యూ చందు. దేవి నా ఫేవరేట్. బుజ్జితల్లి సాంగ్ అవుట్ స్టాండింగ్ హిట్. మై రాక్ స్టార్. సాయి పల్లవి గురించి ఎంతచెప్పినా తక్కువే. ఆమెలో ఇన్నోసెన్స్ బుజ్జితల్లిలో కనిపించింది. సినిమాలో పని చేసిన అందరికీ కంగ్రాట్స్. చైతు రెండేళ్ళు ఈ క్యారెక్టర్ కోసమే డెడికెటడ్‌గా వున్నాడు. ఇందులో చైతన్యని చూస్తుంటే నాన్నగుర్తుకు వచ్చారు. అక్కినేని అభిమానులకి థాంక్ యూ. 2025లో ఇది ముహూర్తం. వస్తున్నాం కొడుతున్నాం. థాంక్ యూ వెరీ మచ్'అన్నారు.

# 'లైలా' నా కెరీర్‌లో మెమరబుల్ మూవీ



మాస్ కా దాస్ విశ్వక్సేన్ యూనిక్ రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'లైలా' ఎక్సయిటింగ్ ప్రమోషనల్ కంటెంట్‌తో స్ట్రాంగ్ బజ్ క్రియేట్ చేస్తోంది. ఈ చిత్రానికి రామ్ నారాయణ్ దర్శకత్వం వహించారు. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మించారు. ఆకాంక్ష శర్మ హీరోయిన్ గా నటిస్తోంది. పాటలు చార్ట్ బస్టర్ హిట్ అయ్యాయి. లైలా ఫిబ్రవరి 14న బిగ్ స్క్రీన్స్‌లో విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరో విశ్వక్సేన్ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాల్ని పంచుకున్నారు.

**లేడీ గెటప్ చేయాలనే కోరిక మీకు ముందునుంచి ఉండదని విన్నాం?**

ఆర్టిస్ట్‌గా కొన్ని పాత్రలు చేయాలని ప్రతి నటుడికి ఉంటుంది. భామనే సత్యభామనే, మేడం, చిత్రం భళారే విచిత్రం, రెమో సినిమాలు చూసినప్పుడు ఆర్టిస్టుగా ఇలాంటి గెటప్ చేయాలని ఉండేది. అలాగే ఆడియన్స్ ఇప్పుడు కొత్త కథలని, థీమ్స్‌ని కోరుకుంటున్నారు. ఇలాంటి సినిమాలురాక దాదాపుగా రెండు దశాబ్దాలు అవుతుంది. ఈ జనరేషన్ లో ఒక హీరో అమ్మాయి పాత్ర వేయడం గత 20 ఏళ్లుగా మనం చూడలేదు. ఆ లోటుని భర్తీ చేయాలని ఒక మంచి కథ రావడంతో ఈ సినిమా చేయడం జరిగింది.

**సోను మోడల్ లైలా ఈ రెండు క్యారెక్టర్స్‌లో మీకు ఇష్టమైనది ?**

డెఫినెట్‌గా లైలా. కానీ సోను క్యారెక్టర్ కూడా మీరు ఫాన్స్ అయిపోతారు. ట్రైలర్లు పబ్లిసిటీలో లైలా డామినేట్ చేస్తుంది. స్క్రీన్ మీద చూస్తున్నప్పుడు మాత్రం సోను క్యారెక్టర్ ని కూడా చాలా ఇష్టపడతారు. ఫస్ట్ హాఫ్ లో సోను మోడల్ లైఫ్ స్టైల్ ని తన క్యారెక్టర్ ని చాలా ఎంజాయ్ చేస్తారు.

**అసలు సోను లైలాగా మారడానికి కారణమేమిటి ?**

ఒకటి కాదు మొత్తం మూడు ప్రాబ్లమ్స్ వస్తాయి. ఆ మూడు ప్రాబ్లమ్స్ నుంచి బయటపడడానికి లైలా గా మారుతాడు. అది ఏంటనేది మీరు బిగ్ స్క్రీన్ మీద చూడాలి.

**లేడీ గెటప్‌లోకి మారడానికి మీకు ఎంత సమయం పట్టింది?**

దాదాపు రెండున్నర గంటలు పట్టేది. మేకప్ ఆర్టిస్ట్ నిక్కీ ఎక్కడ కూడా కాంప్రమైజ్ కాలేదు. లేడీ గెటప్ విషయంలో ఎక్కడ కూడా కాంప్రమైజ్ అయ్యేలా ఉండదు. చాలా నేచురల్ గా వచ్చింది.

**ట్రైలర్‌లో ఎక్కువ అడల్ట్ కంటెంట్ కనిపిస్తుంది ?**

అడల్ట్ కాదండి. ఇది యూత్ ఫుల్ కంటెంట్. అవుట్ అండ్ అవుట్ ఎంటర్ టైనర్.

# 'తల' బిగ్గెస్ట్ హిట్ అవుతుంది

దీపా ఆర్ట్స్ బ్యానర్ పై శ్రీనివాస్ గౌడ్ నిర్మాణంలో అమ్మ రాజశేఖర్ దర్శకత్వం వహించిన సినిమా'తల'. అమ్మ రాజశేఖర్ తనయుడు అమ్మ రాగిన్ రాజ్ ఈ చిత్రంతో హీరోగా పరిచయం అవుతున్నాడు. అంకిత నస్కర్ హీరోయిన్. రోహిత్, ఎస్తేర్ నోరన్హ,ముక్కు అవినాష్, సత్యం రాజేష్, అజయ్, విజ్జి చంద్రశేఖర్, రాజీవ్ కనకాల, ఇంద్రజ ఇతర కీలక పాత్రల్లో నటించారు. శ్యామ్ కే నాయుడు సినిమాటోగ్రఫీ అందించిన ఈ చిత్రానికి ధర్మతేజ సంగీత దర్శకుడు. ఈ నెల 14న విడుదల కాబోతోన్న తల మూవీ ప్రీ



రిలీజ్ ఈవెంట్ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా వచ్చిన.. దర్శకుడు వివిఎన్ ఆదిత్య మాట్లాడుతూ.. "పాత తరంలో తల తాకట్టుపెట్టైనా పిల్లలను ప్రయోజనకులను చేయాలంటారు. అమ్మ రాజశేఖర్ మాస్టర్ తల పెట్టి కొడుకును మంచి హీరోను చేశాడు. టైటిల్ తల అన్నప్పుడు తమిళ్ లో తల అంటే వేరే అర్థం కదా అంటే కాదు తెలుగులో తల అనే అర్థం అన్నారు. గ్లింప్స్ బావున్నాయి. రాగిన్ రాజ్ బాగా ఆకట్టుకున్నాడు. మంచి ఫ్యూచర్ ఉందని అర్థం అవుతుంది. తెలిసిన ఆర్టిస్ట్ లున్నారు. మ్యూజిక్ డైరెక్టర్ ధర్మతేజ పాటలు ఎక్స్ లెంట్ గా చేశారు. ఈ 14న విడుదల కాబోతోన్న ఈ మూవీ సూపర్ సక్సెస్ కావాలని కోరుకుంటున్నా.." అన్నారు.

# ఫిబ్రవరి 14న 'బ్రహ్మా ఆనందం'తో పుత్రోత్సాహం కలగాలి




మళ్ళీ రావా, ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ, మసూద వంటి హ్యాట్రిక్ హిట్ల తరువాత స్వధర్మ్ ఎంటర్‌టైన్‌మెంట్ నుంచి 'బ్రహ్మా ఆనందం' అనే చిత్రం రాబోతోంది. ఈ చిత్రంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత బ్రహ్మానందం, అతని కుమారుడు రాజా గౌతమ్ ప్రధాన పాత్రలు పోషించారు. ప్రియా వడ్లమాని, ఐశ్వర్య హొలక్కల్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. శ్రీమతి సావిత్రి,శ్రీ ఉమేష్ కుమార్ సమర్పణలో రూపొందించిన ఈ చిత్రాన్ని నూతన దర్శకుడు ఆర్.వి.ఎస్ నిఖిల్ అద్భుతంగా తెరకెక్కించారు. విజయవంతమైన నిర్మాత రాహుల్ యాదవ్ నక్కా ఈ సినిమాను భారీ ఎత్తున నిర్మించారు. ఈ చిత్రం ఫిబ్రవరి 14న రిలీజ్ కాబోతోంది. ఈ క్రమంలో ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథులుగా విచ్చేశారు. నాగ్ అశ్విన్, అనిల్ రావిపూడి వంటి దర్శకులు ఈ కార్యక్రమంలో సందడి చేశారు. ఈవెంట్‌లో.. చిరంజీవి మాట్లాడుతూ.. 'సినిమాను తీయడం ఎంత ముఖ్యం.. మంచి టైంకి రిలీజ్ చేయడం, ప్రమోట్ చేయడం చాలా ముఖ్యం. ఈ మధ్య కాలంలో అనిల్ రావిపూడి సంక్రాంతికి వస్తున్నాం సినిమాను చక్కగా ప్రమోట్ చేశాడు. రాజా రవీంద్ర ఈ బ్రహ్మా ఆనందం సినిమా గురించి చెప్పాడు. హీరోలు దొరకడం లేదు.. ప్రమోషన్స్ కాస్త డల్‌గా ఉన్నాయ్ అని చెప్పాడు. నేను వస్తాను అని వెంటనే బ్రహ్మానందంకు ఫోన్ చేసి చెప్పాను. ప్రతీ దానికి, ప్రతీ చోటా చిరంజీవి కనిపిస్తున్నాడని అంతా అనుకున్నా సరే. నాకున్న ఇమేజ్, గుడ్ విల్ వాడి ఇతర సినిమాల్ని ప్రమోట్ చేస్తాను. నా మిత్రుడు బ్రహ్మానందం గురించి అయితే నేను కచ్చితంగా వస్తాను. చంటబ్బాయ్ పాట షూటింగ్‌లో నేను బిజీగా ఉన్నప్పుడు.. ఓ వ్యక్తి విజిల్స్ వేస్తూ నానా హంగామా చేశాడు. అత్తిలి లెక్చరర్ అండి అని జంధ్యాల చెప్పారు. వెంటనే అతడ్ని పిలిచి మాట్లాడాను. మిమిక్రీ కూడా చేస్తాడని తెలిసి సాయంత్రం రమ్మని అన్నాను. అలా ప్రతీ రోజూ సాయంత్రం వచ్చేవాడు. రన్నింగ్ కారెక్టర్ అని జంధ్యాల బ్రహ్మానందంకి పాత్ర ఇచ్చి చాలా ఏడ్పించాడు. అలా మా స్నేహం మొదలైంది. ఇంత టాలెంట్ ఉన్న ఈ వ్యక్తి ఇక్కడే ఉండిపోకూడదని అనుకున్నాను. మద్రాస్‌కు తీసుకెళ్తే ఈ టాలెంట్‌ను అందరూ వాడుకుంటారు అని అనుకున్నాను. బ్రహ్మానందంను ఇంటికి తీసుకెళ్తే నా తమ్ముళ్లు వింతగా చూశారు. నాతో పాటు బ్రహ్మానందంను ప్రతీ చోటకు తీసుకెళ్లేవాడ్ని. బ్రహ్మానందుకు నేను అంబాసిడర్, ఏజెంట్‌ను అయి ప్రమోట్ చేశాను. అలా మొదలైన బ్రహ్మానందం ప్రయాణం నేటికి ఏ స్థాయికి వెళ్లిందో అందరికీ తెలిసిందే. బ్రహ్మానందం తన కొడుకుతో కలిసి చేసిన ఈ బ్రహ్మా ఆనందం మూవీని అందరూ ఆదరించాలి. ఈ మూవీని తీసిన నిఖిల్, నిర్మాత రాహుల్‌కు ఆల్ ది బెస్ట్. రఘు బాబు, వెన్నెల కిషోర్, రాజీవ్ కనకాల వంటి వారు నటించడంతో పరిపూర్ణత చేకూరినట్టు అయింది. ప్రియ, ఐశ్వర్య, దివిజలకు ఆల్ ది బెస్ట్. ఇలాంటి చిత్రాలను ఆదరించండి. ఇలాంటి వేడుకకు నన్ను పిలిచిన నా సోల్ మేట్ బ్రహ్మానందంకు థాంక్స్. ఫిబ్రవరి 14న ఈ చిత్రం పెద్ద హిట్ అవుతుంది. నీకు (బ్రహ్మానందం) పుత్రోత్సాహం కలుగుతుంది. నేను ఎలాగైతే పుత్రోత్సాహాన్ని పొందుతున్నానో.. నువ్వు (బ్రహ్మానందం) కూడా అంతే పుత్రోత్సాహాన్ని పొందుతావు' అని అన్నారు.

# 'ఇట్స్ కాంప్లికేటెడ్' థియేటర్స్ లో ఆడియన్స్ చుడాలనేది నా ఫీలింగ

స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ రొమాంటిక్ కామెడీ మూవీ కృష్ణ అండ్ హిస్ లీల. 2020లో కరోనా మహమ్మారి సమయంలో ఓటీటీలో నేరుగా విడుదలైన ఈ సినిమా ఇన్స్టంట్ హిట్ సాధించింది. రవికాంత్ పేరెపు దర్శకత్వంలో రానా దగ్గుబాటి, సంజయ్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం లవ్ స్టొరీ పై ఒక రిఫ్రెషింగ్ టేక్. ఇందులో శ్రద్ధా శ్రీనాథ్, సీరత్ కపూర్, షాలిని వడ్నికట్టి కీలక పాత్రల్లో నటించారు. రానా దగ్గుబాటి ఈ పాపులర్



చిత్రాన్ని ప్రేమికుల రోజున థియేటర్లలో విడుదల చేయనున్నారు. డిజిటల్ లో మాత్రమే విడుదలైన ఈ చిత్రం ఫిబ్రవరి 14న కొత్త ట్విస్ట్‌తో థియేటర్లలోకి వస్తుంది. ఈ సినిమా టైటిల్‌ను 'ఇట్స్ కాంప్లికేటెడ్'గా మార్చారు. ఈ కొత్త టైటిల్, ప్రమో షన్స్ మరింత ఆసక్తిని పెంచాయి. తాజాగా మేకర్స్ క్యూ అండ్ ఏ ప్రెస్ మీట్ నిర్వహించారు. రానా దగ్గుబాటి మాట్లాడుతూ.. నాకు సిద్దు రవికాంత్ తో మరో సినిమా చేయాలని వుండేది. ఇది రిలీజ్ చేస్తేగానే మరో సినిమా చేయనని అన్నారు(నవ్వుతూ) దీనికి ఫిబ్రవరి 14 రైట్ డేట్. ఇది రీరిలీజ్ కాదు. థియేటర్స్ లో ఫస్ట్ టైం రిలీజ్'అన్నారు. సిద్ధు జొన్నలగడ్డ మాట్లాడుతూ.. సినిమాని థియేటర్స్ లో ఆడియన్స్ చుడాలనేది నా స్ట్రాంగ్ ఫీలింగ్. ఫిబ్రవరి 14 సినిమాకి యాప్ట్ రిలీజ్. థియేటర్స్ లో ఆడియన్స్ ఎక్సయిట్మెంట్ చూడాలని వుంది'అన్నారు.

# ప్రేక్షకులకు కొత్త అనుభూతి 'నిదురించు జహాపన' -హీరో ఆనంద్ వర్ధన్

ప్రేమించుకుందాం రా, సూర్యవంశం, మనసంతా నువ్వే లాంటి ఎన్నో సూపర్ హిట్ చిత్రాలతో ప్రేక్షకులని అలరించిన పాపులర్ చైల్డ్ ఆర్టిస్ట్ ఆనంద్ వర్ధన్ హీరోగా పరిచయం అవుతున్నారు. ఆనంద్ వర్ధన్ హీరోగా ప్రసన్న కుమార్ దేవరపల్లి దర్శకత్వంలో ఏఆర్ ఎంటర్ టైన్మెంట్స్, శ్రీజ మూవీ మేకర్స్ బ్యానర్స్ పై సామ్, వంశీ కృష్ణ వర్మ నిర్మిస్తున్న యూనిక్ ఎంటర్ టైనర్ 'నిదురించు జహాపన'. నవమి గయాక్, రోష్ని సాహోతా హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. ఇప్పటికే రిలీజైన ప్రమోషనల్ కంటెంట్ కి చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. ఫిబ్రవరి 14న ఈ మూవీ గ్రాండ్ గా రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రీరిలీజ్ ప్రెస్ మీట్ నిర్వహించారు.



హీరో ఆనంద్ వర్ధన్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఈ సినిమా మాకు చాలా స్పెషల్. ఈ సినిమాలో ఎంత గొప్ప కథ వుందో చేయడానికి కూడా అంత గొప్ప కథ వుంది. ప్రాణం పెట్టి ఈ సినిమా చేశాం. ఇది చాలా ఇంట్రస్టింగ్ జర్నీ. తెలుగు ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇవ్వాలని కొత్త కథ చెప్పాలనే లక్ష్యంతో చేసిన సినిమా. ఒక అద్భుతమైన కాన్సెప్ట్ మీరు చూస్తారని మనస్ఫూర్తిగా నమ్ముతున్నాను. నేను ఆర్టీసీ క్రాస్ రోడ్స్ లో పెరిగాను. రెండు వందలమంది కలసి సినిమా చూడటం ఒక ఎమోషన్ నాకు. సినిమా అనేది అలాంటి ఎక్స్‌పీరియన్స్. చిన్న సినిమాలకు ఆడియన్స్ రావడం తగ్గించారు. మీరు ఆదరిస్తేనే మేము అడుగు ముందురకి వేస్తాం. దయచేసిన అందరూ థియేటర్స్ కి వచ్చి సినిమా చూడాలని కోరుతున్నాం. ఫెబ్రవరి 14న మా సినిమా రిలీజ్ కావడం మా టీం విజయం. వారి ప్రేమని మర్చిపోలేను. ఈ ప్రయాణంలో గొప్ప సపోర్ట్ ఇచ్చారు. అందరికీ థాంక్ యూ. ఈ సినిమా కథ మెయిన్ హైలెట్. ఒక లవ్ స్టొరీకి నిద్రకి ఏమిటి సబంధం అనేదే ఈ సినిమా. ఈ సినిమాలో మ్యూజిక్ సోల్. అనూప్ అద్భుతమైన ఆమ్ ఇచ్చారు. నాకు ఇంత మంచి కథాబలం వున్న సినిమా ఇచ్చిన డైరెక్టర్‌కి, నిర్మాతలకు థాంక్ యూ. అందరూ థియేటర్స్‌లో సినిమా చూడాలని కోరుకుంటున్నాను' అన్నారు.



# విజయ్ దేవరకొండ 'కింగ్‌డమ్'

యువ సంచలనం విజయ దేవరకొండ కథానాయకుడిగా ప్రతిభగల దర్శకుడు గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రంపై సినీ ప్రియులతో పాటు, సాధారణ ప్రేక్షకులలోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. 'విజయ్‌దేవరకొండ12' అనే వర్కింగ్ టైటిల్ తో తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి 'కింగ్‌డమ్' అనే శక్తివంతమైన టైటిల్ ను ఖరారు చేసినట్లు తాజాగా నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు. టైటిల్ తో పాటు టీజర్ ను కూడా ఆవిష్కరించారు నిర్మాతలు. 'కింగ్‌డమ్' టీజర్ అద్భుతంగా ఉంది. అదిరిపోయే యాక్షన్ సన్నివేశాలు, కట్టిపడేసే భావోద్వేగాలతో థియేటర్లలో ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించే యాక్షన్ డ్రామాగా 'కింగ్‌డమ్' రూపొందుతోందని టీజర్‌తో స్పష్టం చేశారు. ఈ ఇంటెన్స్ టీజర్ తో సినిమాపై అంచనాలు రెట్టింపు అయ్యాయి. 'కింగ్‌డమ్' టీజర్ తెలుగు వెర్షన్‌కి జూనియర్ ఎన్టీఆర్, తమిళ వెర్షన్‌కి సూర్య, హిందీ వెర్షన్‌కి రణబీర్ కపూర్ వాయిస్ ఓవర్ అందించారు. ఈ ముగ్గురు స్టార్లు తమ గొంతుతో రోమాలు నిక్కబొడుచుకునేలా చేసి, టీజర్‌ను మరో స్థాయికి తీసుకువెళ్లారు. 'కింగ్‌డమ్' చిత్రానికి విజయ్ దేవరకొండ ప్రాణం పెట్టి పనిచేస్తున్నారు. సినిమాని వేరే స్థాయికి తీసుకొని వెళ్ళడానికి తన వైపు నుంచి నూటికి నూరు శాతం కృషి చేస్తున్నారు. విజయ్ తన స్టార్‌డమ్‌కి తగిన సరైన కథ వస్తే.. ఏం చేయగలరో కేలవం టీజర్ తోనే రుజువు చేశారు.

# హిలేరియస్ గా 'బద్మాషులు' టీజర్ - హీరో రాగ్ మయూర్

మహేష్ చింతల, విద్యాసాగర్ కారంపురి, మురళీధర్ గౌడ్ లీడ్ రోల్స్ లో శంకర్ చేగూరి దర్శకత్వంలో రూపొందున్న హిలేరియస్ ఎంటర్టైనర్ 'బద్మాషులు'. తార స్టోరీ టెల్లర్స్ బ్యానర్ పై బి.బాలకృష్ణ, సి.రామ శంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే రిలీజైన ఈ సినిమా ఫస్ట్ లుక్ మంచి రెస్పాన్స్ వచ్చింది. మేకర్స్ టీజర్ ని లాంచ్ చేశారు. టీజర్ అవుట్ అండ్ అవుట్ హిలేరియస్ ఎంటర్ టైన్మెంట్ ని ప్రామిస్ చేసింది. మహేష్ చింతల, విద్యాసాగర్ కారంపురి, మురళీధర్ గౌడ్ పాత్రలు విశేషంగా అలరించాయి. రూరల్ రూటెడ్ కథ, కథనం, కామెడీ చాలా ఆర్గానిక్ గా వున్నాయి. డైరెక్టర్ శంకర్ చేగూరి టేకింగ్ చాలా రిఫ్రెషింగ్ గా వుంది. టీజర్ సినిమాపై మంచి బజ్ ని క్రియేట్ చేసింది. టీజర్ లాంచ్ కు చీఫ్ గెస్ట్ గా హాజరైన హీరో రాగ్ మయూర్ మాట్లాడుతూ.. చీఫ్ గెస్ట్ గా కాదు ఒక మంచి ఫ్రెండ్ గా వచ్చాను. మహేష్ అంటే నాకు చాలా ఇష్టం. తనది వండర్ ఫుల్ జర్నీ. విద్యసాగర్ మంచి నటుడు. రూటెడ్ డ్రామాలకి మంచి డిమాండ్ వుంది. ఆడియన్స్ చాలా రిలేట్ చేసుకుంటున్నారు. సినిమా బండి, సివరపల్లిలోని వైబ్ 'బద్మాషులు' టీజర్ లో కనిపించింది. టీం అందరికీ ఆల్ ది బెస్ట్. టీజర్ చాలా ఆర్గానిక్ అండ్ ఫన్నీ గా వుంది. ప్యూర్ కామెడీ వుంది. ఈ సినిమా పెద్ద సక్సెస్ కావాలని కోరుకుంటున్నాను' అన్నారు.



PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044.